ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 09.09.2026 | సంపుటి : 13 సంచిక : 51 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి

# సస్పెన్షన్



## మండలిచైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటన

- మండలిలో తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు
- మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన చైర్మన్
- సెషన్ మొత్తానికి సస్పెండ్ చేసినట్టు ప్రకటన
- సస్పెన్షన్ ఎత్తివేయాలని ఇరువురు ఎమ్మెల్సీ డిమాండ్
- మండలి ప్రాంగణంలో గందరగోళం..
- తాతా మధును లాక్కెళ్లిన మార్షల్స్

హైదరాబాద్(జనంసాక్షి):శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్ సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది.అంతకుముందు సభాపతి గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తూ చేసిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీర్మానం ప్రతిపాదించారు. స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోందని, సభా మర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోందని, మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోందని సభ తెలిపింది.బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలని, మిగతా 2లో..



స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల కేసు..

## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి అరెస్టు

హైదరాబాద్(జనంసాక్షి):బీఆర్ఎస్ఎమ్మెల్సీ తాతా మధును మంగళవారం ఉదయం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని అతని నివాసంలో పోలీసులు అరెస్టు చేశారు. ఆయనతో పాటు మరో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని కోకాపేటలోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కులం పేరుతో పాటు, అసభ్య పదజాలంతో దూషించారని స్పీకర్ ఓఎస్డీ పొల్లెపల్లి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాతా మధుపై ఎస్సీ, మిగతా 2లో..

## మహిళా సభ్యులపై దాడి చేశారు

- చర్యలు తీసుకోండి :హరీశ్‌రావు



హైదరాబాద్(జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సభలో సమస్యలు చర్చించకుండా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సబితా ఇంద్రా రెడ్డి గొంతు పిసికితే రేవంత్ రెడ్డికి కనపడలేదని, మహిళ ఎమ్మెల్యేలు ఫిర్యాదు ఇస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు ఏమనుకుంటారోనన్న జ్ఞానం లేదా అని నిలదీశారు.రేవంత్ రెడ్డి కలియుగ దుశ్శాసనుడు అంటూ ఘాటు మిగతా 2లో..

## నా తల్లిని తిట్టారు



### ఆ సంగతి మాట్లాడండి

- ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి..
- తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారమున్నా అలా చేయలేదు
- హరీశ్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆగ్రహం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో నిన్న ఉదయం జరిగిన ఘటనలపై ఇవాళ కూడా సభలో వాగ్యుద్ధం జరిగింది. ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి అంటూ..ఒక దశలో స్పీకర్ ప్రసాద్‌కుమార్.. హరీశ్‌రావుపై తీవ్ర ఆగ్ర హం వ్యక్తం చేశారు. రెండో రోజు సభ ప్రారంభమైన వెంటనే నల్లబ్యాడ్జీలతో భారత రాష్ట్రసమితి సభ్యులు హాజరయ్యారు. సీనియర్ మహిళా సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించిన పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మిగతా 2లో..



## ఎర్రవల్లి ఫాంహౌజ్ వద్ద కాంగ్రెస్

# డప్పుల దండోర

## కేసీఆర్ నివాసం ముట్టడికి దళిత నాయకుల పిలుపు

### ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన

- తీవ్ర ఉద్రిక్తత.. భారీగా మోహరించిన పోలీసులు
- పోలీసులు, ఆందోళనకారులకు మధ్య తోపులాట
- అసెంబ్లీ నుంచి ఎర్రవల్లికి బయలుదేరిన ఎర్రవల్లికి బయల్దేరిన కేటీఆర్, హరీశ్ అరెస్ట్
- కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్ ఇంటిపైకి వెళ్లేలా ఎస్కార్ట్ ఇచ్చారన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులైందని విమర్శ

ఎర్రవల్లి(జనంసాక్షి):సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద డప్పుల మోతకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వచ్చి డప్పులు మోగిస్తూ నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు. నర్సారెడ్డి ఆధ్వర్యంలో వరదరాజుపూర్‌మీదుగా కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోకి కాంగ్రెస్ కార్యకర్తలు దూసుకెళ్లారు. ఎక్కిడికక్కడ కాంగ్రెస్ శ్రేణులను బారికేడ్లు, రోప్ పార్టీతో పోలీసులు మిగతా 2లో..



ఎర్రవల్లి వద్ద ఉద్రిక్తత నేపథ్యంలో అక్కడికి బయలుదేరిన కేటీఆర్‌ను మార్గమధ్యంలో అరెస్టు చేస్తున్న పోలీసులు

## ఇది డైవర్షన్ పాలిటిక్స్

### హామీలు అమలవుతాయంటే స్వచ్ఛందంగా అరెస్టవుతాం: కేటీఆర్

- మేము సిద్ధం, మీరు సిద్ధమా?'
- సబిత, సునీతలకు జరిగిన అమానంపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్

హైదరాబాద్(జనంసాక్షి):420 హామీలు అమలు అవుతాయంటే బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరం స్వచ్ఛందంగా అరెస్టు అవుతాం. మేము సిద్ధం, మీరు సిద్ధమా?' అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. "ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయలేకపోయిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 1000 రోజుల్లో ఏం సాధించిందంటే.. అరెస్టులు, అక్రమ నిర్బంధాలు. మహిళల పట్ల గౌరవం ఉంటే నిన్న మా మిగతా 2లో..

అసెంబ్లీ వద్ద ఆందోళన..

## బీఆర్ఎస్ నేతలపై కేసులు

- కేటీఆర్, హరీశ్‌రావు సహా 14 మంది బీఆర్ఎస్ నేతలపై సైఫాబాద్ పోలీసుల వరుస కేసులు
- బీజేపీకి చెందిన 291 మందిపైనా నమోదు

హైదరాబాద్(జనంసాక్షి):పోలీసులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదైంది. శాసనసభ సమావేశం సందర్భంగా అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు సహా 14 మంది బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదైంది. మిగతా 2లో..

బీఆర్ఎస్ ఎమ్మెల్సీల రిమాండ్‌కు నాంపల్లి కోర్టు

## నిరాకరణ

ఇరువురుని పూచీకత్తు సమర్పించాలని ధర్మాసనం ఆదేశం వార్త 2లో



## బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల బాహాబాహీ

- పరస్పరం దాడి చేసుకున్న రెండు పార్టీల కార్యకర్తలు
- బోయిన్‌పల్లి పీఎస్ వద్ద ఉద్రిక్తత

కంటోన్మెంట్(జనంసాక్షి): బోయిన్‌పల్లి పీఎస్ వద్ద ఉద్రిక్తత నెల కొంది. కేటీఆర్ ఎర్రవల్లికి వెళ్తుండగా.. హకీంపేట వద్ద పో లీసులు ఆయన్ను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకుని బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నాయి. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా అక్క డికి రావడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. మిగతా 2లో..

## కేసీఆరే భాధ్యత వహించాలి

- అసెంబ్లీ ఘటన కాకతాళీయం కాదు..
- ఫామ్ హౌస్‌లో చేసిన కుట్రే..
- ఉపముఖ్యమంత్రి భట్టి




హైదరాబాద్(జనంసాక్షి):సోమవారం తెలంగాణ అసెంబ్లీ దగ్గర జరిగిన ఘటన కాకతాళీయం కాదని.. ఫామ్ హౌస్‌లో పురుడు పోసుకున్న కుట్ర అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. స్పీకర్‌ను అవమానించటం అంటే.. ఒక వ్యక్తిని అవమానించినట్లు కాదని.. సభ మొత్తాన్ని అవమానించినట్లే అన్నారు. ఇద్దరు ఎమ్మెల్సీల తీరు అత్యంత జుగుప్సాకరంగా మిగతా 2లో..

## ప్రత్యేక ప్రాంతాలుగా అరుణాచల్, అక్సాయ్‌చిన్

### అక్సాయ్‌చిన్‌కు పశ్చిమాన భారత్, తూర్పున చైనా

### ఐక్యరాజ్యసమితి కొత్త మ్యాప్‌లో ప్రత్యక్షం..!?



న్యూఢిల్లీ,సెప్టెంబర్8(జనంసాక్షి): ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన కొత్త ప్రపంచ పటం మరోసారి చర్చనీయాంశంగా మారింది. 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు తెలిపిన నేపథ్యంలో వెలువడిన ఈ మ్యాప్‌లో అరుణాచల్‌ప్రదేశ్, అక్సాయ్ చిన్‌లను భారత్, చైనా వాదిస్తున్న సరిహద్దుల మధ్య ప్రత్యేక ప్రాంతాలుగా చూపించారు. అక్సాయ్‌చిన్‌ను లడఖ్‌లో భాగంగా భారత్ పేర్కొంటున్న విషయం తెలిసిందే. ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానంపై చర్చలు జరుగుతున్న సమయంలో జులై 1న ఈ మ్యా ప్‌ను తొలిసారి విడుదల చేశారు. ఇందులో అరుణాచల్‌ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును తొలగించారు. అరుణాచల్‌ప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చూపిస్తూ.. పశ్చిమాన అసోం, ఉత్తరాన చైనా సరిహద్దుగా ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. అదే విధంగా అక్సాయ్‌చిన్‌ను కూడా ప్రత్యేక ప్రాంతంగా చూపించారు. దాని పశ్చిమ వైపు భారత్, తూర్పు వైపు చైనా సరిహద్దులు ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. మిగతా 2లో..

## భద్రాద్రి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు ముందడుగు

ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన ఏఏఐ బృందం



2లో..

## మోదీ పర్యటనకు ముందే భద్రతా వైఫల్యం



- ప్రధాని పర్యటనలో తుపాకీ కలకలం
- పీఎంవో అధికారినంటూ ఎంట్రీకి యత్నం

ముంబై(జనంసాక్షి):ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబై పర్యటనకు ముందు బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ ( లో భద్రతా కలకలం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ పాల్గొననున్న కార్యక్రమం జరిగే ప్రాంతంలో ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు తాను ప్రధానమంత్రి కార్యాలయం అధికారినని చెప్పుకున్నట్లు సమాచారం. అతని వద్ద నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక వివరాల ప్రకారం, ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ప్రాంగణంలో ఈ ఇద్దరిని గుర్తించారు. నకిలీ గుర్తింపు కార్డుతో ఉన్న వ్యక్తిని 24 ఏళ్ల రోహన్ పరేఖ్‌గా గుర్తించారు. అతనితో పాటు ఉన్న అంగరక్షకుడి మిగతా 2లో..



### శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

### నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం: మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,సెప్టెంబర్8(జనంసాక్షి): తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల మిగతా 2లో..

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీల రిమాండ్‌కు నాంపల్లి కోర్టు నిరాకరణ

స్పీకర్ ఓఎస్డీ పొల్లెపల్లి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సైఫాబాద్ పీఎస్‌లో కేసు నమోదైంది. అనంతరం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయస్థానం రిమాండ్‌ను తిరస్కరించింది.

**బీఆర్ఎస్ సభ్యులు నిషేధాజ్ఞలు ఉల్లంఘించారు: హైకోర్టుకు తెలిపిన ఏజీ**

అసెంబ్లీ వద్ద సోమవారం జరిగిన ఘటనపై తెలంగాణ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసిం ది. ఆ ఉత్తర్వులను సవరించాలని కోరింది. ఎమ్మెల్యేలను అసెం బ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశిం చిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తిం చిన వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎదుట బైఠాయించారని హైకోర్టుకు ఏజీ తెలిపారు. ప్లకార్డులు, వ్యతిరేక రాతలతో ఉన్న నల్ల టీషర్టులు ధరించి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారని.. భయానక వాతావరణం కల్పించేలా వ్యవహరించారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారని ఏజీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ్యులు నియమావళిని ఉల్లంఘించినందునే పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నిషేధాజ్ఞలు ఉల్లంఘించారన్నారు. విధుల్లో ఉన్న పోలీసులు, మహిళా కానిస్టేబుళ్లను నెట్టివేసి దూషించారని చెప్పారు. వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుంది కదా? అని హైకోర్టు ప్రశ్నించగా.. స్పీకర్ ఆదేశాలతోనే శాసనసభ్యులను పోలీసులు అడ్డుకున్నారని ఏజీ తెలిపారు.

## కేసీఆరే భాధ్యత వహించాలి

ఉందన్న భట్టి.. బీఆర్ఎస్ ఇంకా భూస్వామ్య భావజాలాన్ని వీడలేదన్నారు. ఈ వార్త చదివారా: ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

## పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు

**హైదరాబాద్(జనంసాక్షి):** పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించింది. సెప్టెంబర్ 16 సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించినట్లు పోలీసు నియామక మండలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టూఒఖఖీః) 7,437 పోస్టుల భర్తీకి జులై 29న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్ సివిల్(3,697) ఏఆర్(1,052), పోలీస్ కానిస్టేబుల్ (ఎస్ఏఆర్ పీపీఎల్ మెన్) 24, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్(1,380), ఫైర్ ఫైటర్(751), జైలు వార్డర్(208) పోస్టులున్నాయి. దరఖాస్తు చివరి తేదీ సెప్టెంబర్ 9గా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ గడువును సెప్టెంబరు 16 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు 3,38,336 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకోగా.. 2,88,530 మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లినట్టు టీఎస్ఎల్ఆర్బీ తెలిపింది. అభ్యర్థుల ఆధార్ వెరిఫికేషన్ కూడా 95 శాతానికి పైగా పూర్తయిందని పేర్కొంది. చివరి నిమిషంలో దరఖాస్తు చేస్తే సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని, అభ్యర్థులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సూచించింది.

## మరిన్ని రూట్లలో నైట్ షిఫ్ట్ బస్సు సర్వీసులు

### తెలంగాణ రాష్ట్ర టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం

హైదరాబాద్,సెప్టెంబర్8(జనంసాక్షి): గ్రేటర్ హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, అర్ధరాత్రి వేళల్లో ప్రజా రవాణాకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని టి.జి.ఎస్.ఆర్టీసీ ప్రారంభించిన రాత్రిపూట బస్సు సర్వీసులకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రయాణికుల విజ్ఞప్తులు, రాత్రిపూట అధిక ట్రాఫిక్ రద్దీ, ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని 2026 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో ఆరు ప్రధాన రూట్లలో రాత్రిపూట ప్రత్యేక బస్సు సర్వీసులను అందుబాటులోకి తెచ్చారు.అబిడ్స్, లక్డికాపూల్, కేర్ హాస్పిటల్, అన్నపూర్ణ, ఉషాకిరణ్, గుట్లబేగంపేట్, కొండాపూర్ క్రాస్ రోడ్, హఫీజ్‌పేట్, లింగంపల్లి, రామచంద్రాపురం, బీరంగుడి మీదుగా పటాన్‌చెరు వరకు సర్వీసులు.. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభించిన ఈ రాత్రిపూట సర్వీసుల్లో కేవలం ఏడు రోజుల్లోనే 9,286 మంది ప్రయాణికులు ప్రయాణించారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అర్ధరాత్రి వేళల్లో కూడా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి రావడంతో హైదరాబాద్ మహానగర ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.ప్రజల నుంచి మరిన్ని కొత్త రూట్లలో రాత్రిపూట బస్సు సర్వీసులు ప్రారంభించాలంటూ విజ్ఞప్తులు వస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రయాణికుల డిమాండ్లను, రద్దీని, రూట్ల అవసరాలను అధికారులు సమగ్రంగా పరిశీలించి భవిష్యత్తులో మరిన్ని ప్రధాన మార్గాల్లో థర్డ్ షిఫ్ట్ సర్వీసులను విస్తరిస్తామని వెల్లడించారు. ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసి, హైదరాబాద్ నగరంలో 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థను దశలవారీగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## నగరంలో మరో భారీ ఫ్లైఓవర్..

### బంజారాహిల్స్ నుంచి గచ్చిబౌలి మధ్య నిర్మాణం!

### బిడ్లు స్వీకరిస్తున్నట్టు తెలిపిన అధికారులు

హైదరాబాద్,సెప్టెంబర్8(జనంసాక్షి)

హైదరాబాద్ నగరంలో కీలక ప్రాంతమైన ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు హెచ్ఎండీఏ ఒక కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మించబోతోంది. ఈ కొత్త కారిడార్‌ను బంజారాహిల్స్ నుంచి గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ వరకు నిర్మించనున్నారు. తాజాగా ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది. అర్హులైన కాంట్రాక్టర్లు ఈ నెల 22 లోపు బిడ్లు దాఖలు చేయాలని పేర్కొంది. టెండర్లు ఖరారయ్యాక నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. ఈ కొత్త కారిడార్‌ను బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ వరకు దాదాపు 9 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి హెచ్ఎండీఏ దాదాపు రూ.1,656 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ కారిడార్ నిర్మాణాన్ని మొత్తం రెండు దశల్లో పూర్తి చేసేలా అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు. మొదటి దశలో ఫిలింనగర్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు 5 కి.మీ మేర నిర్మాణం చేపట్టనున్నారు. ఇక రెండో దశలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హకీంపేట్ కుంట వరకు 4 కి.మీ కారిడార్‌ను నిర్మించనున్నారు. ఈ కారిడార్ నిర్మాణం పూర్తయ్యాక రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దీనిపై దాదాపు ఆరు ర్యాంప్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఫిలింనగర్ రోడ్డు నం. 82 వద్ద, నార్నే రోడ్, జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 52, ఐటీసీ కోహినూర్ రోడ్, టీ-హబ్ జంక్షన్, మైండ్‌స్పేస్ వద్ద ఈ ర్యాంప్‌లను నిర్మించనున్నారు. అంతేకాదు, రాబోయే రోజుల్లో ఈ రూట్‌లో మెట్రో రైలు విస్తరణ జరిగినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ కారిడార్‌ను డిజైన్ చేశారు.

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెన్షన్

శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలని శాసనసభ తీర్మానం చేసింది. రాజ్యాంగపరమైన అత్యున్నత పదవిలో ఉండి కూడా అవమానం ఎదుర్కోవాల్సి రావటం బాధాకరమని దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఇద్దరు మండలి సభ్యులపైనా క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేస్తూ తీర్మానించారు.

**సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ :**

మండలిలో ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్‌ను బీఆర్ఎస్ సభ్యులు ఖండించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను చట్ట విరుద్ధంగా సస్పెండ్ చేశారని శాసనమండలి ఆవరణలో బైఠాయించారు. తాతా మధు, నవీన్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెన్షన్ అనంతరం ప్రాంగణంలో గందరగోళం నెలకొంది. మీడియా పాయింట్‌లో తాతా మధు మాట్లాడుతుండగా మార్షల్స్ అడ్డుకున్నారు. సస్పెన్షన్ వేటు పడినందున ప్రాంగణంలో మాట్లాడవద్దని అధికారులు తెలిపారు. తాతా మధును అదుపులోకి తీసుకుని వ్యానులో తరలించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు బీఆర్ఎస్ఎల్పీలో ఆ పార్టీ సభ్యులు సమావేశమయ్యారు.

## నా తల్లిని తిట్టారు

బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావుఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సభ్యులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. తిరిగి వారిపైనే అక్రమ కేసులు పెట్టారని ఆవేశంగా మాట్లాడారు. రాష్ట్రంలోని యావత్ మహిళలపై జరిగిన దాడిగా దీన్ని పరిగణిస్తున్నామన్నారు. " కలియుగ దుశ్శాసనుడిలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. గౌరవ సభ.. కౌరవ సభగా మారింది. ఆనాడు కౌరవులకు పట్టిన గతే రేపు.. కాంగ్రెస్ పార్టీకి పడుతుంది" అని తీవ్రంగా విమర్శించారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకుని.. హరీశ్‌రావు వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. "మహిళా సభ్యులంటే సభతో పాటు నాకు కూడా గౌరవం ఉంది. మీరు చెబితే నేను వినట్లేదా.. ఎందుకంత ఆవేశం. మీకు కాదు ఆవేశం.. నాకు ఉండాలి. నీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు" అని భావోద్వేగానికి గురయ్యారు. సబితా ఇంద్రారెడ్డి, సునీత, కోవా లక్ష్మి పట్ల తనకు కూడా గౌరవం ఉందన్నారు. నాకున్న ఎనిమిది మంది అక్కా చెల్లెళ్లతో పాటు వారు కూడా తన సోదరీమణులేనని పేర్కొన్నారు. మహిళా సభ్యులపై దురుసు ప్రవర్తనకు సంబంధించి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని స్పీకర్ స్పష్టంచేశారు.

తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారమున్నా అలా చేయలేదు: స్పీకర్

హైదరాబాద్: అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం తనకుందని.. కానీ తాను అలా చేయలేదని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మీడియాతో స్పీకర్ చిట్‌చాట్ నిర్వహించారు. "శాసనసభలో సభ్యుడు కాకపోయినా తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం నాకుంది. బీఆర్ఎస్‌లాగా వెంటనే బహిష్కరించలేను. ఏదైనా ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నాం. మహిళా సభ్యులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. రాహుల్ గాంధీ నల్ల టీషర్ట్ వేసుకుని వెళ్లారు కానీ.. అదానీ ఫొటో పెట్టుకోలేదు. తాతా మధు వ్యవహారంలో కేసీఆర్ వచ్చి క్షమాపణ చెప్పాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. సమావేశాలకు హాజరుకావాలని ప్రతి సెషన్ ముందు ఆయన్ను కోరుతూనే ఉన్నాను. ఇవాళ నేను సభ నడపలేనని చెప్పాను. ప్యానల్ స్పీకర్‌గా కడియం శ్రీహరి సభను నడిపిస్తారు" అని గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు.

మహిళా పోలీసులపై బీఆర్ఎస్ సభ్యులు చేయి వేసి నెట్టేశారు: మంత్రి సీతక్క

తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం ఉదయం జరిగిన ఘటనలపై శాసనమండలిలో మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. "విధుల్లో ఉన్న మహిళా పోలీసులపై బీఆర్ఎస్ నాయకులు చేయి వేసి నెట్టేశారు. ఆ దృశ్యాలు సభ ద్వారా బయటపెట్టాలి. స్పీకర్‌ను అసభ్య పదజాలంతో దూషించి.. ఏం అనలేదని అబద్ధాలు ఆడుతున్నారు. వారికి తల్లులు లేరా? సభా మర్యాదలు పాటించకుండా అసెంబ్లీలో స్పీకర్ మీదకి వెళ్తున్నారు. వాళ్ల ప్రభుత్వంలో మమ్మల్ని పోడియం వద్దకు కూడా రానివ్వలేదు. మహిళా పోలీసులు, ఎమ్మెల్యేలు ఉండగా హరీశ్‌రావు దుస్తులు ఎలా విప్పుతారు? సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీతక్క అన్నారు. ఈ వీడియో చూశారా: 'నా తల్లిని అన్నారు.. ఆవేశం నాకు ఉండాలి': స్పీకర్ భావోద్వేగం

స్పీకర్‌ను బెదిరించేలా బీఆర్ఎస్ సభ్యుల తీరు: శ్రీధర్‌బాబు

శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... స్పీకర్‌ను బెదిరించేలా బీఆర్ఎస్ సభ్యుల తీరు ఉందన్నారు. స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తిపై ఇలా మాట్లాడటం ఎప్పుడూ చూడలేదన్నారు. స్పీకర్‌పై బెదిరింపు ధోరణితో సభ నడవదని గుర్తించాలన్నారు. "సభలో ఇబ్బందులు ఉన్నట్లు గుర్తిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు. సభ అందరిది.. సభను ఎలా నడపాలో మీరు ఎలా చెబుతారు? స్పీకర్ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎలా మాట్లాడుతారు. స్పీకర్ పట్ల మాట్లాడలేదు.. అలా భావిస్తే ఉప సంహరణ అంటున్నారు. బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు వీడియోలో స్పష్టంగా కనిపించాయి. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలపై రికార్డులను ప్రజల ముందుంచితే స్పష్టత వస్తుంది. మహిళా సభ్యుల విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నా పట్టించుకోవట్లేదు. స్పీకర్ పట్ల దుర్భాషలాడిన విషయాన్ని పక్కన పెట్టాలని బీఆర్ఎస్ సభ్యులు చెబుతున్నారు. స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడితే తప్పుని చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉంది" అని శ్రీధర్‌బాబు అన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల పట్ల క్షమాపణలు చెప్పకుండా బీఆర్ఎస్ సభ్యులు రాజకీయం చేస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మహిళా సభ్యులపై దాడి చేశారు

వ్యాఖ్యలు చేశారు. కౌరవులకు పట్టిన గతి కాంగ్రెస్?కు పడుతుందని హరీశ్? వ్యాఖ్యానించారు. బీజేపీ సభ్యులు ప్లకార్డులతో అసెంబ్లీలోకి వెళ్లారన్న హరీశ్?, దీన్నిబట్టే బడే భాయ్ చోటే భాయ్ బంధం అర్థం అవుతోందన్నారు. సీఎం చేతకాని తనం వల్ల క్రాప్ హాలిడే ఇచ్చే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడతామని స్పష్టంచేశారు. "ఎవరిది అసభ్యకర భాష, ఎవరిది వికృత భాష అని ప్రజలు గమనిస్తున్నారు. కేసీఆర్ ఇంటి మీద ముఖ్యమంత్రి దాడికి ఉసిగొల్పారు. దీనిపై కేంద్రం జోక్యం చేసుకోవాలి. రేవంత్ రెడ్డి ఎప్పుడూ కేసీఆర్ చావును కోరుకుంటారు. ఎమ్మెల్యేల చేత కేసీఆర్ చావాలని మాట్లాడిస్తున్నారు. రేవంత్ రెడ్డి అండతోనే ఎమ్మెల్యే శంకర్ కేసీఆర్?పై మాట్లాడారు. శంకర్?పై కేసుపెట్టాలి, సభ్యత్వం రద్దు చేయాలి" అని అన్నారు.కాంగ్రెస్ ఆందోళనలతో, హైదరాబాద్ సహా పలు జిల్లాల నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు.

## ఇది డైవర్షన్ పాలిటిక్స్

ఎమ్మెల్యేలు సబిత, సునీతలకు జరిగిన అమానంపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలి. నిన్న హైకోర్టు అంత స్పష్టంగా చెప్పాక కూడా ఈరోజు కావాలని ఫేక్ కేసులు పెట్టి తాతా మధు, నవీన్ రెడ్డిని అరెస్టు చేశారంటే మీకు కోర్టులు, చట్టాల పట్ల ఉన్న గౌరవం అర్థం అవుతోంది. ప్రజలు మీ డైవర్షన్ పాలిటిక్స్‌ను గమనిస్తున్నారు" అని కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల బహాబాహీ

పీఎస్ ముందే బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పరస్పరం దాడికి పాల్పడ్డారు. రాళ్లు, కుర్చీలు విసురుకున్నారు. పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు ఎన్‌హెచ్-44పై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

## బీఆర్ఎస్ నేతలపై కేసులు...

పోలీసులపై దాడి, విధులకు ఆటంకం, బెదిరింపులు, అభ్యంతరకర వ్యాఖ్యలపై బీఎన్ఎస్ 121(1), 132, 74, 79, 351, 352, 353, 3(5) సెక్షన్ల కింద కేసు రిజిస్టర్ అయ్యింది. మహిళా పోలీసుల పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.మాజీ మంత్రి కేటీఆర్ పోలీసు సిబ్బంది కాలర్ పట్టుకుని లాగడం, తోసివేయడం, దాడి చేశారని ఫిర్యాదు చేశారు. కేసులు నమోదైన వారిలో కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, శంభీపూర్ రాజు, సంజయ్, విజయుడు, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మిలు ఉన్నారు. ఇప్పటికే ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు నమోదైంది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై కులపరంగా అవమానకర వ్యాఖ్యలు చేసిన కారణంగా తాతా మధును పోలీసులు అరెస్టు చేశారు.బీజేపీకి చెందిన 291 మందిపై కేసు : సోమవారం అసెంబ్లీ ముట్టడికి వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సహా ఐదుగురు బీజేపీ నేతలపైనా కేసులు నమోదు చేశారు. బీజేపీకి చెందిన 291 మంది కార్యకర్తలు, ఆప్‌నకు చెందిన నలుగురిపై కేసులు నమోదయ్యాయి. మరోవైపు అసెంబ్లీ విధుల్లో ఉన్న పోలీసుల వాహనంపై దాడికి పాల్పడిన పలువురు బీజేపీ నాయకులపై సైఫాబాద్ పీఎస్?లో కేసు నమోదైంది. హోంగార్డు పథలవాత్ వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. అసెంబ్లీ ఎదురుగా ఉన్న హకా భవన్ వద్ద విధి నిర్వహణలో ఉన్న సమయంలో అక్కడికి చేరుకున్న కొంతమంది బీజేపీ నాయకులు పోలీస్ ఇన్నోవా కారుపైకి ఎక్కి దాడికి పాల్పడ్డారని హోంగార్డు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, సీసీటీవీ కెమెరాల ఆధారంగా పోలీస్ వాహనాన్ని ధ్వంసం చేసిన వారిని సైఫాబాద్ పోలీసులు గుర్తిస్తున్నారు.



## తాతా మధు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అరెస్టు

ఎస్టీ వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేశారు. అరెస్టు అనంతరం తాతా మధు, నవీన్‌రెడ్డిని నారాయణగూడ పీఎస్‌కు తరలించారు.నిన్న ఉదయం అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ప్రతినిధులకు, పోలీసులకు తోపులాట సందర్భంగా ఆ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. మధ్యాహ్నం నుంచి దీనిపై శాసనసభ ప్రత్యేకంగా సమావేశమైంది. ముఖ్యమంత్రితో సహా మంత్రులు, కాంగ్రెస్, భాజపా, ఎంఐఎం, సీపీఐ ఎమ్మెల్యేలు స్పీకర్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఖండించడంతోపాటు చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చర్చ సందర్భంగా తీవ్ర భావోద్వేగానికి గురైన స్పీకర్ కంటతడి పెట్టారు.

న్యాయస్థానాలను ధిక్కరించడమే : శాసన సభ్యులను, మండలి సభ్యులను సభలోకి రానివ్వకుండా రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు క్రూరంగా, కర్కశంగా వ్యవహరించిన పోలీసులే నేడు ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్లు తాతా మధు, నవీన్ రెడ్డిలను అరెస్ట్ చేయడం దురదృష్టకరమని హరీశ్?రావు విమర్శించారు. హైకోర్టు చెప్పినా లెక్కచేయకుండా కేసులు పెట్టి అరెస్ట్ చేయడం అంటే చట్టాన్ని, న్యాయస్థానాలను ధిక్కరించడమేనన్నారు. సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కూడిన టీషర్ట్లు ధరించి అసెంబ్లీ గేటు లోపలికి వెళ్లడానికి యత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు ఆగ్రహంతో రెచ్చిపోయి స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మరో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి కూడా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఆ ఇద్దరిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి నివాసాలకు వెళ్లి పోలీసులు అరెస్టు చేశారు. దీంతో పలువురు ఎమ్మెల్యేలు, బీఆర్?ఎస్? నేతలు వారి నివాసాలకు చేరుకున్నారు.

## శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.



## ఎర్రవల్లి ఫాంహౌజ్ వద్ద కాంగ్రెస్ డప్పుల దండోర

నిలువరించారు. దీంతో పోలీసులు, ఆందోళనకారులకు మధ్య తోపులాట జరిగింది. కొందరు కార్యకర్తలు బారికేడ్లను తోసుకుని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు అర కిలో మీటరు దగ్గర్లోకి వెళ్లి డప్పుల మోతతో నిరసన తెలిపారు. పోలీసులు స్పందించి వెంటనే నిరసనకారులను వెనక్కి తీసుకొచ్చారు. ఆందోళనకారులను అదుపు చేసే క్రమంలో పలువురు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. ఒక దశలో డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి బారికేడ్లు తోసుకుని ఫాంహౌస్ వైపునకు పరుగులు తీశారు. మరో వైపు మర్కుక్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు మోహరించాయి. ఫాంహౌస్ సమీపంలో రైతు దీక్ష పేరుతో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఉదయం నుంచి ఎర్రవల్లి పరిసరాల్లో ఉద్రిక్తత కొనసాగుతోంది.

**ఎర్రవల్లికి బయల్దేరిన కేటీఆర్, హరీశ్‌రావు అరెస్ట్**

ఫామ్‌హౌస్ వద్ద పరిణామాలతో కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి ఎర్రవల్లికి బయల్దేరారు. బొల్లారం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారు. హకీంపేట వద్ద కేటీఆర్, హరీశ్‌రావును నిలిపివేశారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్ ఇంటిపైకి తీసుకుపోవాలని సూచనలు ఉన్నాయా అని పోలీసులను కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ ఇంటి వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని, వందల మంది బలగాలు అక్కడ ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఎస్కార్ట్, రోప్ పార్టీలను ఇచ్చి తీసుకుపోతున్నారని కేటీఆర్ వీడియో చూపించారు. మీపై నమ్మకం లేదు.. మా నాయకుడిని మేమే కాపాడుకోవాలి అంటూ కేటీఆర్ ముందుకు సాగారు. కాంగ్రెస్ వారిని కూడా అటువైపు వెళ్లకుండా పోలీసులు ఆపాలని సూచించారు. అనంతరం కేటీఆర్, హరీశ్‌రావు.. బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లికి పాద యాత్రగా బయల్దేరారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్ట్ చేసి జవహర్‌నగర్, బోయిన్‌పల్లి పీఎస్‌లకు తరలించారు.

**కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్ ఇంటిపైకి వెళ్లేలా ఎస్కార్ట్ ఇచ్చారు: కేటీఆర్**

ఎర్రవల్లిలో కేసీఆర్ ఫామ్ హౌస్ వద్ద ఇవాళ చోటుచేసుకున్న పరిణామాలపై మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు యంత్రాంగం ఎస్కార్ట్, రోప్ పార్టీలను ఇచ్చి మరీ కాంగ్రెస్ శ్రేణుల్ని కేసీఆర్ ఇంటిపైకి తీసుకెళ్లిందని ఆరోపించారు. "ప్రభుత్వం ఇచ్చిన హామీల వైఫల్యంపై నిలదీస్తే మొదటి రోజు సభకు వెళ్లకుండా అడ్డుకున్నారు. మమ్మల్ని గాయపరిచి అరెస్ట్ చేశారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించారు. స్పీకర్‌ని మేమేదో అన్నామని సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఆయనకు ఎక్కడ, ఎలా బుద్ధి చెప్పాలో తెలంగాణ సమాజానికి తెలుసు" అని కేటీఆర్ అన్నారు.

## మోదీ పర్యటన ముందే భద్రతా వైఫల్యం

వద్ద తుపాకీ ఉన్నట్లు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. భద్రతా సిబ్బంది తనిఖీల్లో గుర్తింపు కార్డు అనుమానాస్పదంగా కనిపించడంతో పరిశీలించగా అది నకిలీదని తేలింది. నకిలీ గుర్తింపు కార్డును ఎలా సంపాదించాడు? తాను అధికారినని ఎందుకు చెప్పుకున్నాడు? తుపాకీతో ఉన్న బాడీగార్డుతో కలిసి ప్రధాని కార్యక్రమం జరిగే ప్రదేశంలోకి ఎందుకు రావడానికి ప్రయత్నించారు? అనే అంశాలపై ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది. అయితే, ప్రస్తుతానికి ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకునే ఉద్దేశంతో వారు అక్కడికి వచ్చినట్లు ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ సెప్టెంబర్ 8న సాయంత్రం 5:45 గంటల సమయంలో ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026ను ప్రారంభించనున్నారు. సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు జరిగే ఈ ఏడో ఎడిషన్‌లో ఫైనాన్స్ భవిష్యత్తు, ఏజెంటిక్ , టోకెనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీ, డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సమ్మిళితంపై చర్చలు జరగనున్నాయి. అంతకుముందు ప్రధాని గుజరాత్‌లోని వడోదరలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకిత కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులో రూ.20,700 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌లోని 326 రూట్ కిలోమీటర్ల మూడు కీలక విభాగాలు ఉన్నాయి.ప్రధాని ముంబై పర్యటనకు ముందు నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో ఇద్దరు వ్యక్తులు పట్టుబడటం భద్రతా వ్యవస్థను అప్రమత్తం చేసింది. ఈ ఘటన వెనుక అసలు ఉద్దేశం ఏంటన్నది క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## భద్రాద్రి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు ముందడుగు

భద్రాద్రి కొత్తగూడెం(జనంసాక్షి):భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ముందడుగు పడింది. ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదిత స్థలాలను ఏఏఐ మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం పరిశీలించింది. రన్‌వే, విమానాల అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్‌పై సాంకేతిక అధ్యయనం చేసింది. రేపు కూడా ఈ బృందం జిల్లాలో పర్యటిస్తుంది.భద్రాద్రి జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు వేగవంతమయ్యాయి. ప్రతిపాదిత స్థలాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాకు చేరుకుంది. సుజాతనగర్ మండలంలోని సీతంపేటలో బృందం పర్యటించి క్షేత్ర స్థాయి పరిశీలన జరిపింది. ఏఏఐ సభ్యులు భరత్ రెడ్డి, ఎండీ ఏవియేషన్ నేతృత్వంలోని సాంకేతిక బృందం ప్రతిపాదిత విమానాశ్రయ స్థలాలను పరిశీలిస్తూ భూమి లభ్యత, స్థల విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, విమానాల రాకపోకలకు అవసరమైన అంశాలను అధ్యయనం చేసింది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ స్థలాలుగా సుజాతనగర్ మండలంలోని సీతంపేట, సుజాతనగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను గుర్తించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో స్థల పరిశీలన, సర్వే, సాంకేతిక అంశాలను పరిశీలిస్తారు.

## ప్రత్యేక ప్రాంతాలుగా అరుణాచల్, అక్సాయ్‌చిన్

ఈ మార్పులు ఎందుకు చేశారన్న దానిపై ఐరాస ఎలాంటి వివరణ ఇవ్వలేదు. జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉన్న నియంత్రణ రేఖ (ఎల్ఓసీ)ని కూడా మ్యాప్‌లో చుక్కల రేఖతో చూపించారు. దీనిపై మ్యాప్ కింది భాగంలో ఐరాస వివరణ ఇచ్చింది. భారత్, పాకిస్థాన్ అంగీకరించిన జమ్మూ కశ్మీర్ ఎల్ఓసీని ఈ చుక్కల రేఖ సుమారుగా సూచిస్తుందని పేర్కొంది. జమ్మూ కశ్మీర్ తుది స్థితిపై సంబంధిత పక్షాల మధ్య ఇంకా అంగీకారం కుదర లేదని తెలిపింది. ప్రపంచంలోని ప్రాంతాలను పటాల్లో మరింత కచ్చితంగా, సమానత్వంతో చూపించాలంటూ ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో తీసుకొచ్చిన 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం గత వారం ఆమోదించింది. ముఖ్యంగా ఆఫ్రికా ప్రాంతాల భౌగోళిక చిత్రణను మరింత సమానంగా చూపించడమే దీని లక్ష్యం. ఈ తీర్మానం చట్టబద్ధంగా అమలు చేయాల్సినది కాదు. అయితే ప్రపంచవ్యాప్తంగా బహుళపక్ష సంస్థలు ఉపయోగించే ప్రామాణిక ప్రపంచ పటాల్లో దీనికి అనుగుణంగా మార్పులు చేసే అవకాశం ఉంది. ఆఫ్రికన్ గ్రూప్ తరఫున టోగో ఈ తీర్మానాన్ని ముం దుకు తీసుకెళ్లింది. భారత్ దీనికి మద్దతు తెలిపింది. సమాన విస్తీర్ణాన్ని ప్రతిబింబించే పటాల రూపకల్పన అనే మౌలిక సూత్రానికి మద్దతుగా తాము ఓటు వేసినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఏదైనా నిర్దిష్ట పటం, మ్యాప్ ప్రొజెక్షన్ లేదా దేశాల సరిహద్దుల చిత్రణకు ఈ తీర్మానం ఆమోదం కాదని స్పష్టం చేసింది.




## తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ నిరసన

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ నిరసన వ్యక్తం చేసింది. మంగళవారం మాసబ్ ట్యాంక్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ (టీఈజీజేఏసీ) విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా టీజీవోస్ అధ్యక్షులు కృష్ణాయాదవ్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని సంఘం నాయకులు గండూరి వెంకట్, నాగులపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. అందుకోసం అన్ని శాఖల ఉద్యోగులతో సన్నాహక సమావేశాలు, నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ రోజు మండల, డివిజన్, జిల్లా కేంద్ర కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో ఈ నిరసనలు రాష్ట్రమంతటా నిర్వహిస్తున్నట్లు టీఈజీజేఏసీ ప్రకటించింది. ప్రధానంగా పి.ఆర్.సి., పెండింగ్ డి.ఎ.లు, పదోన్నతులు, హెచ్.ఓ.డి. కార్యాలయాలలో 12.5 శాతం కోటా, మొదలగునవి వెంటనే పరిష్కరించాలని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ హైదరాబాద్ సెంట్రల్ యూనియన్ నుండి వెంకట్, టీఈజీజేఏసీ మెంబర్ ఐపీఆర్ ఫోరం అధ్యక్షులు నాగులపల్లి వెంకటేశ్వర రావు, టీజీవోస్ ఫోరం జాయింట్ సెక్రటరీ వనజ, టీఎన్జీవోస్ ఐపీఆర్ ఫోరం అధ్యక్షులు జితేందర్, తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఓయూ స్నాతకోత్సవ వేదిక వద్ద విద్యార్థుల నిరసన



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవంలో గవర్నర్ నిష్క్రమణ అనంతరం తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఠాగూర్ ఆడిటోరియంలో స్నాతకోత్సవ సభ ప్రారంభమైన తర్వాత, తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగించి, పలువురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేసిన అనంతరం అక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. గవర్నర్ ఉన్నంతవరకు సజావుగా జరిగిన కార్యక్రమం, ఆయన వెళ్లిపోవడంతోనే అసలు సమస్యలు మొదలయ్యాయి. విద్యార్థులంతా ఒకేసారిగా బయటికి వచ్చేయడంతో వారిని అదుపు చేయడం భద్రతా సిబ్బందికి కష్టంగా మారింది. గవర్నర్ వెళ్లిన తర్వాత ఆడిటోరియం ప్రవేశ ద్వారం వద్ద గందరగోళం నెలకొంది. స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ప్రతి విద్యార్థి వద్ద నుంచి యూనివర్సిటీ యంత్రాంగం రూ. 2,500 చొప్పున ఫీజు వసూలు చేసింది. అయితే ఉదయం నుంచి వేచి ఉన్న తమకు కనీసం మంచినీళ్లు కూడా పూర్తిస్థాయిలో అందించలేకపోయారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆడిటోరియం ఎంట్రన్స్ గేటు దగ్గర రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉండగా, ఒక్కొక్కరి నుంచి రూ. 2,500 వసూలు చేసి, కనీస ఏర్పాట్లు చేయలేదని, స్నాక్స్ బాక్సులు అందరికీ అందకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

### ఏర్పాట్లలో ఓయూ అధికారుల వైఫల్యం..

మొత్తంగా 85వ స్నాతకోత్సవం నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లలో ఓయూ అధికారుల సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు, నిర్వహణ తీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ప్రతిష్మాత్మక కార్యక్రమం నిర్వహణలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

## సభలో బీఆర్ఎస్‌కు ఒక న్యాయం, బీజేపీకి ఒక న్యాయమా..?

- ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** శాసనసభలో బీఆర్ఎస్ పార్టీకి ఒక న్యాయం, బీజేపీకి ఒక న్యాయమా..? అని ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్లని టీషర్టులు, వాటిపై ఏదో రాసి ఉందనే కారణంతో వారిని సభలోకి అనుమతించలేదని, మరి బీజేపీ సభ్యులు ప్లకార్డులను ప్రదర్శించడాన్ని ఎందుకు అనుమతించారని ఆయన నిలదీశారు. టీషర్టుల ధరిస్తే సభలోకి అనుమతి లేనప్పుడు, సభలో ఫొటలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించేందుకు కూడా ఇవ్వకూడదు కదా అని క్వశ్చన్ చేశారు. మీరు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీని ఒకలా, బీజేపీని ఒకలా ట్రీట్ చేస్తున్నారని, ఇది కరెక్టు కాదని అక్బరుద్దీన్ చెప్పారు. బీజేపీకి స్పెషల్ ట్రీట్‌మెంట్ ఎందుకని ప్రశ్నించారు. రూల్స్ అందరికీ ఒకేలా ఉండవా..? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వ తీరును ఈ విధంగా ఎండగట్టారు. సభాపతి స్థానంలో కడియం శ్రీహరి కూర్చుని ఉన్న సమయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## రక్షణ లేని ఉత్పత్తి వ్యర్థం

- ఏరియా జిఎం శ్రీనివాస్



శ్రీరాంపూర్(జనంసాక్షి):ఉత్పత్తి కంటే రక్షణే ముఖ్యమని రక్షణ లేని ఉత్పత్తి వ్యర్థం అని ఎక్స్ప్లోజివ్స్ వినియోగం,ప్రమాదాల నివారణపై శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి గనుల ఏజెంట్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్ లు,మేనేజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఏరియా సింగరేణి జీఎం శ్రీనివాస్ అన్నారు.జిఎం మాట్లాడుతూ పని ప్రదేశాలలో రక్షణ కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని,రూఫ్ ఫాల్,సైడ్ఫాల్,హాలేజ్ లాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఎక్స్ప్లోజివ్, ఎలక్ట్రికల్ ప్రమాదాలు జరగకుండా చూడాలని వీటి విషయంలో డీజీఎంఎస్ నుంచి ఎలాంటి మినహాయింపులు ఉండవన్నారు.గని మేనేజర్లు, సేఫ్టీ ఆఫీసర్ల కు ఎక్స్ప్లోజివ్స్ విషయంలో అప్రమత్తత అవసరం అన్నారు.ఎలక్ట్రానిక్ డిటోనేటర్ ల వినియోగంలో షాట్ ఫైరర్స్,సర్దార్, సూపర్వైజర్లకు గనుల వారీగా శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ప్రతీ మేనేజర్ తమ గనికి కేటాయించిన ఎక్స్ప్లోజివ్స్ నాణ్యత పరిశీలించి ఫాల్ట్,డ్యామేజ్ వాటిని సప్లయర్ కు తిప్పి పంపాలి అని సూచించారు. అవర్ ఏమ్ జీరో హామ్ లక్ష్యంగా రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్,ఏరియా ఇంజనీర్ సురేష్,ఏజీఎం ఫైనాన్స్ శ్రీధర్,ఐకే ఓసీ పీఓ ఏవీ రెడ్డి,ఆర్కే గ్రూప్ ఏజెంట్ శ్రీధర్,ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ రవికుమార్, డీజీఎం లు అనిల్ కుమార్,విజయ్ కుమార్,మల్లయ్య,అన్ని గనుల మేనేజర్లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా వ్యాప్తంగా రైస్ మిల్లర్ల సమ్మె

- రైస్ మిల్లర్లపై అణిచివేత ధోరణి చూపుతున్న పాలకులు...
- రైస్ మిల్లర్ల ను దొంగల్లా చూస్తున్న అధికారులు
- రైస్ మిల్లర్ల సమస్యలను పట్టించుకోని సంబంధిత అధికారులు
- ములుగు జిల్లాలో మిల్లింగ్ కార్యకలాపాల నిలిపివేత
- జిల్లా కలెక్టర్ కు వినతి అందజేసిన రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్





**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్08(జనం సాక్షి):** ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మె కార్యక్రమంలో ములుగు జిల్లా రైస్ మిల్లర్లు కూడా మంగళవారం నుంచి ములుగు జిల్లా రైస్ మిల్లర్లం అందరం పాల్గొంటున్నట్టు ములుగు రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ ప్రెస్ మీట్ లో తెలియజేశారు.అంతకు ముందు జిల్లా కలెక్టర్ వినతి అందజేసి సమ్మె కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు.బాదం ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పెరుగుతున్న నిర్వహణ వ్యయాలు,ప్రభుత్వానికి సమర్పించిన న్యాయసమ్మతమైన డిమాండ్ల పరిష్కారంలో జరుగుతున్న జాప్యం తదితర అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఈ సమ్మె కార్యక్రమం ను చేపడుతున్నాము. అందులో భాగంగా రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు 08 సెప్టెంబర్ 202 నుండి ములుగు జిల్లాలోని రైస్ మిల్లింగ్ కార్యకలాపాలను నిలిపివేసి సమ్మెలో పాల్గొంటున్నామని తెలిపారు.

### ఫిజికల్ వెరిఫికేషన్స్ తో ఇబ్బందులకు గురిచేస్తూ....

సిఎస్సి వారి కేఎంఎస్ 2025-26 ధాన్యంపై ఫీజికల్ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు.అనేక అనివార్య కారణాల వలన ప్రస్తుతం మా మిల్లులలో సుమారు 15% నుంచి 20% వరకు తరుగు ఉన్నది. ప్రతి బుధవారం ఎఐ యాప్ ద్వారా నాలుగు మిల్లర్ల చొప్పున ఎంచుకొని ఫిజికల్ వెరిఫికేషన్ పేరుతో ఇబ్బందులకు గురి చేయడం తగదని తెలిపారు.15% నుంచి 20% షార్ట్ ఫాల్ కు కార్పొరేషన్ కాస్ట్ షీట్ ప్రకారం డబ్బులు చెల్లించమని ఒత్తిడి చేయడం, బదులుగా ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు సిఎంఆర్ డెలివరీలు పూర్తి చేయడం కోసం అవకాశం కూడా ఇవ్వాలని కోరారు.

### రబీ 2025-26 బాయిల్డ్ ధాన్యం సమస్య....

రబీ 2025-26 సీజన్ లో వచ్చిన బాయిల్డ్ రకం ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులలోనే దించాము. ప్రతి గింజను బాయిల్డ్ బియ్యంగానే ఇవ్వగలము.ఒకవేళ ప్రభుత్వానికి అది అవసరం లేకపోతే,ఆ ధాన్యాన్ని టెండర్ల ద్వారా లేదా ఇతర మార్గాల ద్వారా మా మిల్లుల నుండి తరలించుకునే చర్యలు చేపట్టాలి. తరలింపు తర్వాత ఏదైనా షార్ట్ ఫాల్ ఉంటే, ఆ ధాన్యానికి డబ్బులు చెల్లించుటకు లేదా సిఎంఆర్ బియ్యం పెట్టుటకు మేము సిద్ధంగా ఉన్నాము.

### నాన్-ఫాక్స్ ధాన్యం వలన ఆర్థిక నష్టం...

రైతులు నాన్-ఫాక్స్ ధాన్యం మిల్లులకు పంపడం వలన, ఎఫ్సీఐ మరియు సివిల్ సప్లై లో బియ్యం పాస్ అవ్వాలంటే తప్పనిసరిగా సార్టెక్స్ వేయవలసి వస్తుంది. దీని వలన 10% వరకు డిస్-కలర్, డ్యామేజ్ బియ్యం వస్తుంది. దానిని లిక్కర్ మరియు ఈథనాల్ ఫ్యాక్టరీలకు తక్కువ ధరకు అమ్మడం వలన క్వింటాల్ కు రూ.750/- నుండి రూ.1000/- వరకు ఆర్థికంగా నష్టపోతున్నాము.

### 9నెలల నుంచి ప్రభుత్వం సీఎంఆర్ లో జాప్యం వలనే తరుగు....

కేఎంఎస్ 2025-26 ఖరీఫ్ ధాన్యం మిల్లులలో దిగుమతి చేసుకున్న తర్వాత,9 నెలల వరకు ప్రభుత్వం సీఎంఆర్ తీసుకోలేదు. దీని వలన 41 కిలోలు ఉండాల్సిన బస్తా నేడు 37 కిలోలకు తగ్గింది. అంటే సుమారు 10% తరుగు ఏర్పడింది.ఇది పూర్తిగా ప్రభుత్వ జాప్యం వలన జరిగిన తరుగు తప్ప,మిల్లర్ల వలన జరిగింది కాదు.

### ఓపెన్ స్టోరేజీ మరియు గోదాముల కొరత.....

రబీ 2025-26 సీజన్ లో ప్రభుత్వ అధికారుల ఒత్తిడి మేరకు,రైతులకు మరియు ప్రభుత్వానికి సహకరించాలనే ఉద్దేశంతో మేము ఓపెన్ స్టోరేజీలో కూడా ధాన్యం దిగుమతి చేసుకున్నాము.ప్రస్తుతం బాయిల్డ్ బియ్యం పెట్టడానికి టార్గెట్ లేక, గోదాములలో స్థలం లేక, ఎఫ్సీఐ బియ్యం తీసుకోవడం లేదు. దీని వలన ధాన్యం పాడైపోయి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతాము. కావున వెంటనే ఎఫ్సీఐ వారితో మాట్లాడి బాయిల్డ్ బియ్యం తీసుకునే విధంగా మరియు గోదాములలో స్థలం ఇప్పించే విధంగా చర్యలు తీసుకోగలరని కోరారు.

## పోలీస్ పెట్రోలింగ్ వాహనంతో పరార్

- పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోనే అపహరణ
- సీసీటీవీ ఆధారంగా నిందితుడిపై కేసు నమోదు
- నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించిన కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు



కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 08 (జనంసాక్షి) : కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ పోలీస్ పెట్రోలింగ్ వాహనం అపహరణకు గురైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సెప్టెంబర్ 07న రాత్రి విధుల అనంతరం సుమారు 11.45 గంటల సమయంలో ప్రభుత్వ పెట్రోలింగ్ ఇన్నోవా క్రిస్టా వాహనంను కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పార్క్ చేసి ఉంచారు. పెట్రోలింగ్ విధులు ముగించుకుని వాహనం స్టేషన్ ప్రాంగణంలో ఉన్న సమయంలో అది కనిపించకుండా పోయింది. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా మొహమ్మద్ అజాజ్(28)అనే వ్యక్తి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోకి ప్రవేశించి, వాహనం తాళం తీసుకుని వాహనాన్ని బయటకు తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఈ ఘటనపై వాహనానికి సంబంధించిన అధికారి ఫిర్యాదు మేరకు కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బిఎన్ఎస్ సెక్షన్ 305(బి) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అపహరణకు గురైన వాహనం విలువ సుమారు రూ.13 లక్షలుగా పేర్కొన్నారు. నిందితుడిని, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కోర్టులో హాజరుపరిచామని గౌరవ కోర్టు రిమాండ్ విధించగా నిందితుడిని జైలుకు తరలించినట్లు టౌన్ ఏసీపీ వెంకటస్వామి తెలిపారు.

## ప్రశాంత్ నగర్ పారిశ్రామిక వాడలో అగ్నిప్రమాదం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రశాంత్ నగర్‌లో పారిశ్రామిక వాడలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రశాంత్ నగర్‌లో ఉన్న ఏబీసీ ప్రింటింగ్ ఇంక్ తయారీ కేంద్రంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణం అయి ఉంటుందని ప్రాథమికంగా తెలుస్తోంది. మంటలు భారీగా ఎగిసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న కూకట్ పల్లి అగ్నిమాపక శాఖ అధికారులు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, ఆస్తి నష్టం, ప్రాణనష్టం తదితర వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## మహానటి సావిత్రిలాగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల నటన

- అసెంబ్లీకి వచ్చి దళిత సమాజానికి కేసీఆర్ క్షమాపణ చెప్పాల్సిందే
- ప్రభుత్వ విప్‌ల డిమాండ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు మహానటి సావిత్రి కంటే గొప్పగా నటిస్తున్నారని ప్రభుత్వ విప్ విజయ రమణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో అప్పుడప్పుడు మహానటి సావిత్రి సినిమాలు చూశామని, ఆమె నటన కంటే బ్రహ్మాండంగా నటిస్తున్నారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి వచ్చి దళిత సమాజానికి కేసీఆర్ క్షమాపణ చెప్పాల్సిందేనని విజయ రమణారావు డిమాండ్ చేశారు. స్పీకర్ కంట తడి పెట్టినా కూడా కేసీఆర్‌కు కనిపించడం లేదని విమర్శించారు. దళితులకు వ్యతిరేకులు బీఆర్ఎస్ నేతలేనని, బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ అని ఆరోపించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, లేకుంటే తల నరుక్కుంటానని కేసీఆర్ గతంలో అన్నారని పేర్కొన్నారు. అయితే దళితులకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని, తల కూడా నరుక్కోలేదని వ్యాఖ్యానించారు. తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రయత్నాలు చేస్తున్నారని విజయ రమణారావు అన్నారు. దళిత స్పీకర్ తల్లిని తిట్టి అవమానించారని ఆరోపించారు.

### 'కేసీఆర్ అసెంబ్లీకి రావాలి' : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఇప్పటివరకు స్పీకర్‌కు క్షమాపణ చెప్పలేదన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు సభ్యత్వాన్ని రద్దు చేయాలని, అసభ్యంగా ప్రవర్తించిన హరీశ్‌రావు సభ్యత్వం కోల్పోయేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో ఎలాంటి నిరసనలు చేయొద్దని మినిట్స్ రాశారని ఆది శ్రీనివాస్ గుర్తుచేశారు. ఆ సమయంలో హరీశ్‌రావు అసెంబ్లీ వ్యవహారాల మంత్రిగా ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పుడు బ్యాండేజ్ వేసుకుని సానుభూతి కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వారి యాక్షన్‌ను తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. మరో ప్రభుత్వ విప్ రామచందర్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబంలో దళిత వ్యతిరేక డీఎన్ఏ ఉందని ఆరోపించారు. దళిత స్పీకర్‌ను అవమానించారని, దళిత సమాజానికి కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నవీన్‌రెడ్డి గంజాయి మొక్కకు బంతిపువ్వులా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే నవీన్‌రెడ్డి పోలీసులపై దాడి చేశారని ఆరోపించారు. తాతా మధు సభ్యత్వాన్ని రద్దు చేయాలని, కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి క్షమాపణ చెప్పాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు.

## వారాంతంలో వరుస సెలవులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులు, ఉద్యోగులకు ఈ వారాంతంలో వరుసగా 3 రోజుల పాటు సెలవులు రానున్నాయి. వారం రోజుల వ్యవధిలో రానున్న పండుగలు, వారాంతపు సెలవులతో ప్రజలు ప్రయాణాలు, వేడుకలకు సిద్ధమవుతున్నారు. సెప్టెంబర్ 12న రెండో శనివారం, సెప్టెంబర్ 13న ఆదివారం కావడంతో సాధారణ వారాంతపు సెలవులు రానున్నాయి. ఆ వెంటనే సెప్టెంబర్ 14న సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీంతో విద్యార్థులకు, ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు లభించనున్నాయి. వినాయక చవితి తర్వాత జరిగే గణేష్ నిమజ్జనోత్సవాల రోజున కూడా ప్రాంతాల వారీగా స్థానిక పరిస్థితులను బట్టి ప్రత్యేక సెలవులు ఉండే అవకాశం ఉంది. ఉత్సవాలు ఘనంగా జరిగే ప్రధాన ప్రాంతాల్లో అధికారికంగా, స్థానికంగా వెసులుబాట్లు కల్పించనున్నారు. పండుగను పురస్కరించుకుని ఇప్పటి నుంచే తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు ఊపందుకున్నాయి.

## ఇన్‌స్టామార్ట్, అమెజాన్ స్టోర్స్‌లో పాడైన ఆహారం

- రూ.1.3 కోట్ల ఫుడ్ ప్రొడక్ట్స్ సీజ్



**బెంగళూరు (జనంసాక్షి) :** ఆన్‌లైన్‌లో ఆఫర్లుంటే చాలు ఫుడ్ ప్రొడక్ట్స్ ఆర్డర్ చేస్తుంటాం. కానీ, వాటి క్వాలిటీ గురించి పెద్దగా పట్టించుకోం. అందుకే, ఇకపై అలా ఆర్డర్ చేయాలంటే కాస్త జాగ్రత్తగా ఆలోచించండి. ఎందుకంటే ఆన్‌లైన్ స్టోర్స్ అయిన ఇన్‌స్టామార్ట్, అమెజాన్ స్టోర్స్‌లో అనేక ఫుడ్ ప్రొడక్ట్స్ పాడైపోయినవి ఉన్నాయి. కర్ణాటక రాజధాని బెంగళూరులోని పలు స్టోర్స్‌లలో అధికారులు ఇటీవల దాడులు చేయగా ఇలా పాడైన ప్రొడక్ట్స్ భారీగా బయటపడ్డాయి. ఈ ఆహార పదార్థాల విలువ రూ.1.38 కోట్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కర్ణాటకకు చెందిన ఫుడ్ సేఫ్టీ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు బెంగళూరులోని అనేకల్, హోస్కోటేతోపాటు పలు ప్రాంతాల్లోని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, అమెజాన్ స్టోర్లపై దాడి చేశారు. ఈ సందర్భంగా అక్కడి ఫుడ్ స్టోర్లలో ఎక్స్‌పైర్ అయిన, తప్పుడు లేబుల్స్ కలిగిన పలు రకాల ఫుడ్ ప్రొడక్ట్స్‌ను అధికారులు గుర్తించారు. అనేక ఆహార పదార్థాల నిల్వకు తగిన సేఫ్టీ స్టాండర్డ్స్ పాటించడం లేదనే విషయాన్ని గుర్తించారు. ఇలా పాడైన, కుళ్లిన ఆహార పదార్థాల్ని అధికారులు సీజ్ చేశారు. ఆ స్టోర్స్‌ను కూడా మూసివేశారు. ఇలా మొత్తంగా అమెజాన్, ఇన్‌స్టాగ్రామ్ స్టోర్స్‌లలో మొత్తం రూ.1.38 కోట్ల విలువైన ఫుడ్ ప్రొడక్ట్స్‌ను సీజ్ చేశారు. వీటిలో కాజు, రాగి పిండి, చికెన్ ప్యాటీ, పనీర్, కుకీస్, నట్స్, ఎగ్స్, పలు రకాల పిండి, ఇతర ప్యాకేజ్డ్ ప్రొడక్ట్స్ ఉన్నాయి. అలాగే, కొన్ని ఆన్‌లైన్ మెడికల్ స్టోర్స్‌పై దాడి చేయగా 2.45 లక్షల విలువైన పాడైన మెడిసిన్స్‌ను గుర్తించారు. ఇటీవల బెంగళూరులో పెప్టైడ్ పార్టీ జరిగిన సంగతి తెలిసిందే. ఈ పార్టీకి సంబంధించిన విచారణ జరుపుతుండగా.. బయటపడ్డ కొన్ని డాక్యుమెంట్లను పరిశీలించగా.. వివిధ ఆన్‌లైన్ స్టోర్స్ వ్యవహారం బయటపడింది. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భారీ ఎత్తున అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
9 సెప్టెంబర్ 2026

సంపాదకీయం

# భద్రతా వైఫల్యం - ఆలోచించాల్సిన అంశం

ప్రధానమంత్రి పాల్గొనే కార్యక్రమం అంటే సాధారణ సభ కాదు. అత్యున్నత స్థాయి భద్రతా ప్రమాణాలు అమలయ్యే వేదిక. అలాంటి ముంబయి గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పీఎంఓ పేరుతో నకిలీ గుర్తింపు కార్డుతో ప్రవేశించేందుకు ప్రయత్నించడం, పైగా తుపాకీతో రావడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. దీనిని ఒక వ్యక్తి చేసిన నేరంగా మాత్రమే పరిగణించడం సరిపోదు. భద్రతా వ్యవస్థలోని అప్రమత్తత, తనిఖీ విధానాలపై ఇది నేరుగా ప్రశ్నలు సంధిస్తోంది.


అప్రమత్తమైన పోలీసులు ఇద్దరిని గుర్తించి తుపాకీని స్వాధీనం చేసుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. వారి చురుకుదనం అభినందనీయం. అయితే అసలు ప్రశ్న–నకిలీ గుర్తింపు కార్డు, ఆయుధంతో ఉన్న వ్యక్తులు భద్రతా వలయాన్ని దాటి కార్యక్రమానికి సమీపం వరకూ ఎలా చేరుకున్నారు? అన్నదే.

అత్యున్నత భద్రతా కార్యక్రమాల్లో గుర్తింపు ధ్రువీకరణ, అనుమతుల పరిశీలన, బహుళస్థాయి తనిఖీలు తప్పనిసరి. అయినప్పటికీ ఈ ఘటన చోటుచేసుకోవడం భద్రతా విధానాలను సమగ్రంగా సమీక్షించాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. నకిలీ పత్రాలను గుర్తించే సాంకేతిక వ్యవస్థలతో పాటు, మానవ నిఘా, భౌతిక తనిఖీలను కూడా మరింత పటిష్టం చేయాలి.

అంతేకాదు, నిందితుల అసలు ఉద్దేశం ఏమిటి? పీఎంఓ పేరుతో నకిలీ గుర్తింపు కార్డు ఎందుకు తయారు చేశారు? తుపాకీతో కార్యక్రమానికి చేరుకోవడం వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా? ఈ ప్రశ్నలకు దర్యాప్తు సమాధానం చెప్పాలి. వ్యక్తుల అరెస్టుతోనే వ్యవహారం ముగియకూడదు; భద్రతా వలయంలో లోపం ఎక్కడ ఏర్పడిందో కూడా బాధ్యతతో తేల్చాలి.

భద్రతా వ్యవస్థలో చిన్న లోపం కూడా పెద్ద ముప్పుగా మారే అవకాశం ఉంది. ఈసారి పోలీసుల అప్రమత్తత ప్రమాదాన్ని అడ్డుకుంది. కానీ జాతీయ భద్రతను 'అదృష్టం'పై ఆధారపెట్టలేం. ప్రధానమంత్రికి భద్రత అంటే ఒక వ్యక్తి రక్షణ మాత్రమే కాదు–దేశ భద్రతకు సంబంధించిన అంశం. ఈ ఘటనను హెచ్చరికగా తీసుకుని లోపాలను సరిదిద్దడం, భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయడం అత్యవసరం.

# భాషపై ఆధిపత్యం అంటే ప్రజలపై ఆధిపత్యమే..!



కాళోజీ నారాయణరావు జయంతి వచ్చిందంటే సర్కారు కార్యక్రమాలు, పూలమాలలు, నివాళులు, ప్రసంగాలు షురూ అయితయి. కాళోజీని పొగిడే మాటలకు కొదవుండదు. కానీ కాళోజీని నిజంగా గౌరవిస్తున్నామంటే ఒక్కసారి మనల్ని మనమే అడుగుకోవాలె, ఆయన బతికించిన ప్రజల భాషకు మనం ఎంత గౌరవం ఇస్తున్నం? తెలంగాణ మట్టిలో పుట్టిన యాసకు, పల్లె పలుకుకు, సామాన్యుడి నుడికారానికి, ఉద్యమకారుల గొంతుకకు మన పాలనలో ఎంత చోటిచ్చినం? కాళోజీని కేవలం కవిగా చూస్తే ఆయన గొప్పతనాన్ని సగమే అర్థం చేసుకున్నట్టే. ఆయన అక్షరం ఒక తిరుగుబాటు. ఆయన భాష ఒక ప్రశ్న. ఆయన యాస తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. సామాన్యుడు ఏ భాషలో మాట్లాడతడో అదే భాషలో ఆయన సామాన్యుడి బాధను, కోపాన్ని, ఆకాంక్షను చెప్పిండు."అన్యాయాన్ని ప్రశ్నించాలి, ప్రజల పక్షాన నిలబడాలి, భయపడకుండా నిజాన్ని చెప్పాలి" అనేది. అధికారం ఎవరిదైనా ప్రజా హక్కులకు భంగం కలిగితే ఎదిరించడం, అణగారినవారి గొంతుకగా నిలవడం, స్వార్థానికి కాకుండా సమాజ శ్రేయస్సుకు ఉద్యమించడం ఆయన ఆలోచనల్లో కనిపిస్తుంది. ఉద్యమం కేవలం నినాదాలకే పరిమితం కాకుండా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, నిరంతరం పోరాడే బాధ్యతగా ఉండాలని కాళోజీ సందేశం సూచిస్తుంది. ఆయనకు ఉద్యమకారుడు అంటే ప్రజల కోసం ప్రశ్నించే వ్యక్తి, అన్యాయంపై రాజీలేని పోరాటం చేసే వ్యక్తి.అందుకే కాళోజీని జయంతి రోజున పూలతో సత్కరించి, మిగతా రోజుల్లో తెలంగాణ యాస మాట్లాడేవాళ్లను చిన్నచూపు చూస్తే అది నివాళి కాదు నటన మాత్రమే.

ప్రజాస్వామ్యంలో ఓటు వేసే హక్కు ఎంత ముఖ్యమో, ప్రజలు తమ మాటను స్వేచ్ఛగా చెప్పే హక్కు కూడా అంతే ముఖ్యం. పల్లె మనిషి మాట్లాడే యాసను తక్కువ చేసి చూడటం అంటే అతని జీవితాన్నే తక్కువ చేసి చూసినట్టే.ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అర్థమయ్యే భాష ఉండాలె. విద్యా సంస్థల్లో తెలంగాణ సాహిత్యానికి, స్థానిక పదజాలానికి, జానపద సంపదకు చోటుండాలె. మీడియా కూడా తెలంగాణ యాసను కామెడీగా చూపించే పాత ధోరణి నుంచి బయటపడాలె. తెలంగాణ యాసలో మాట్లాడితే వెనుక బడ్డవాళ్లం కాదు. పల్లె నుడికారం వస్తే చదువు తక్కువైనట్టు కాదు. మన యాస మన గుర్తింపు. మన భాష మన ఆత్మగౌరవం.ఇప్పటి డిజిటల్ కాలంలో ఈ బాధ్యత మరింత పెరిగింది. సోషల్ మీడియా, ఆన్‌లైన్ విద్య, కృత్రిమ మేధస్సు, ప్రభుత్వ డిజిటల్ సేవలు,అన్నింటిలో నాణ్యమైన తెలుగు అందుబాటులోకి రావాలె. తెలంగాణ మాండలికంలోని పదాలు, సామెతలు, పాటలు, కథలు, జానపద జ్ఞానం రేపటి తరాలకు అందేలా డిజిటల్‌గా భద్రపరచాలె. 'నా గొడవ' కాలోజీ నారాయణ రావు రచించిన ప్రముఖ కవితా సంపుటి. ఇందులో కవి తన వ్యక్తిగత బాధను మాత్రమే కాకుండా సమాజంలోని అన్యాయం, అసమానతలు, దోపిడీ, రాజకీయ అవినీతి, ప్రజల కష్టాలను తన గొడవగా వ్యక్తీకరించారు. ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించడం, అన్యాయాన్ని ఎదిరించడం, స్వేచ్ఛ--సామాజిక న్యాయం కోసం పోరాడటం ఈ రచనలో ప్రధాన లక్షణాలు. కాలోజీ భాష సూటిగా, సరళంగా, వ్యంగ్యంతో కూడినదిగా ఉంటుంది. అందుకే 'నా గొడవ' అనేది ఒక వ్యక్తి గొడవ కాదు,ప్రజల గొంతుకగా, సమాజ మార్పు కోసం వినిపించిన నిరంతర పోరాట స్వరంగా నిలిచింది.

కాళోజీకి నిజమైన నివాళి ఆయన విగ్రహానికి పూలమాల వేయడంలో లేదు. ఆయన చూపిన దారిలో నడవడంలో ఉంది. ప్రజల భాషను గౌరవించడంలో ఉంది. అణగారిన వర్గాల గొంతుకకు బలం ఇవ్వడంలో ఉంది. ప్రశ్నించే హక్కును కాపాడడంలో ఉంది.కాళోజీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ ఉద్యమకారులను, తెలంగాణ కోసం కొట్లాడిన ప్రతి ఉద్యమకారుడిని గౌరవించడం అంటే వారి చరిత్రను గుర్తుచేసుకోవడమే కాదు,వాళ్ల కలలు కన్న సామాజిక న్యాయం, ప్రజా గౌరవం, భాషా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలను ముందుకు తీసుకుపోవడం.కాళోజీని ప్రభుత్వ ప్రకటనల్లో బంధించొద్దు. ఆయనను పూలమాలల్లో పరిమితం చేయొద్దు. ప్రజల నోట వినిపించే ప్రతి నిజమైన మాటలో ఆయనను బతికించాలె.తెలంగాణ యాసను ఎవరైనా ఎగతాళి చేస్తే కాళోజీ ప్రశ్న గుర్తుకు రావాలె. ఉద్యమకారుల త్యాగాలను ఎవరైనా మరిచిపోతే వాళ్ల పోరాట చరిత్ర గుర్తుకు రావాలె. ప్రజల గొంతును ఎవరైనా అణచాలనుకుంటే ప్రజాస్వామ్య స్ఫూర్తి ముందుకు రావాలె.కాళోజీ జయంతి ఒక పండుగ మాత్రమే కాదు,మన భాష, మన ప్రజాస్వామ్యం, మన ఉద్యమ చరిత్రను మనమే చూసుకునే అద్దం.ప్రజల భాషకు గౌరవం ఉన్న చోటే నిజమైన ప్రజాస్వామ్యం ఉంటుంది. తెలంగాణ కోసం ఎన్నో ఏండ్లు పోరాడిన ఉద్యమకారులు ప్రజల్లో తిరిగారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా తెలంగాణ గొంతుకను వినిపించారు. ఆ ఉద్యమంలో భాష ఉంది, యాస ఉంది, సంస్కృతి ఉంది, ఆత్మగౌరవం ఉంది. ఉద్యమకారుల త్యాగాలకు గుర్తింపు ఉన్న చోటే తెలంగాణ ఆత్మ బతికుంటుంది.ప్రజల మాట బతికినంతకాలం కాళోజీ బతికే ఉంటడు. ఉద్యమకారుల ఆశయం బతికినంతకాలం తెలంగాణ ఆత్మగౌరవం బతికే ఉంటది.

తెలంగాణ రాష్ట్రం రావాలంటే కేవలం భౌగోళిక సరిహద్దులు మారితే సరిపోదని, తెలంగాణ మనిషి మాటకు, బతుకుకు, గుర్తింపుకు గౌరవం దక్కాలనే ఆకాంక్ష ఉద్యమానికి బలం ఇచ్చింది.అలాంటి ఉద్యమకారులను గౌరవించడం అంటే కేవలం శాలువా కప్పడం కాదు. వాళ్లు ఏ ఆశయాల కోసం కొట్లాడిండ్రో వాటిని పాలనలో అమలు చేయడం.ఉద్యమకారుల త్యాగాలను గుర్తుపెట్టుకోవడం అంటే వాళ్ల పేర్లు సభల్లో చెప్పడం కాదు, వాళ్ల కలల తెలంగాణను నిర్మించడం.తెలంగాణ కోసం పోరాడిన కాంగ్రెస్ ఉద్యమకారుల పాత్రను కూడా ఈ సందర్భంలో గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. ఎన్నో సందర్భాల్లో ప్రజా సమస్యలపై, తెలంగాణ హక్కులపై, సామాజిక న్యాయంపై గొంతెత్తిన నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోనే ఉండి ఉద్యమాన్ని బలోపేతం చేశారు. వాళ్ల సేవలను గుర్తించడం రాజకీయ కక్షలకు అతీతంగా ఉండాలి.ఎందుకంటే ఉద్యమం ఏ ఒక్కరి సొత్తు కాదు. తెలంగాణ సాధనలో తమ వంతు పాత్ర పోషించిన ప్రతి ఒక్కరి కృషికి గౌరవం దక్కాలి.'ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాంతంలోనే పాతర వేస్తం... ప్రాంతేతరులు దోపిడీ చేస్తే దూరం దాకా తన్ని తరుముతాం' అని తెలంగాణ ఆకాంక్ష కోసం నిర్వహించిన నవంబర్ 1వ తేదీ,1996 వరంగల్ వేదికగా మాట్లాడడం ఊపునిచ్చింది.నాకు సంతోషాన్ని ఇచ్చింది, ఆ సభకు నేను,(సంగని మల్లేశ్వర్) కుసుంభ సీతారామారావు కల్సి ఇంటినుండి తీసుకుపోయిన జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి .ఇప్పుడైతే ఈ మాటలను చాలామంది బహిరంగసభలలో, మీడియాలో పదే పదే ప్రస్తావిస్తున్నారు. నాటి ఉమ్మడి రాష్ట్ర పాలకుల దోపిడీనీ, వారికి వత్తాసు పలుకుతున్న నాటి తెలంగాణ ప్రాంత అసమర్థ నాయకులను ఉద్దేశించి ఆయన పై విధంగా తన ఆవేశాన్ని, ఆవేదనను వ్యక్తం చేశారు. ఇంతటి చరిత్రాత్మకమైన మాటలను ఈ మధ్య కొందరు ఇష్టానుసారంగా వాడేస్తున్నారు.చిదంబరం ప్రకటన తర్వాత జై తెలంగాణ అన్న ప్రతి ఒక్కడు ఉద్యమకారుడై పోయాడంటే అతిశయోక్తి కాదు.

( ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా )

**ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్**
విభాగాధిపతి, జర్నలిజం శాఖ
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్
సెల్ -9866255355



## కాళోజీ.. మానవత్వానికి మరో మజిలీ



అన్యాయాలను అధ్యయనం చేసీ
ఊపిరినే ఉద్యమంగా శ్వాసించీ
ప్రజల గొడవనే ఇంకుగా మార్చి
ప్రాంతం ఆర్తినే అక్షరాలుగా కూర్చి
భాష యాసలనే నిత్యం
పారాయణంగా రాసిన
ఓ ప్రజాకవీ...
నీవు నడిచిన ఈ నేలంతా
నీ పాదముద్రలే!
అడుగడుగునా అస్తిత్వంకోసం కలమెత్తి
వడివిడిగా అన్యాయంపైన గలమెత్తి
పరభాషా పెత్తనాన్ని చిత్తు చేసి
ప్రజా సంస్కృతిని చాటిచెప్పి
బతుకమ్మను మాకు అప్పజెప్పి
మనది వేరు తెలంగాణ అంటూ
ప్రజలను నిరతం చైతన్య పరచిన
ఓ క్రాంతదర్శి.... ప్రత్యేక ఉద్యమ మాటల్లో
కనిపిస్తున్నవన్నీ... నీ అక్షరాల ముద్రలే!
వేషం కంటే భాష ముఖ్యమంటూ
మాండలికం భాషకు మాటలు నేర్పావు
పరభాష తత్వాన్ని చేతి కర్రతో విదిలిస్తూ
ప్రతి గుండెల్లో ప్రాంత పతాకాన్నెగరేసావు
జనజీవన గీతాన్ని చరణాలుగా ఆచరిస్తూ
బడుగుల బతుకులను దీపమై వెలిగించావు
మనిషి కోసమే నా తపనంటూ
ముందుకు సాగిన ఓ వైతాళికుడా...
నీవు నేర్పిన
పలుకుబడుల భాష సమాజ హితమైంది
ఆ అక్షరాలన్నీ మాకు వ్యవహారమయ్యింది
సందులు, సమాసాలు, వ్యాకరణాలు
అన్నీ నియమాలు వదిలి
పుస్తకాల పుటల్లో పురుడోసుకుంది
నీ పదాలకు నిఘంటువుల్లో
నిలువెత్తు అర్థం దొరికింది
అందుకే... సెప్టెంబరు 9 వ తేదీ
మాకు మాతృభాష అయ్యింది!
నేటి సినిమాలకు అదే ప్రగతి పథం అయ్యింది !
తెలంగాణ కవికులానికి ఆదర్శమార్గమైయ్యింది!

**- సోమశిల తిరుపాల్,**
**9989260336**

# భారత ఎన్నికల కమిషన్ అంటురోగం- అమెరికాకు పాకింది

భారతదేశంలో "సర్" (ప్రత్యేక సమగ్ర సమీక్ష) పేరుతో కొనసాగుతున్న ఓటర్ల జాబితా సమీక్ష ప్రక్రియ ఇప్పుడు అమెరికాకు కూడా విస్తరించింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం భారత మాదిరిగానే అమెరికాలో ఓటర్ల జాబితాలను నిశితంగా పరిశీలించే ప్రక్రియను ప్రారంభించింది. సుమారు రూ.125 కోట్ల నిధులను విడుదల చేసి, ఈ ప్రక్రియను నవంబర్ మధ్యంతర ఎన్నికలకు ముందు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రక్రియలో అమెరికాలోని 26 లక్షల మంది భారత సంతతి ఓటర్లలో 10 లక్షల మంది పేర్లు ఓటర్ల జాబితా నుండి తొలగించబడే ప్రమాదం ఉందని అంచనా వేయడం విశేషం.

భారతదేశంలో ఇటీవలి కాలంలో ఈ "సర్" ప్రక్రియ చాలా వివాదాస్పదంగా మారింది. ఉత్తర ప్రదేశ్లో 28.9 మిలియన్ల మంది ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితా నుండి తొలగించబడ్డాయి, ఇది మొత్తం ఓటర్లలో 18.7 శాతం. జార్ఖండ్‌లో 43.61 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి. పశ్చిమ బెంగాల్లో 58 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఈ భారీ స్థాయిలో తొలగింపులు ఎంతో ఆందోళన కలిగించాయి.

ప్రతిపక్షాలు, వివిధ సామాజిక వర్గాలు ఈ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నాయి. జార్ఖండ్ లోని గొడ్డా జిల్లాలో బీజేపీ బూత్ స్థాయి ఏజెంట్లు భారీ సంఖ్యలో ఫారం-7 ద్వారా ఓటర్ల పేర్లను తొలగించాలని దరఖాస్తులు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఫారం-7 అనేది ఓటర్ల పేర్లను తొలగించడానికి ఉపయోగించే దరఖాస్తు. బూత్ లెవల్ ఆఫీసర్లు ఈ దరఖాస్తులను అంగీకరించడానికి నిరాకరించారు, ఎందుకంటే వాటిలో ఎక్కువ భాగం ముద్రించిన రూపంలో ఉండి, అక్కడే చాలా కాలంగా నివసిస్తున్న వ్యక్తుల పేర్లు ఉన్నాయి. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మద్దతుదారుల ఓట్లను తొలగించడానికి బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఈ ప్రక్రియ జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలు కేవలం రాజకీయ ప్రచారంలో భాగం కాదు, భారతదేశంలో ఓటర్ల జాబితా ప్రక్రియలో లోపాలు ఉన్నాయనడానికి ఇవి నిదర్శనాలు.

ప్రతిపాదిత సేవ్ అమెరికా చట్టం ప్రకారం, ఫెడరల్ ఎన్నికల్లో ఓటు వేయడానికి పౌరసత్వానికి డాక్యుమెంటరీ ప్రూఫ్, ఫోటో ఐడి తప్పనిసరి చేయాలని భావిస్తున్నారు. అమెరికా రాయబారి సెర్జియో గోర్ కూడా భారత్ మాదిరిగా అమెరికాలోనూ వోటర్ ఐడి అమలు చేయాలని పిలుపునిచ్చారు. 646 మిలియన్ల ఓటర్లు ఉన్న భారతదేశంలో ప్రతి ఒక్కరికీ ఐడి ఉందని, కానీ అమెరికాలో మాత్రం సెల్ఫ్-అటెస్టేషన్పై ఆధారపడటం ఎందుకని ట్రంప్ ప్రశ్నించారు. అయితే, భారత్-అమెరికా ఎన్నికల వ్యవస్థలు పూర్తిగా భిన్నమైనవి. భారత్ లో కేంద్రీయ ఎన్నికల కమిషన్ ఉంది, కానీ అమెరికాలో 50 వేర్వేరు రాష్ట్రాలు వారి స్వంత ఎన్నికల నియమాలను కలిగి ఉన్నాయి. ఈ విధానం భారతదేశంలో కనిపిస్తున్న ఓటర్ల జాబితా తొలగింపు సమస్యను అమెరికాలో కూడా తీవ్రతరం చేసే ప్రమాదం ఉంది. భారతదేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం ఇప్పుడు అమెరికాలోని భారతీయ సంతతి పౌరులకు కూడా ప్రమాదంగా మారింది. న్యూయార్క్, న్యూజెర్సీ, కాలిఫోర్నియా, టెక్సాస్ వంటి రాష్ట్రాల్లో భారత సంతతి ఓటర్ల రాజకీయ ప్రభావం ముఖ్యమైనది. అయితే, ఈ కొత్త వెరిఫికేషన్ ప్రక్రియలో వీరి ఓటింగ్ సరళి కూడా పర్యవేక్షించబడవచ్చు. టెక్సాస్ లో గతంలో 24,000 మంది ఓటర్ల పేర్లు తొలగించబడిన వివాదం ఇప్పటికీ కోర్టులో ఉంది, కాబట్టి ఈ కొత్త ప్రక్రియ కూడా చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. సమస్య ఏమిటంటే, భారతదేశంలో ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు, హేతువాదులు, సామాజిక కార్యకర్తలు, మేధావులు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ ప్రజలను, విపక్ష కార్యకర్తలను లక్ష్యంగా చేసి పేర్లు తొలగించే విధానం ఇప్పుడు అమెరికాలోనూ భారతీయులకు వ్యతిరేకంగా మారింది. ఇది విడ్డూరమైన పరిస్థితి. భారత్ లో తాము అనుసరించిన "చెడు" విధానం ఇప్పుడు తమ సొంత ప్రజలకే వ్యతిరేకంగా మారడం పరిహాసాస్పదం. ఎన్నికల సంస్కరణల పేరుతో ఓటర్ల జాబితాల శుద్ధి అవసరమే కానీ, అది పక్షపాతం లేకుండా, పారదర్శకంగా, సమగ్రమైన ఆధారాలతో ఉండాలి. కేవలం ఒక ప్రత్యేక రాజకీయ పార్టీకి అనుకూలంగా, ఒక నిర్దిష్ట వర్గాల ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఈ ప్రక్రియ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. భారతదేశంలో మొదలైన ఈ "అంటురోగం" ఇప్పుడు అమెరికాకు పాకడం, అక్కడి భారతీయ సంతతి ప్రజలపై కత్తివేటు పడడం ప్రపంచ ప్రజాస్వామ్యాలకు హెచ్చరిక. ఎన్నికల ప్రక్రియల్లో పారదర్శకత, నిష్పాక్షికత చాలా ముఖ్యమని, రాజకీయ ప్రయోజనాల కోసం ఇలాంటి ప్రక్రియలు దుర్వినియోగం చేయరాదనే గుణపాఠం ఈ ఘటనలు మనకు నేర్పుతున్నాయి.

**- డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**

# తెలంగాణ రాజకీయ వ్యవస్థలో మారుతున్న సమీకరణాలు

నిన్నటి సంచిక తరువాయి



గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కుల ప్రభావం, పార్టీ ప్రభావం, ధన ప్రభావం, కుటుంబ రాజకీయాలు స్థానిక ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. అందువల్ల తెలంగాణ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఎన్నికల ప్రాతినిధ్యంతో పాటు నిజమైన రాజకీయ సాధికారత కూడా అవసరం. తెలంగాణ రాజకీయ వ్యవస్థలో యువత పాత్ర వేగంగా మారుతోంది. గతంలో రాజకీయ పార్టీలకు ఉద్యమాలు, కుల సమీకరణలు, గ్రామీణ నాయకత్వం ప్రధాన బలం కాగా, ఇప్పుడు విద్యావంతులైన యువత సామాజిక మాధ్యమాలు, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ నియామకాలు, ఆర్థిక భద్రత వంటి అంశాలను రాజకీయంగా చూస్తోంది. ఒక యువకుడికి రాజకీయ పార్టీ అంటే కేవలం సిద్ధాంతం మాత్రమే కాదు. తనకు ఉద్యోగం వస్తుందా? పరీక్షలు పారదర్శకంగా జరుగుతున్నాయా? ఉన్నత విద్య అందుబాటులో ఉందా? జీవన వ్యయం ఎంత? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పగల రాజకీయ శక్తి కావాలి.

అందువల్ల తెలంగాణలో రాబోయే రాజకీయ పోటీ యువతను ఎవరు ఆకర్షిస్తారు అనే అంశంపై కూడా ఆధారపడి ఉంటుంది. నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, ప్రైవేటు రంగ పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి రాజకీయ చర్చలో మరింత ప్రాధాన్యత పొందనున్నాయి. చదువుకున్న యువత రాజకీయంగా ప్రశ్నించే శక్తిగా మారితే తెలంగాణ రాజకీయాల స్వభావంలో మరింత పెద్ద మార్పు వస్తుంది. రైతాంగ రాజకీయాలు కూడా తెలంగాణలో ఎప్పటికీ కీలక అంశంగానే ఉంటాయి. వ్యవసాయ రుణాలు, పంటలకు గిట్టుబాటు ధరలు, సాగునీరు, రైతు పెట్టుబడి సహాయం, విద్యుత్ సరఫరా, మార్కెట్ వ్యవస్థ వంటి అంశాలు గ్రామీణ ఓటర్ల రాజకీయ నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. తెలంగాణ రాజకీయాల్లో గ్రామీణ ఓటు కేవలం ఒకే పార్టీకి శాశ్వతంగా ఉండదు. ప్రభుత్వం రైతులకు ఇచ్చే ప్రత్యక్ష ప్రయోజనాలు, స్థానిక నాయకుల ప్రభావం, గ్రామ స్థాయి రాజకీయ సమీకరణాల ఆధారంగా ఓటింగ్ ధోరణులు మారుతాయి.

వ్యవసాయ రంగంలో రైతు ఆదాయం పెరగడం, సాగు వ్యయం తగ్గడం, పంటలకు మార్కెట్ భద్రత లభించడం, నీటి నిర్వహణ మెరుగుపడడం వంటి అంశాలు గ్రామీణ రాజకీయాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. రైతు సమస్యలను ఎవరు సమర్థవంతంగా పరిష్కరిస్తారో వారికే గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయంగా బలం పెరిగే అవకాశం ఉంది. అందువల్ల తెలంగాణ రాజకీయ భవిష్యత్తులో రైతాంగం ఒక కీలక నిర్ణయాత్మక శక్తిగా కొనసాగుతుంది.

మహిళా రాజకీయ ప్రాతినిధ్యం కూడా భవిష్యత్ తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారుతుంది. మహిళా సంక్షేమ పథకాలు, ప్రయాణ సౌకర్యాలు, ఆర్థిక సహాయం వంటి ప్రత్యక్ష ప్రయోజనాలు రాజకీయంగా ప్రభావం చూపగలవు. అయితే మహిళల రాజకీయ భాగస్వామ్యం కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకూడదు. నిర్ణయాధికారంలో మహిళల పాత్ర పెరగడం అవసరం. ముఖ్యంగా స్థానిక సంస్థల నుంచి శాసనసభ వరకు మహిళా నాయకత్వం పెరిగే అవకాశం ఉంది.

ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో మరో ముఖ్యమైన పరిణామం కేంద్ర--రాష్ట్ర సంబంధాలు. రాష్ట్ర ప్రభుత్వం ఒక రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వం మరో రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో ఉన్నప్పుడు అభివృద్ధి, నిధులు, రాజ్యాంగ సంస్థలు, ఎన్నికల ప్రక్రియలు కూడా రాజకీయ చర్చలో భాగమవుతాయి. కేంద్ర ప్రభుత్వ విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం విమర్శలు చేయడం, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై కేంద్ర రాజకీయ పార్టీ విమర్శలు చేయడం సహజమే. అయితే ఈ రాజకీయ పోటీ చివరకు ప్రజలకు అభివృద్ధి అవకాశాలను పెంచుతుందా లేక పరిపాలనా ఘర్షణలకు దారితీస్తుందా అనేది ముఖ్యమైన ప్రశ్న.

కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులు, జాతీయ స్థాయి అభివృద్ధి పథకాలు, పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలు కూడా రాజకీయ సంబంధాలను ప్రభావితం చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం తన రాజకీయ స్వతంత్రతను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తే, కేంద్ర ప్రభుత్వం తన విధానాలను రాష్ట్రంలో అమలు చేయడానికి ప్రయత్నిస్తుంది. ఈ రెండు వ్యవస్థల మధ్య సమన్వయం ఎంత బలంగా ఉంటే ప్రజలకు అంత ప్రయోజనం ఉంటుంది. తెలంగాణ రాజకీయాల్లో వ్యక్తిత్వ ఆధారిత రాజకీయాలు కూడా ఇంకా బలంగానే ఉన్నాయి. ముఖ్యమంత్రి నాయకత్వం కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తుండగా, బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తు పార్టీ ప్రధాన నాయకత్వం, తదుపరి తరం నాయకత్వంపై ఆధారపడి ఉంటుంది. బీజేపీ కూడా రాష్ట్ర స్థాయిలో విశ్వసనీయమైన నాయకత్వ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాల్సి ఉంటుంది. అందువల్ల రాబోయే రోజుల్లో పార్టీల మధ్య పోటీతో పాటు నాయకుల మధ్య వ్యక్తిత్వ పోటీ కూడా పెరిగే అవకాశం ఉంది.

అయితే వ్యక్తిత్వ రాజకీయాలకు ఒక పరిమితి ఉంది. ఒక నాయకుడి ప్రజాదరణ ఎన్నికల్లో విజయాన్ని అందించవచ్చు. కానీ సంస్థాగత రాజకీయ వ్యవస్థను బలోపేతం చేయకపోతే దీర్ఘకాలంలో పార్టీ బలహీనపడే అవకాశం ఉంటుంది. గ్రామ స్థాయి కార్యకర్తల నిర్మాణం, యువ నాయకత్వానికి అవకాశాలు, స్థానిక సమస్యలపై స్పందన, ప్రజలతో నిరంతర సంబంధం ఉన్నప్పుడే రాజకీయ పార్టీలు దీర్ఘకాలికంగా బలంగా నిలబడగలవు.

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కనిపిస్తున్న మరో అంశం నిరంతర ఎన్నికల వాతావరణం. సాధారణ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే ప్రజల్లో తమ ప్రభావాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ప్రతి ప్రజా సమస్య రాజకీయ అంశంగా మారుతోంది. ప్రతి ప్రభుత్వ నిర్ణయం ఎన్నికల కోణంలో పరిశీలించబడుతోంది. ప్రతి సంక్షేమ పథకం రాజకీయ ప్రయోజనాల కోణంలో చర్చకు వస్తోంది. ఈ పరిస్థితి రాజకీయ చైతన్యాన్ని పెంచినప్పటికీ పాలనపై నిరంతర రాజకీయ ఒత్తిడిని కూడా పెంచుతుంది.

ప్రభుత్వానికి ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాల్సిన బాధ్యత ఉంటుంది. మరోవైపు ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతిపక్షాలకు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే బాధ్యత ఉంటుంది. అయితే ప్రజల సమస్యలకు ప్రత్యామ్నాయ పరిష్కారాలను కూడా చూపించాల్సిన బాధ్యత ఉంటుంది. కేవలం విమర్శలు చేయడం మాత్రమే ప్రతిపక్ష రాజకీయాల లక్ష్యం కాకూడదు. ప్రజలకు మెరుగైన ప్రత్యామ్నాయ విధానాలను అందించడం కూడా ప్రతిపక్షాల ప్రధాన బాధ్యత.

తెలంగాణ రాజకీయ వ్యవస్థ భవిష్యత్తును నిర్ణయించే ప్రధాన ప్రశ్న ఒకటే. ప్రజలు ఇకపై ఏ రాజకీయ ప్రమాణంతో ప్రభుత్వాలను అంచనా వేస్తారు? తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన రాజకీయ చరిత్ర ఆధారంగా అంచనా వేస్తారా? సంక్షేమ పథకాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటారా? సామాజిక న్యాయం, కుల ప్రాతినిధ్యాన్ని ప్రాధాన్యంగా చూస్తారా? ఉద్యోగాలు, ఆర్థిక అవకాశాలను ప్రధానంగా తీసుకుంటారా? లేక అభివృద్ధి, రాజకీయ స్థిరత్వాన్ని ప్రాధాన్యంగా చూస్తారా?

ఈ ప్రశ్నలకు సమాధానం ఒక్క రాజకీయ పార్టీ వద్ద లేదు. అందువల్ల తెలంగాణ రాజకీయాలు ఒక కొత్త రాజకీయ ప్రయోగశాలగా మారుతున్నాయి. ఒకవైపు ప్రాంతీయ రాజకీయాల వారసత్వం, మరోవైపు జాతీయ రాజకీయాల ప్రభావం, ఇంకోవైపు సామాజిక న్యాయ రాజకీయాల ఎదుగుదల కలిసి తెలంగాణ రాజకీయాలను కొత్త దిశలో నడిపిస్తున్నాయి.

మొత్తంగా చూస్తే తెలంగాణ రాజకీయ వ్యవస్థ ప్రస్తుతం మూడు ప్రధాన పరిణామాల మధ్య ప్రయాణిస్తోంది. మొదటిది అధికార కాంగ్రెస్ తన పాలనా విజయాలను రాజకీయంగా నిలబెట్టుకోవాల్సిన పరిస్థితి. రెండవది బీఆర్ఎస్ తన ప్రతిపక్ష పాత్రను బలోపేతం చేసుకుని ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందాల్సిన అవసరం. మూడవది బీజేపీ తెలంగాణలో ఒక శక్తివంతమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలనే ప్రయత్నం. ఈ మూడు రాజకీయ శక్తుల మధ్య పోటీ ఎంత తీవ్రంగా ఉంటే తెలంగాణ ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలకు అంత ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉంటుంది.

అయితే రాజకీయ పోటీ వ్యక్తిగత విమర్శలు, పార్టీ మార్పులు, అధికార పోరాటానికి మాత్రమే పరిమితమైతే ప్రజాస్వామ్యానికి ప్రయోజనం ఉండదు. రాజకీయ పార్టీలు ఉద్యోగాలు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి, పారిశ్రామికీకరణ, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం వంటి అంశాలపై స్పష్టమైన దీర్ఘకాలిక విధానాలను ప్రజలకు అందించాలి.

21వ శతాబ్దం తెలంగాణ రాజకీయాలకు ఒక కొత్త పరీక్షను ముందుకు తెచ్చింది. తెలంగాణను సాధించడం ఒక చారిత్రక విజయం అయితే, తెలంగాణలో సమాన అవకాశాలు కలిగిన సమాజాన్ని నిర్మించడం తదుపరి చారిత్రక బాధ్యత. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో గెలవడం కోసం మాత్రమే పోటీ పడకుండా రాష్ట్ర భవిష్యత్తును నిర్మించే విధానాల కోసం పోటీ పడినప్పుడే తెలంగాణ రాజకీయ వ్యవస్థ మరింత పరిణతి చెందుతుంది.

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న అసలు మార్పు అధికార మార్పు మాత్రమే కాదు. రాజకీయాల అర్థం కూడా మారుతోంది. ప్రాంతీయ అస్తిత్వం నుంచి పాలనా జవాబుదారీతనం వైపు, భావోద్వేగ రాజకీయాల నుంచి పనితీరు రాజకీయాల వైపు, ఏకపక్ష ఆధిపత్యం నుంచి బహుళ రాజకీయ పోటీ వైపు తెలంగాణ క్రమంగా ప్రయాణిస్తోంది.

మిగితా తరువాయి సంచికలో..

**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం



# రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన రేవంత్ ప్రభుత్వం

## రేవంత్ ప్రభుత్వం పతనం కావడం తథ్యం
## కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 8 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు మార్పు కోరుకున్నారని, అయితే ప్రస్తుతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిందని, ఈ ప్రభుత్వం పతనం కావడం తథ్యమని ఆయన అన్నారు. భవిష్యత్తులో కె. చంద్రశేఖర్ రావు మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తన స్వగృహంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఇంతియాజ్ ఇసాక్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలు ఇచ్చిందని, వాటిని 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎనిమిది రోజుల నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చిందని ఆయన తెలిపారు. ప్రజలు ప్రభుత్వంపై తమ నిరసన, అసంతృప్తిని వ్యక్తం చేశారని, కార్యక్రమాలకు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కీలక శాఖల పాలన విఫలమైందని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. విద్యాశాఖ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, గురుకులాల్లో విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఆకునూరి మురళి కమిషన్ నివేదిక పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. నివేదికను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పాలిటెక్నిక్‌కు సంబంధించిన 97 జీవోను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపైనా ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం పతనమైన తర్వాతే కేసీఆర్ మళ్లీ అసెంబ్లీలో అడుగుపెడతారని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ హామీలతో మోసపోయి మార్పును కోరుకున్నారని, ప్రస్తుతం వారి ఆందోళనలు, ఆక్రోశం స్పష్టంగా కనిపిస్తున్నాయని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇంతియాజ్ ఇసాక్, గట్టు యాదవ్, బి. లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, గంధం పరంజ్యోతి, తిరుమల్ సునీల్ వాల్మీకి, జోహెబ్ ,కవిత రహీం,కుమార్ బేదాడి తదితరులు పాల్గొన్నారు.



### హామీలు అడిగితే అక్రమ అరెస్టులా?
### : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి




అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చీకటి రోజుగా ఆయన అభివర్ణించారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తాతా మధు, నవీన్ రెడ్డిలను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మహిళల చేత ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే భేషరతుగా విడుదల చేయాలని కోరారు. ధర్నాలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్ ,పట్టణ అధ్యక్షులు రమేష్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి సోషల్ మీడియా కన్వీనర్ సునీల్ వాల్మీకి నాయకులు ఉంగుళం తిరుమల్ జోహేబ్ రహీం కుమార్ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# కరువు రక్కసి కోరలకు కౌలు రైతు బలి

## అప్పుల బాధ తట్టుకోలేక ఇమాంపూర్‌లో యువ రైతు ఆత్మహత్య



**అల్లంపూరు,సెప్టెంబర్ 8 (జనంసాక్షి) :** వర్షాల్లేక ఎండిన పంటలు, గుండెలవిసేలా రోదిస్తున్న కుటుంబ సభ్యులు,అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇమాంపూర్ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆకాశంవైపు చూసి చూసి కళు కాయలు కాచినా వర్షపు చుక్క కురవక, కళ్లముందే పంటలు ఎండిపోవడంతో మనస్తాపానికి గురైన పరశురాముడు 33అనే యువ కౌలు రైతు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పరశురాముడు ఈ ఏడాది నమ్ముకుని కౌలుకు తీసుకున్న భూమిలో పెట్టుబడులు పెట్టాడు. అయితే తీవ్రమైన కరువు పరిస్థితులు, వర్షపాతం పూర్తిగా క్షీణించడంతో వేసిన పంటలు చేతికి రాకుండానే విలవిలలాడుతూ ఎండిపోయాయి. చేతికందే పంట రాకపోగా, పెట్టిన పెట్టుబడులు కూడా దక్కలేదు. అటు కౌలు డబ్బులు చెల్లించలేక, ఇటు రోజురోజుకూ పెరిగిపోతున్న అప్పుల భారం చూసి పరశురాముడు తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. అప్పుల దాతల ఒత్తిడి తట్టుకోలేక, భవిష్యత్తు శూన్యంగా కనిపించడంతో దిక్కుతోచని స్థితిలో ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు.

**కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం**

నిన్నటివరకు తమ కళ్లముందే తిరుగుతూ, రేపటి గురించి ఆశలతో బతికిన 33 ఏళ్ల యువకుడు ఇలా అర్థాంతరంగా తనువు చాలించడంతో భార్యాపిల్లలు, తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పచ్చని పంటలతో కలకలలాడాల్సిన పొలాలు కరువుతో ఎండిపోతుంటే, వాటిని నమ్ముకున్న రైతన్నలు ఇలా అల్లాడిపోతూ ప్రాణాలు వదలడం స్థానికులను తీవ్రంగా కలచివేస్తోంది. సమాచారం అందుకున్న అలంపూర్ ఎస్సై రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఏసీబీ వలలో నారాయణపేట రిజిస్ట్రేషన్ కార్యాలయ ఎస్ఆర్ఓ



**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్8(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయ ఎస్ఆర్ఓ లగిశెట్టి వెంకటస్వామి లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఇంటి రిజిస్ట్రేషన్ కోసం 15 రోజుల క్రితం ఓ వ్యక్తి దగ్గర లంచం డిమాండ్ చేశారు. 90 వేల రూపాయలు ఇచ్చే విధంగా ఒప్పందం కుదిరింది. ఇందులో 50 వేల రూపాయలు ఇప్పటికే చెల్లించగా అధికారులు ఇంటి రిజిస్ట్రేషన్ చేశారు. మరో 40 వేల రూపాయలు ఇవ్వాలి అని డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఈ మేరకు మహబూబ్ నగర్ డిఎస్పి బాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నారాయణపేట కార్యాలయానికి చేరుకొని రిజిస్ట్రేషన్ 30 వేల రూపాయలు చెల్లిస్తున్న క్రమంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డబ్బుల విషయంలో ప్రైవేటు వ్యక్తి నాగేష్ ను కూడా అదుపులోకి తీసుకున్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్ ఆర్ వో ను, ప్రైవేటు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లుగా డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు.

# విద్యుత్ కోతలపై అన్నదాతల ఆగ్రహం



### లింగంపల్లి సబ్‌స్టేషన్ వద్ద రైతుల ధర్నా
### కనీసం 12 గంటల విద్యుత్ కూడా ఇవ్వడం లేదని మండిపాటు
### ఏఈ హామీతో శాంతించిన రైతులు

**మక్తల్, సెప్టెంబర్ 08 (జనంసాక్షి)**

మండల పరిధిలోని మాధ్వర్ గ్రామ పరిధిలో గల లింగంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మంగళవారం రైతులు కదం తొక్కారు. నిరంతరం కొనసాగుతున్న విద్యుత్ కోతలను నిరసిస్తూ మాజీ ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాతలు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో పంటలకు నీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే 24 గంటల విద్యుత్ సరఫరా దేవుడెరుగు, కనీసం ప్రకటించిన 12 గంటల కరెంట్‌ను కూడా అందించలేకపోతున్నారని మండిపడ్డారు. ఒకవైపు 'రైతే రాజు' అంటూనే, మరోవైపు తీవ్ర విద్యుత్ కోతలతో రైతులను నట్టేట ముంచడం తగదన్నారు. సమయానికి కరెంట్ రాకపోవడంతో కళ్ల ముందే పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాకు మాధ్వర్ సర్పంచ్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పూర్తి మద్దతు ప్రకటించారు. రైతులకు సరిపడా విద్యుత్ సరఫరా చేయడంలో అధికారులు అలసత్వం వీడకపోతే, త్వరలోనే వేలాది మంది రైతులతో భారీ ధర్నా, రాస్తారోకో కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రైతుల ఆందోళన తీవ్రం కావడంతో మక్తల్ విద్యుత్ శాఖ ఏఈ స్పందించారు. బుధవారం స్వయంగా మాధ్వర్ గ్రామానికి చేరుకుని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని, రైతులకు ఇబ్బంది లేకుండా కనీసం 12 గంటల విద్యుత్‌ను నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశప్ప, గుడిసె రామకృష్ణ, ఆర్ఎంపీ, ఉపసర్పంచ్ కాతనూరి శివాని శ్రీనివాస్, పేట అంజప్ప, కురువ వన్నప్ప, బాట నరసింహ, వడ్ల భాను ప్రసాద్, మల్లేపల్లి నారాయణ, తుంగ నరసింహులు, కిష్టప్ప, గుడిసె రాజులతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు, యువకులు పాల్గొన్నారు.

# జాతీయ సైక్లింగ్ పోటీలకు మద్వార్ బాలిక తేజస్విని ఎంపిక



**మక్తల్, సెప్టెంబర్ 08 (జనంసాక్షి)**

మక్తల్ మండలంలోని మద్వార్ గ్రామానికి చెందిన వడ్ల తేజస్విని జాతీయస్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల హైదరాబాద్ శామీర్‌పేటలో జరిగిన 16 ఏళ్ల లోపు బాలికల 5 కి.మీ రాష్ట్రస్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీల్లో ఆమె కాంస్య పతకం సాధించింది. దీంతో అక్టోబర్ 1 నుండి 4 వరకు ఒడిశాలోని మహేంద్రగిరిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. గోపాలం తెలిపారు. తేజస్విని స్థానిక సర్వ బాలికల గురుకులంలో 8వ తరగతి చదువుతోంది. ఈ సందర్భంగా తేజస్వినిని, కోచ్ బి. గోపాలంను మక్తల్ తహసీల్దార్ సతీష్, ఎస్సై పి. రాజు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి. శివకుమార్, విద్యార్థిని తండ్రి వెంకటేశ్వర్లు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# చుక్క నీరు లేక ఎండుతున్న పంటలు

## వారం రోజుల్లో నీళ్లివ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యం



**మానవపాడు, సెప్టెంబర్ 8 (జనం సాక్షి) :** కలెక్టర్‌కు పల్లెపాడు రైతుల ఆవేదన, జూరాల డి38 ఛానెల్ కింద ఎండిపోతున్న పొలాలుఎల్ నినో ప్రభావంతో కరువు కోరలు రిజర్వాయర్‌లో నీరున్నా దక్కని వైనంమానవపాడు, ఒకపక్క ఎల్ నినో ప్రభావంతో వాన దేవుడు మొహం చాటేశాడు. ఆకాశం నుంచి చుక్క నీరు రాక, భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటిపోతుంటే రైతాంగం కళ్లల్లో కడగండ్లు మిగిలాయి. కళ్లెదుటే రిజర్వాయర్లలో నీళ్లు ఉన్నా, తమ పొలాలకు పారే భాగ్యం లేక పంటలు ఎండిపోతుంటే తట్టుకోలేక మానవపాడు మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్‌ను ఆశ్రయించారు. జూరాల డి38 ఛానెల్ సాగునీటిపై ఆధారపడి పంటలు వేసిన తాము, ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో ఉన్నామంటూ కలెక్టర్‌కు తమ గోడును వెళ్లబోసుకున్నారు.అధికారుల నిర్లక్ష్యం, కళ్లెదుటే ఎండుతున్న పంటలు,గతంలోనే సాగునీటి విడుదలపై పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగి, దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేకుండా పోయిందని రైతులు తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ఆశతో పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు ఇప్పుడు నీరందక నిలువునా ఎండిపోయే దశకు చేరుకున్నాయని వాపోయారు.వారం రోజులే గడువు,లేదంటే ఆత్మహత్యలే"రిజర్వాయర్లలో నీళ్లున్నా మా పొలాలకు రావు,ఆకాశం నుంచి వర్షం కురవదు.. ఇక మేము ఎలా బతకాలి?" అంటూ రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. రాబోయే వారం రోజుల్లోగా సాగునీరు విడుదల చేయకపోతే పంటలు పూర్తిగా కాలిపోయి తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన తమకు ఆ తర్వాత ఆత్మహత్యలే శరణ్యమని ప్రభుత్వానికి, అధికారులకు రైతులు తెగేసి చెప్పారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన డి38 ఛానెల్ ద్వారా నీటిని విడుదల చేసి తమ్మును, తమ పంటలను కాపాడాలని పల్లిపాడు రైతాంగం డిమాండ్ చేస్తోంది.



# అత్యాధునిక పరికరంతో మెదడు కణితులకు సురక్షిత శస్త్రచికిత్సలు

## దేశంలో మూడవ మెదడు రోబోట్ యశోద ఆసుపత్రి సొంతం

### సంక్లిష్టమైన మెదడు శస్త్రచికిత్సల్లో నూతన అధ్యాయం
### యశోద ఆసుపత్రిలో అత్యాధునిక సాంకేతికత

**మహబూబ్‌నగర్, అర్బన్ సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** సంక్లిష్టమైన మెదడు శస్త్రచికిత్సలను విజయవంతంగా చేయడానికి యశోద ఆసుపత్రి అత్యాధునిక పరికరాన్ని అందుబాటులోకి తెచ్చింది. సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రి భారతదేశంలోనే మూడవ ఏకైక మెదడు రోబోట్‌ను కలిగి ఉండటం గర్వకారణమని నిర్వాహకులు తెలిపారు. ఈ మెదడు రోబోట్ శస్త్రచికిత్స ప్రక్రియ అంతటా వైద్యుడికి నిరంతరం సమాచారం అందిస్తూ దారి చూపే పరికరంగా పనిచేస్తుంది. దీని ద్వారా మెదడులోని లోతైన కణితులపై చిన్న రంధ్రం ద్వారా అత్యంత కచ్చితత్వంతో శస్త్రచికిత్స చేయడానికి వీలు కలుగుతుందని, ఇది మెదడు కణితుల శస్త్రచికిత్సలో భద్రతా ప్రమాణాలను అత్యున్నత స్థాయికి పెంచుతుందని తెలిపారు. సంక్లిష్టమైన మెదడు కణితుల్లో మంచి ఫలితాలతో సురక్షిత శస్త్రచికిత్స చేయడానికి ఇది అనుకూలమని, శస్త్ర చికిత్స సమయంలో చేసే అయస్కాంత ప్రతిధ్వని పరీక్ష, శస్త్రచికిత్స సమయ పర్యవేక్షణ, మెదడు దారి చూపే వ్యవస్థ, అత్యాధునిక సూక్ష్మదర్శిని, అంతర్దర్శిని వంటి సౌకర్యాలు, వైద్యుడి అనుభవం కలిసి మంచి ఫలితాన్ని సాధించడానికి ఎంతో దోహదపడతాయని వివరించారు. ముక్కు ద్వారా లేదా చిన్న రంధ్రం విధానంతో చేసే మెదడు కణితులు లేదా వ్యాధుల కోసం ఇది ఒక ప్రత్యేక ఉత్తమ కేంద్రమని, ఈ కేంద్రం పిట్యూటరీ గ్రంథి కణితి, పుర్రె అడుగు భాగపు కణితులు, ఇతర కణితులు, ముక్కు ద్వారా మెదడు నీరు కారడం కోసం పుర్రె అడుగు భాగ మరమ్మత్తు వంటి వాటికి సంపూర్ణ పరిష్కారాలను అందిస్తుందని తెలిపారు. మహబూబ్‌నగర్‌లో యశోద ఆసుపత్రి, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నిర్వాహకులు బి. సుదర్శన్ రెడ్డి, రోహిత్ కుమార్ పాల్గొన్నారు.

# ఎర్రవల్లిలో ఉద్రిక్తత

## కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ శ్రేణుల డప్పుల మోత



**సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి) సెప్టెంబర్ 08 :** సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున ఫామ్‌హౌస్ వైపు తరలిరావడంతో పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. డప్పు చప్పుళ్లతో వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు తరలివచ్చారు. ఫామ్‌హౌస్ సమీపంలో కాంగ్రెస్ శ్రేణులు డప్పులు మోగిస్తూ నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు వరదరాజపూర్ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా రేవంత్‌రెడ్డి, కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. దామరకుంటలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది .పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు భారీగా మోహరించారు. ఫామ్ హౌస్ చుట్టుపక్కల కూడా పోలీసు బలగాలను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా.. నర్సారెడ్డి అస్వస్థతకు గురికావడంతో ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫామ్‌హౌస్ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. దీంతో ఎర్రవల్లి, పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



# నీళ్లు అడిగితే పోలీసులతో అడ్డుకుంటారా?

## కలెక్టర్‌ను కలవబోతుంటే అడ్డుకున్న పోలీసులు, రోడ్డుపైనే ధర్నా



**కల్హేర్ సెప్టెంబర్ 08 (జనంసాక్షి)** కల్హేర్ నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న ఇందిరానగర్, కృష్ణాపూర్, కల్హేర్ గ్రామాల రైతులు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో పూడిక పేరుకుపోయి నీరు సక్రమంగా రాకపోవడంతో కళ్లముందే పంటలు ఎండిపోతున్నాయి. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు చేతికందక రైతులు ఆవేదనలో ఉన్నారు. తమ పంటలను కాపాడాలని, వెంటనే నల్లవాగు నీటిని విడుదల చేసి పూడికతీత పనులు చేపట్టాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చేందుకు బయలుదేరిన రైతులను పోలీసులు మార్గమధ్యలో అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు అడ్డుకోవడంతో రైతులు రోడ్డుపైనే బైఠాయించి ధర్నాకు దిగారు. రైతులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ "మా పంటలు ఎండిపోతున్నాయి. మా పెట్టుబడులు మట్టిపాలవుతున్నాయి. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి గపట్టించుకోవడం లేదు. కాలువల్లో పూడిక తీయించడం చేతకాదు, రైతులకు నీళ్లు ఇవ్వడం చేతకాదు. అందుకే కలెక్టర్ కి చెప్పుకోవడానికి వెళ్తుంటే పోలీసులతో అడ్డుకుంటారా?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు ఇవ్వలేని పాలకులు, నీళ్లు అడిగే రైతులను పోలీసులతో అడ్డుకోవడం ఏమిటని, ఇది ప్రజా పాలన కాదు, రైతుల గొంతు నొక్కే నిర్బంధ పాలన అని రైతులు విమర్శించారు. వెంటనే నల్లవాగు నీటిని విడుదల చేసి, పూడికతీత పనులు చేపట్టి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో విద్యార్థిని మృతి

## మోటార్ ప్లగ్ తీస్తుండగా ప్రమాదం
## మంతన్‌గోడ్ గ్రామంలో మిన్నంటిన రోదనలు



**మఖ్తల్, సెప్టెంబరు 8 (జనంసాక్షి) :** విద్యుత్ మోటార్ ప్లగ్ తీసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ పాఠశాల విద్యార్థిని ప్రాణాలు కోల్పోయిన సంఘటన మఖ్తల్ మండలంలోని మంతన్‌గోడ్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోడి ఆంజనేయులు, శాంతమ్మ దంపతులకు ఐదుగురు కుమార్తెలు కాగా, పెద్ద కుమార్తె అక్షర (13) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. రోజూలాగే మంగళవారం ఉదయం ఇంట్లో అవసరాల నిమిత్తం నీటి మోటారును ఆన్ చేసింది. నీళ్లు నిండిన తర్వాత మోటార్‌ను ఆఫ్ చేసి, సాకెట్ నుంచి ప్లగ్‌ను తీసే ప్రయత్నంలో ఒక్కసారిగా తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం మఖ్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కళ్లముందే చలాకీగా తిరిగిన కూతురు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజు వెల్లడించారు.

**పాఠశాలలో తీవ్ర విషాదం**

చదువులో చురుగ్గా ఉండే అక్షర అకాల మరణం ఆమె తోటి విద్యార్థులను, ఉపాధ్యాయులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. విద్యార్థిని ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి, సంతాప సూచకంగా పాఠశాలకు మంగళవారం సెలవు ప్రకటించారు. చిన్నారి మృతితో మంతన్‌గోడ్ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

**కుటుంబ సభ్యులను పరామర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్**

మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు ఆసుపత్రిలో ఉన్న బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి ధైర్యం చెప్పారు. అక్షర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.

# భ్రూణ లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్**
**పీసీపీఎన్‌డీటీ నిబంధనల ఉల్లంఘనపై ఉపేక్ష లేదు**
**జోడిమెట్లలోని ఆసుపత్రి తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08 (జనంసాక్షి) :** పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై వైద్య ఆరోగ్యశాఖ నిఘా మరింత కట్టుదిట్టం చేసింది. భ్రూణ లింగ నిర్ధారణ ద్వారా ఆడ శిశువులపై వివక్ష, దోపిడీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్ హెచ్చరించారు.
రాష్ట్ర స్థాయి పీసీపీఎన్‌డీటీ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో గుర్తించిన అంశాల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్ జోడిమెట్ల ఎక్స్ రోడ్, పోచారం ప్రాంతంలోని అన్ష్ ఆసుపత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న పీసీపీఎన్‌డీటీ చట్టానికి సంబంధించిన రికార్డులు, నెలవారీ నివేదికలు, తప్పనిసరి రిజిస్టర్లు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కేంద్రం నిర్వహణ ప్రమాణాలు, ప్రోటోకాల్స్ తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రం చట్టబద్ధంగా పనిచేస్తుందా, రిజిస్ట్రేషన్ గడువు చెల్లుబాటు అవుతోందా, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉందా అనే అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.ఆనంద్ మాట్లాడుతూ.. గర్భస్థ శిశువు లింగాన్ని నిర్ధారించి వెల్లడించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలు ఆడ శిశువులపై వివక్షకు, భ్రూణహత్యలకు దారితీస్తాయని పేర్కొన్నారు. వైద్య సేవలను ఆసరాగా చేసుకుని ప్రజలను, ముఖ్యంగా మహిళలను దోపిడీ చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ చట్టంలోని అన్ని నిబంధనలు, నిర్దేశిత ప్రమాణాలు, ప్రోటోకాల్స్‌ను ప్రతి నమోదిత కేంద్రం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. లింగ వివక్షను అరికట్టడం, ఆడ శిశువుల హక్కులను పరిరక్షించడం, ప్రజా ప్రయోజనాలను కాపాడడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలో పీసీపీఎన్‌డీటీ చట్ట అమలుపై నిరంతర తనిఖీలు, పర్యవేక్షణ కొనసాగుతాయని డాక్టర్ కె. ఆనంద్ వెల్లడించారు. ఈ తనిఖీల్లో సీఐఏ/పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ గీతా ప్రసాద్, డిప్యూటీ డెమో వసంత రెడ్డి పాల్గొన్నారు.



# మహిళా గౌరవం గాయపడిన వేళ, సభా మర్యాద తలవంచిన రోజు

**మహిళా పోలీసులపై అవమానకర ప్రవర్తన సభ్యసమాజానికే సిగ్గుచేటు**
**సభాపతి గౌరవాన్ని కాపాడటం, పార్టీలకు అతీతంగా ప్రతి సభ్యుడి బాధ్యత**
**మైక్‌లో వినిపించకపోయినా హేయమైన వ్యాఖ్యలను ఉపేక్షించవద్దు**
**బీఆర్ఎస్ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి : కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 8:( జనం సాక్షి)**
"ఒక మహిళగా... ఒక ప్రజాప్రతినిధిగా... ఒక బాధ్యతగల పౌరురాలిగా ఈ అంశంపై శాసనసభలో మాట్లాడాల్సి రావడమే నాకు తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. మన శాసనసభ చరిత్రలో ఇటువంటి రోజు వచ్చి ఉండకూడదు" అని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి భావోద్వేగంతో పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులపై బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు, సభ్యులు ప్రదర్శించిన ప్రవర్తనను, ఉపయోగించిన అత్యంత అవమానకరమైన పదజాలాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులే మహిళా పోలీసుల ఆత్మగౌరవాన్ని గాయపరిచేలా వ్యవహరించడం సభ్యసమాజం తలదించుకోవాల్సిన పరిణామమని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లచొక్కాలు ధరించడంపై ఎవరికీ అభ్యంతరం లేదని, అయితే నినాదాలు, అక్షరాలతో కూడిన టీషర్టులు సభలో ప్లకార్డులుగానే పరిగణించబడతాయన్న విషయం సభ్యులందరికీ తెలుసని పేర్కొన్నారు. సభా నియమాలను తెలిసే ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించి, సమావేశాలను అడ్డుకోవడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. శాసనసభ ప్రాంగణంలో ఎక్కడ పురుష పోలీసులను, ఎక్కడ మహిళా పోలీసులను విధుల్లో నియమించాలనేది పోలీసు శాఖ నిర్ణయమని స్పష్టం చేశారు. తమకు అప్పగించిన బాధ్యతను నిర్వర్తించిన మహిళా పోలీసులను "మమ్మల్ని ఎందుకు అడ్డుకున్నారు?" అంటూ ప్రశ్నించడం, వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎవరి హక్కూ కాదన్నారు. పదిమంది పురుషులు చొక్కాలు విప్పి మహిళా పోలీసుల వైపు ముందుకు వస్తే, అక్కడ విధుల్లో ఉన్న యువ మహిళా కానిస్టేబుళ్లు ఎలాంటి మానసిక వేదనకు, భయానికి గురై ఉంటారో ఒక్క క్షణం ఊహించాలి. ఆ దృశ్యాలను ఫొటోల్లో చూడటానికే నాకు భయమేస్తోంది. విధి నిర్వహణకు వచ్చిన ఆడబిడ్డలు ఇటువంటి అవమానాన్ని ఎదుర్కోవాల్సి రావడం నా హృదయాన్ని కలచివేసింది" అని పద్మావతి రెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. ఇది మా సంస్కృతి కాదు బాధ్యతగల శాసనసభ్యుల ప్రవర్తన అంతకన్నా కాదు. మానవత్వం తరఫున, ప్రజాప్రతినిధుల తరఫున ఆ మహిళా పోలీసు సిబ్బందికి నేను క్షమాపణ చెబుతున్నాను అని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనలపై మహిళా శాసనసభ్యులందరూ కలిసి మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మీడియా ప్రసారాలు, దృశ్యాలు, వార్తల ద్వారా యూనిఫాం ధరించిన మహిళా పోలీసులపై జరిగిన అవమానకర చర్యలను చూసి తీవ్ర ఆగ్రహం, ఆవేదనతో ఈ ఫిర్యాదును సమర్పించినట్లు వివరించారు. ఇది కేవలం కొందరు మహిళా కానిస్టేబుళ్లకు జరిగిన అవమానం మాత్రమే కాదని, పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తున్న యావత్ మహిళా సిబ్బంది ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి సభలో అడుగుపెట్టిన ప్రతి సభ్యుడిపైనా సభాపతి పీఠం గౌరవాన్ని కాపాడాల్సిన కనీస నైతిక బాధ్యత ఉందన్నారు. సభాపతిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు ఉపయోగించిన అనుచిత పదజాలం, చేసిన హేయమైన వ్యాఖ్యలు శాసనసభ ప్రతిష్ఠకే మచ్చతెచ్చేలా ఉన్నాయని తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. సభాపతి గౌరవం ఒక వ్యక్తికి సంబంధించినది కాదు, అది మొత్తం శాసనసభ గౌరవం. సభ లోపలైనా, బయటైనా ఆ పీఠం ప్రతిష్ఠను కాపాడటం పార్టీలకు అతీతంగా ప్రతి శాసనసభ్యుడి బాధ్యత" అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, సహచర శాసనసభ్యులు, మంత్రి సీతక్కతోపాటు సభాపతిపై కూడా కొందరు సభ్యులు చేస్తున్న అనుచితమైన సైడ్ కామెంట్లను ఉపేక్షించరాదని కోరారు.

## అక్రమాలు పాల్పడుతున్న ఏజెన్సీలను రద్దు ఇయ్యాలి

**ఏజెన్సీలకు వత్తాసు పలుకుతున్న అధికారులను సస్పెండ్ చేయాలి మోకాళ్లతో నిరసన**
**మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం,యాదగిరి డిమాండ్**

**సంగారెడ్డి సెప్టెంబర్ 8 ( జనం సాక్షి) :** కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులలో అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలను రద్దు చేయాలని ఏజెన్సీలకు వత్తాసు పలుకుతున్న ప్రభుత్వ అధికారులని ఉద్యోగం నుంచి తొలగించాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం, యాదగిరి రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ ముందు ధర్నా మోకాళ్ళతో నిరసన తెలిపిన అనంతరం సూపరింటెంట్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం, యాదగిరి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో మెడికల్ కళాశాల, ప్రభుత్వ హాస్పిటల్లో నోటిఫికేషన్ లేకుండా ఏజెన్సీలు తన ఇష్టానుసారంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలలో అక్రమాలకు పాల్పడ్డా ఇప్పటివరకు ఏజెన్సీలపైన ప్రభుత్వము చర్యలు తీసుకోకపోవడం కారణమేంటని అన్నారు ప్రభుత్వ అధికారులు ఏజెన్సీలకు వత్తాసు పలుకుతున్నారని ఆయన అన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలలో అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలు రద్దు చేయాలి. ఇప్పటివరకు ఒక్క 197 పోస్టులలో అక్రమాలకు నిలయంగా ప్రభుత్వ ఉద్యోగులు తయారయ్యారు తప్ప ఇంకోటి కాదని అన్నారు ఒక్కొక్క ఉద్యోగానికి 3, లక్షల నుండి 5 లక్షల రూపాయలు తీసుకొని వాళ్లకు ఆర్డర్ కాపీలు ఇస్తున్నారు తప్ప నిజమైన లబ్ధిదారులకు మాత్రం ఉద్యోగాలు రావడం లేదని అన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కింద ఉద్యోగాలు పేరు మీద నోటిఫికేషన్ వేయకుండా ఎలా రిక్రూట్మెంట్ చేస్తారని అన్నారు. అందులో పని చేస్తున్న అధికారులు ఎవరికి చెప్పకుండా ఏజెన్సీలకు వత్తాస్తు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్న వారికి ఉద్యోగాలు ఇవ్వడం ఏంటని అన్నారు. కార్మికులకు మేలు చేయాల్సిన అధికారులే ఇలా చేయడం ఏంటని అన్నారు నోటిఫికేషన్ వేయకుండా ఉద్యోగాలు తీసుకున్న వారిని తొలగించి వారి స్థానంలో అందులో పని చేస్తున్న కాంటాక్ట్ కార్మికులను తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు కార్యక్రమంలో యూనియన్ నాయకులు, యాదగిరి, సదానందం నాగరాజు, రమేష్, రమాదేవి మరియమ్మ, భాగ్యలక్ష్మి, సునీత తొక్కు బాయ్, మంజుల, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.




# టీచర్లు సమాజంతో మమేకం కావాలి

**విద్యాభివృద్ధికి పాటు పడాలి**
**హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి**

**ముషీరాబాద్, సెప్టెంబర్ 08 (జనం సాక్షి):** టీచర్లు సమాజంతో మమేకమై విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, నూతన ఆలోచనలు, ప్రయోగాలతో విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర విద్యా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లక్షలాది మంది ఉపాధ్యాయుల చేతుల్లో కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉందని అన్నారు. టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ. విజయ్ కుమార్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. తరగతి గదిలోనే భావి భారత పౌరులు రూపుదిద్దుకుంటారని, విద్యార్థుల్లో శాస్త్రీయ, ప్రజాస్వామ్య, నైతిక విలువలను పెంపొందించాలని సూచించారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ టీచర్లు విద్యార్థుల సైకాలజీని అర్థం చేసుకుని బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎల్ఎఫ్ నాయకులు కె. విజయ్, పుట్టపాగ విజయ్, నర్సింహారావు, చందు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అనధికార నిర్మాణాల కూల్చివేతలపై సిఎంసి ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డ్రైవ్



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 08 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) పరిధిలో అనధికార నిర్మాణంలో ఉన్న భవనాలకు సంబంధించి శేరిలింగంపల్లి, కూకట్పల్లి, కుత్బుల్లాపూర్ జోన్ల పరిధిలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి వాటి విషయంలో అవసరమైన నిరంతర చర్యలను సిఎంసి పరిధి ఎన్ఫోర్స్మెంట్ విభాగం అధికారులు చేపడుతున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా మంగళవారం 14 అక్రమ నిర్మాణాలను గుర్తించగా మరో 14 కూల్చివేతలను చేపట్టడం జరిగిందని అధికారులు వివరించారు. మూడు అనాధికార నిర్మాణాలకు సంబంధించి నోటీసులను జారీ చేసినట్లు ఎన్ఫోర్స్మెంట్ అధికారులు వివరించారు. సిఎంసి పరిధిలోని మూడు జోలవారిగా శేరిలింగంపల్లి జోన్ పరిధిలో 05, కూకట్పల్లి జోన్ పరిధిలో 04, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో 05 అనధికార నిర్మాణాలను మంగళవారం కూర్చి వేయడం జరిగిందని వివరించిన ఉన్నతాధికారులు ప్రతిరోజూ క్షేత్రస్థాయి తనిఖీలు మరియు కఠిన పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత టౌన్ ప్లానింగ్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలకు సిఎంసి అధికారులు మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. భవన నిర్మాణ నిబంధనల అమలును నిర్ధారించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కొనసాగిస్తూ గుర్తించిన అన్ని అనధికార నిర్మాణాలపై నిర్దేశిత విధానం మరియు వర్తించే నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలను కచ్చితంగా చేపట్టడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**సెప్టెంబర్ 10న "చలో హైదరాబాద్"ను విజయవంతం చేయాలి : జిల్లా జేఏసీ చైర్మన్ బి. రవి ప్రకాష్**
**ప్రభుత్వ మొండి వైఖరిపై గళం వినిపిద్దాం**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08 (జనంసాక్షి)**
తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా గెజిటెడ్, నాన్ గెజిటెడ్, క్లాస్--4 ఉద్యోగుల జేఏసీ చైర్మన్ బి. రవి ప్రకాష్ పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన మంగళవారం జిల్లా వ్యాప్తంగా మేడ్చల్ ఎస్టీఓ, షమీర్‌పేట్ ఐటీఐ, మేడ్చల్--మల్కాజిగిరి కలెక్టరేట్, అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తదితర కార్యాలయాల్లో "చలో హైదరాబాద్" పోస్టర్ల పంపిణీ, ఉద్యోగుల సమీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం "చలో హైదరాబాద్" నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ మొండి వైఖరి, చిత్తశుద్ధి లేని పాలనపై ఉద్యోగుల గళం వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. హక్కుల సాధన కోసం ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 10న జిల్లావ్యాప్తంగా ఉద్యోగులంతా ఏకతాటిపైకి వచ్చి హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే మహాసభకు భారీగా తరలిరావాలని కోరారు. ఉద్యోగుల ఐక్యత, పోరాట పటిమను చాటిచెప్పేలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ ప్రధాన కార్యదర్శి వినోద్, అదనపు ప్రధాన కార్యదర్శి వై. రామేశ్వర్ గౌడ్, కో-చైర్మన్ బి. వెంకటేశ్వర్లు, టీఎన్‌జీఓఎస్ జిల్లా కార్యదర్శి భరత్ కుమార్, టీజీఓఎస్ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, కోశాధికారి శేషసాయి గిరికాంత్, రంజిత, ఉపాధ్యక్షులు జేమ్స్, రాజని, కొండల్‌రావు, వేణుగోపాల్, పెన్షన్ సంఘం అధ్యక్షుడు నరసింహులు, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మాణిక్యం, యానిమల్ హస్బెండ్రీ ఫోరం ప్రతినిధులు రవి ప్రకాష్ గౌడ్, విలాసిని, వివిధ యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.






## ఇంటి దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు.. ఇద్దరి అరెస్ట్

**శంషాబాద్,సెప్టెంబర్8(జనంసాక్షి) :** ఊట్పల్లి గ్రామంలో ఇటీవల జరిగిన ఇంటి దొంగతనం కేసును సిసిఎస్ హైదరాబాద్, శంషాబాద్ పోలీసులు సమన్వయంతో ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. పసుమాముల గ్రామానికి చెందిన మార్ల ఈశ్వర్ (22), మార్ల నవీన్ (23)లను అరెస్ట్ చేసి, వారి నుంచి నేరానికి ఉపయోగించిన ఆటో, బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో శంషాబాద్, ఆదిబట్ల, కడ్తాల్‌తో పాటు నల్గొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితులు షఫీ, యోగి, బన్నీల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## ఇద్దరు పెయింటర్ల మృతి

**కుటుంబాలకు అండగా దశమంత్‌రెడ్డి**



**అల్వాల్, 8 సెప్టెంబర్ (జనంసాక్షి):** మచ్చ బొల్లారంలో అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందిన పెయింటర్లు పోతులూరి ప్రభాకర్ (38), ఏ. సత్యనారాయణ కుటుంబాలను అల్వాల్ రైతు సేవా సహకార సంఘం మాజీ చైర్మన్ తోట దశమంత్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా అంత్యక్రియల ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రభాకర్‌కు భార్య, నలుగురు కుమార్తెలు, సత్యనారాయణకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరి మృతితో కుటుంబాల్లో విషాదం నెలకొంది. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని దశమంత్‌రెడ్డి తెలిపారు.

# నిరుద్యోగ బీసీ మహిళలకు వరం..!

**"ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్"కు భారీ స్పందన**
**100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు**
**ఇప్పటికే 9 వేల దరఖాస్తులు.. సెప్టెంబర్ 15 వరకు అవకాశం**
**అర్హులైన మహిళలంతా దరఖాస్తు చేసుకోవాలి : బీసీ అభివృద్ధి అధికారి టి.ఝాన్సీరాణి**





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి)**
బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న "ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్--2026-27" పథకానికి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో విశేష స్పందన లభిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి.ఝాన్సీరాణి తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 9 వేల మంది మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, ఇంకా అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ పథకం ద్వారా టైలరింగ్‌పై ఆసక్తి, నైపుణ్యం కలిగిన బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఒక్కో మిషన్ విలువ రూ.12 వేలుగా ప్రభుత్వం నిర్ణయించిందని, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి యూనిట్ల చొప్పున మొత్తం 5 వేల కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.
పేద, నిరుపేద, నిరాశ్రయ, ఒంటరి మహిళలు, వితంతువులు, అనాథ మహిళలకు ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని ఝాన్సీ రాణి తెలిపారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం మేరా/మేరూ కమ్యూనిటీ మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించనున్నట్లు చెప్పారు.
ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగులై ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు మించరాదని పేర్కొన్నారు. వయస్సు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. రేషన్ కార్డు లేని వారు తహసీల్దార్ జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని జతచేయాల్సి ఉంటుందని తెలిపారు.
టైలరింగ్‌లో నైపుణ్యం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, ప్రాథమిక అక్షరాస్యత ఉన్న వారికి అవకాశం కల్పిస్తామని చెప్పారు. దరఖాస్తులు అధిక సంఖ్యలో వచ్చిన పక్షంలో కనీసం ఐదో తరగతి విద్యార్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అర్హులైన మహిళలు టీజీఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా సెప్టెంబర్ 15, 2026లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో 2023--24 సంవత్సరంలో ఇదే తరహా పథకం కింద లబ్ధి పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేదని, ఒక కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే మిషన్ మంజూరు చేయబడుతుందని స్పష్టం చేశారు. బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని, అర్హులైన ప్రతి మహిళ తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి.ఝాన్సీరాణి కోరారు. పథకానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్లు లేదా బీసీ సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.




## ఆరోగ్య పరిరక్షణలో ఫిజియోథెరపిస్టుల పాత్ర కీలకం

**మహేశ్వరం, ఆగస్టు9(జనంసాక్షి) :** ఆరోగ్య పరిరక్షణలో ఫిజియోథెరపిస్టుల పాత్ర కీలకమని అవేర్ మాధవన్ జీ హాస్పటల్ ఎండీ తరుణ్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఫిజియోథెరఫీ దినోత్సవ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ, కందుకూరు మండల కేంద్రంలో మాధవన్ జీ ఫిజియో థెరపీ ఆఫ్ కాలేజ్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎండీ తరుణ్ మాట్లాడుతూ... ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అవసరమైనప్పుడు అర్హత కలిగిన ఫిజియో థెరపిస్టుల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఫిజియోథెరపీ ద్వారా గాయాలు, శారీరక వైకల్యం,అనారోగ్య సమస్యల నుంచి సులభంగా కోలుకుంటారన్నారు. ఫిజియోథెరపిస్టుల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపల్ మనొగ్న, బీడీ కళాశాల ప్రిన్సిపల్ హనుమంత్ రావు,అమర్ నాథ్, హరి ప్రసాద్, మహిపాల్, విమల హైమావతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్-2026 గడువు పొడిగింపు

**అక్టోబర్ 7 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ**

**మెదక్ బ్యూరో , సెప్టెంబరు 8 ( జనం సాక్షి ):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్‌ను సవరించినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు మరింత అవకాశం కల్పించేందుకు క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువును సెప్టెంబరు 16 నుంచి అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, తొలగింపులు, సవరణలు, చిరునామా మార్పు తదితర దరఖాస్తులను నిర్ణీత గడువులోగా సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

# దర్జాగా రేషన్ బియ్యం మహారాష్ట్రకు తరలింపు

- పగలు రాత్రులు లేకుండా రోజుకి 10 బండ్ల బియ్యం తరలింపు
- ప్రభుత్వ యంత్రాంగం ఏం చేస్తుంది?
- ప్రశ్నిస్తున్న సామాన్య జనం



సారంగాపూర్, సెప్టెంబర్ 8 (జనం సాక్షి) : రాష్ట్ర ఆగస్టు నెలలో ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేయగా గ్రామీణ ప్రాంతాల నుండి కాక పట్టణ ప్రాంతాల నుండి బియ్యం మహారాష్ట్ర కి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు తక్కువ ధరకు సేకరించి, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్ర వైపు శివని, హిమాయతనగర్ లో ఉన్న దళారులు కుంటాల, సారంగాపూర్, బోథ ,ప్రాంతాల రహదారి నుండి తరలించి అక్కడ ఎక్కవ రేటుకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ బియ్యం సంబంధించిన శాఖల అధికారులు నిద్రమత్తులో ఉన్నార లేక వారికి అమ్ముడు పోయారా అని జనం ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం పేద కుటుంబాలకు అందిస్తున్న రేషన్ బియ్యం వారి ఆహార భద్రతకు ఉపయోగపడాల్సి ఉండగా, కొందరు అక్రమార్కులు దానిని వ్యాపారంగా రెషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసే వ్యక్తులపై, దానిని నిల్వ చేసే గోదాములపై, రవాణా చేసే వాహనాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని కోరుతున్నారు.


### అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్న?

రేషన్ బియ్యం అక్రమ దందా జరుగుతోందనే ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రతిరోజు సారంగాపూర్ టు మహారాష్ట్ర వెళ్తున్న సమాచారం ఉన్న అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు. గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి, అక్రమ నిల్వలు, రవాణాను గుర్తించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# విరిగిన స్ట్రెచర్లు వీల్ చైర్లు!

- ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి
- పేషంట్లను తరలించడంలో ఇబ్బందులు పడుతున్న వర్కర్లు
- వరంగల్ ఎంజీఎం లో దుస్థితి
- మరమ్మతులు చేయించాలని కోరుతున్న పేషెంట్లు





వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 08 (జనం సాక్షి) : చారిత్రక వరంగల్ నగరంలోని మహాత్మా గాంధీ మెమోరియల్ హాస్పిటల్ (ఎంజీఎం) లో పేషెంట్లను తరలించేటువంటి స్ట్రెచరులు, వీల్ చైర్లు వాటి వీల్స్ విరిగిపోయి ఇబ్బందికరంగా మారాయి. ఉత్తర తెలంగాణలోని అత్యంత పేదల హాస్పిటల్ అయినటువంటి ఎంజీఎం ఆసుపత్రికి నిత్యం వరంగల్ జిల్లా నే కాకుండా చుట్టుపక్కల ఉన్నటువంటి అన్ని జిల్లాల ప్రజలు కూడా వైద్య సేవల కోసం ఇక్కడికి వస్తుంటారు. అత్యవసర సేవల కోసం , చేతగాని, నడవలేని వాళ్లకోసం స్ట్రచర్లను, వీల్ చైర్లను ఉపయోగిస్తుంటారు. అది కూడా విరిగిపోయి నెట్టితే కదలని స్థితిలో ఉండడం తాజాగా మంగళవారం వరంగల్ ఎంజీఎంలో ఎక్స్రే విభాగం వద్ద కనిపించింది. ఇన్ పేషంట్ గా ఉన్నటువంటి ఓ వ్యక్తిని ఎక్స్రే అనంతరం తిరిగి తన బెడ్ వరకు తీసుకుపోయేందుకు ఇద్దరు మహిళా వర్కర్లు స్ట్రచర్ మీద తీసుకెళుతున్న సమయంలో స్ట్రచర్ కింద ఉన్నటువంటి వీల్స్ విరిగిపోవడంతో స్ట్రచర్ కదలక చాలాసేపు ఇబ్బంది పడ్డారు. ఉన్నది ఒకటే స్ట్రెచర్ ఇది కూడా పనిచేయడం లేదని బలవంతంగా నైనా దీని మీదనే తీసుకెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

### విరిగిన వీల్ చైర్లు

ఇదే ఎంజీఎంలో క్యాజువాలిటీ (అత్యవసర విభాగం వద్ద) కొత్తగా ఇదే రోజు తీసి వాడేందుకు పెట్టినటువంటి వీల్ చైర్(సి ఏ ఎస్ అని రాసిన) కూడా వీల్ విరిగిపోయి నిరుపయోగంగా తయారయింది. ఇక్కడ కూడా ఓ మహిళ వర్కర్ చైర్ వీలు విరిగిపోయిన సంగతి చెప్పింది. ఇలా అయితే పేషంట్లను ఎలా తీసుకెళ్లాలి అని కూడా ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో కూడా ఆస్పత్రికి వచ్చిన పేషెంట్లకు సరైనటువంటి స్ట్రేచర్ల, వీల్ చైర్లు అందుబాటులో ఉంచకపోవడంతో పేషెంట్లను ఆయా కుటుంబ సభ్యులు బంధువులు ఎత్తుకొని వెళ్లిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టి రిపేరుకు వచ్చినటువంటి స్ట్రెచరూలు , వీల్ చైర్ లను మరమ్మతులు చేయించి ఇటు పేషెంట్లను తరలించే వర్కర్లకు, అటు పేషెంట్లకు ఎ లాంటి అసౌకర్యం, ఇబ్బంది కలగకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఇండ్లపై ప్రమాద కరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

- తీగలు తొలగించాలంటే డబ్బులు కట్టవలసిందే
- పేదలకు శాపంగా మారుతున్న తీగలు
- ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు



కౌటాల సెప్టెంబర్ 08 (జనంసాక్షి) : ప్రతి గ్రామంలో ఇండ్లపై విద్యుత్ లైన్లు యమపాశాల్లా వేలాడుతూ ప్రమాదభరితంగా మారాయి. ఏ క్షణంలో ప్రమాదం ఎటు నుంచి ఎటు పొంచుకొని వస్తుందో తెలియక కాలనీవాసులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. విద్యుత్ వైర్లను వెదురు బొంగులతో పైకి లేపి కాలం వెళ్ళదీస్తున్నారు. ఇంకొందరు విద్యుత్ తీగలకు ప్లాస్టిక్ పైపులు తొడిగిస్తున్నారు. ఇండ్ల ముందు సైతం చేతికి అందే ఎత్తులో విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాద భరితంగా మారడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవనం సాగిస్తున్నట్లు కాలనీవాసులు పేర్కొంటున్నారు. స్లాబులపై వేలాడుతున్న వైర్లు ఎప్పుడు మీద పడతాయో తెలియని పరిస్థితుల్లో ఉన్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గాలి వీస్తే వైర్లు కలిసి వరిగడ్డివాములు పూరి గుడిసెలు సైతం అగ్నికి ఆహుతి కావడంతో పాటు పలు ప్రమాదాలు జరిగినా అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు.

### అధికారుల తప్పుకు యజమాని తిప్పలు

ఇంటి యాజమని తన సొంత భూమిలో ఇల్లు కట్టుకుంటున్న పైన ఉన్న విద్యుత్ తీగలతో ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా ఇష్టా రాజ్యంగా విద్యుత్ స్పంభాలు వేసి, ఇంటిపై ప్రమాద కరంగా ఉన్న తీగలు తొలగించాలంటే డబ్బులు కట్టాల్సి వస్తుంది. విద్యుత్ అధికారులు గతంలో ఖాళీ స్థలం కనబడితే చాలు వేసుకుంటూ వెళ్లారు. వాళ్ల రూల్స్ ప్రకారం వేసుకుంటే సమస్య రాక పోతుండే, అధికారులు చేసిన తప్పుకు ఇంటి యాజమని ఇబ్బంది పడాల్సి వస్తుంది.

కాలనీలోని ఇండ్లు, స్లాబులపై వేలాడుతున్న విద్యుత్ వైర్లు మార్చాలని అనేకమార్లు అధికారులకు విన్నవించా మని స్తంభాలను మార్చేందుకు అవసరమైన నిధులు మీరే సమకూ ర్చుకోవాలని పేర్కొనడంతో ఆర్థిక స్తోమత లేక అలానే ఉండి పోతున్నాయి. దీంతో భయం గుప్పెట్లో కాలం వెళ్లదీ స్తున్నట్టు కాలనీవాసులు తెలిపారు. విద్యుత్ వైర్లు, స్తంభాలకు పిచ్చి తీగలు సోకి ప్రమాద భరితంగా మారాయని విద్యుత్ శాఖ అధికా రులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరు తున్నారు. ఇండ్లు కట్టుకోవడమే భారంగా మారుతున్న ఈ రోజుల్లో విద్యుత్ సమస్య లలతో పేదవాళ్ళు ఇంకా సతమత మైతు న్నారు.దాంతో చాలా మంది కట్టుకునే ఇండ్లు ఆగిపోతున్నాయి. ప్రభుత్వం పేదల కోసం ప్రమాద కరంగా ఉన్న విద్యుత్ తీగల తొల గించడానికి అయ్యే ఖర్చు ను ప్రభుత్వం భరించుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



# కుదురుపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదం

- రెండు బైక్‌ల పై ఉన్న వ్యక్తులకు తీవ్ర గాయాలు

మహదేవపూర్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి) : కుదురుపల్లి బ్రిడ్జి వద్ద మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో రెండు బైక్‌లపై ఉన్న వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఈ ప్రమాదంలో మహదేవపూర్ మండలం కొత్త బెగ్లూర్ గ్రామానికి చెందిన పెద్దపోలు సత్యం గౌడ్ భార్య స్వరూప ఇద్దరు కాళేశ్వరం నుండి బైక్ వస్తున్న క్రమంలో అదే సమయంలో మహదేవపూర్ నుండి కాలేశ్వరం గ్రామానికి చెందిన బండి అనిల్ కాలేశ్వరం వెళ్తున్న క్రమంలో కుదురు పల్లి బిర్జి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో పెద్దపోలు సత్యం గౌడ్ కు ఎడమ సైడ్ కాలు విరిగినట్లు భార్యస్వరూప కు చేయికి తీవ్ర గాయాలయ్యాయి. మరొక బైక్‌పైను వ్యక్తి కాలు విరిగినట్లు తెలిపారు. ఎమర్జెన్సీ చికిత్స కోసం 108కు సమాచార అందించి క్షతగాత్రులను మహదేవపూర్ సామాజిక వైద్యశాలకు తరలించారు. అనంతరం మహదేవపూర్ ప్రభుత్వం ఆసుపత్రి వైద్యులు మెరుగైన వైద్యం కొరకు వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు.

# బడి పంతుల్ల గలాట

- బయటపడ్డ బాగోతం..!
- పాఠశాలలో పీఎం శ్రీ నిధుల ఖర్చుపై వివాదం
- ప్రభుత్వ పంతుల్ల పరస్పరం ఆరోపణలు.
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రధానోపాధ్యాయులు




నడికూడ సెప్టెంబర్ 8 (జనం సాక్షి) : సమ సమాజంలో గౌరవప్రదమైన వృత్తిగా భావించే ఉపాధ్యాయ వృత్తికి మచ్చ తెచ్చేలా నడికూడ మండలం వరికోలు ప్రాథమిక పాఠశాలలో ఘటన చోటుచేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో పీఎం శ్రీ పథకం నిధుల ఖర్చుపై మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు పరస్పరం వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. తల్లిదండ్రుల సమక్షంలోనే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ గొడవకు దిగడం చర్చనీయాంశంగా మారింది. పీఎం శ్రీ నిధుల ఖర్చుపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన సమావేశానికి గ్రామ సర్పంచ్, పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండా, తమకు అనుకూలంగా ఉన్న కొందరు తల్లిదండ్రులను మాత్రమే పిలిచారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. సమావేశంలో నిధుల వినియోగం, పంపకాల అంశంపై ఉపాధ్యాయుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు తెలిసింది.

### గతంలోనూ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు

పాఠశాల నిధుల వ్యవహారంపై గతంలోనూ వివాదాలు తలెత్తినట్లు సమాచారం. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఫోర్జరీ సంతకాలతో నిధులు దుర్వినియోగం చేశారంటూ కొందరు ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పీఎంసీ నిధుల వినియోగంలోనూ అవకతవకలు జరిగాయంటూ మండల, జిల్లా విద్యాధికారులకు గతంలో ఫిర్యాదులు అందినట్లు సమాచారం. మంగళవారం మరోసారి పాఠశాలలో వివాదంచోటు చేసుకోవడంతో ప్రధానోపాధ్యాయుడు శరత్ ఉపాధ్యాయుడు అశోక్‌పై పరకాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం . పాఠశాల నిధుల వినియోగంపై నెలకొన్న వివాదంపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. బడి పంతుల్ల అవినీతి బాగోతం బట్టబయలు చేయాలని జిల్లా అధికారులు ప్రత్యేక తీసుకొని తూతూ మంత్రంగా విచారణ చేపట్టకుండా వీరికి వచ్చిన నిధులు ఎన్ని చేపట్టిన పనులు ఎన్ని పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామ ప్రజల ముందు వెలుపుచ్చాలి అని గ్రామస్తులు జిల్లా విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# గణేష్ నిమర్జన కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ నితికా పంత్



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08(జనంసాక్షి) : రాబోయే గణపతి నిమర్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధమవుతోందని జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జిల్లాలోని ప్రధాన గణపతి నిమర్జన కేంద్రాలు అయిన ఆసిఫాబాద్,కాగజ్ నగర్ పెద్దవాగు స్వయంగా పరిశీలించారు. నిమర్జన ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ,ప్రజల రాకపోకలు, పార్కింగ్,బారికేడింగ్ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. నిమర్జన ప్రాంతాల్లో బారికేడింగ్, రోప్ బ్యారియర్స్, తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలి అని అన్నారు. గణేష్ విగ్రహాలతో వచ్చే వాహనాల కోసం ప్రత్యేక రూట్ మ్యాప్ రూపొందించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి అని అన్నారు. నిమర్జనానికి వచ్చే వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలి అని అన్నారు. భారీగా ప్రజలు గుమిగూడే ప్రాంతాల్లో క్రౌడ్ మేనేజ్‌మెంట్ మరియు నిరంతర పోలీస్ పర్యవేక్షణ ఉండాలి అని అన్నారు. అవసర మైన ప్రాంతాల్లో సీసీటీవీ , డ్రోన్ నిఘా, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా పరిస్థితులను పర్యవేక్షించాలి అని అన్నారు. నీటి వనరుల వద్ద ప్రమాదకరమైన, లోతైన ప్రాంతాలను గుర్తించి బారికేడింగ్ ఏర్పాటు చేయాలి అని అన్నారు. నిమజ్జన సమ యంలో ఉపయోగించే క్రేన్/ఇతర యంత్ర పరికరాలు సురక్షితంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలి అని అన్నారు. గణేష్ నిమర్జన కేంద్రాల వద్ద వైద్య, అగ్నిమాపక, రక్షణ బృందాలతో సమన్వయం చేసుకోవాలి అని అన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే స్పందించేలా క్విక్ రెస్పాన్స్ టీమ్స్ సిద్ధంగా ఉంచాలి అని అన్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని అన్నారు. పిల్లలు లేదా కుటుంబ సభ్యులు తప్పిపోయిన సందర్భాల్లో వెంటనే సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్/అవసరమైన సహాయక వ్యవస్థ ఏర్పాటు చేయాలి అని అన్నారు. గణేష్ మండపాల నుంచి నిమర్జన కేంద్రాల వరకు జరిగే ఊరేగింపులు క్రమబద్ధంగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులకు ఆదేశించారు. ఒకేసారి భారీగా వాహనాలు, ప్రజలు నిమర్జన కేంద్రాల వద్ద చేరకుండా క్రమబద్ధమైన రాకపోకలు, అవసరమైన ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేయాలని సూచించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీస్ అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ,ప్రజలతో సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. గణపతి నిమజ్జన కార్యక్ర మంలో ప్రజలు పోలీస్ శాఖ సూచనలు పాటిస్తూ, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగుల ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ

పాలకుర్తి, సెప్టెంబర్ 08(జనంసాక్షి) ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఈ నెల 10న చలో హైదరాబాద్ లో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉద్యోగులు వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో పాలకుర్తి యూనిట్ అధ్యక్షుడు బక్క మహేశ్, పంచాయతీ కార్యదర్శుల పోరం జిల్లా అధ్యక్షుడు రౌండ్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు రావల్సిన డీఏ బకాయిలులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, అనూరాధ, నాగరాజు, వరుణ్, రాజయ్య, అశోక్, రేణుక, శైలజ పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం

- శాస్త్రీయ అధ్యయనాలు, భద్రతా ప్రమాణాల సమగ్ర పరిశీలన అనంతరమే నిర్ణయం
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 08(జనంసాక్షి) : యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పాలంపేట ప్రత్యేక అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాపూర్ మండల పరిధిలో చేపడుతున్న ఓపెన్‌కాస్ట్ మైనింగ్ పనుల వల్ల కాకతీయ రుద్రేశ్వర రామప్ప దేవాలయానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ఏర్పాటుకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం మంజూరు అంశాలపై కమిటీ సభ్యులతో సమగ్రంగా చర్చించారు. ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌కు సంబంధించిన అంశాలపై ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని అభిప్రాయాలను వెల్లడించారు. రామప్ప దేవాలయ పరిరక్షణ, పర్యావరణం, శాస్త్రీయ అధ్యయనాలు, నిరంతర పర్యవేక్షణతోపాటు సంబంధిత నిబంధనలు, భద్రతా ప్రమాణాల పై విస్తృతంగా చర్చించారు. సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు వెల్లడించిన అభిప్రాయాలను నమోదు చేశామని, అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జీఎం జి దేవేందర్, పర్యావరణ విభాగం జీఎం పి సైదులు, ఎక్స్‌ప్లోరేషన్ జీఎం పంకజ్ కులశ్రేష్ఠ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆర్.సునీత, పురావస్తు శాఖ సహాయ సంచాలకురాలు బి గంగాదేవి, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్లు అజిత్ ఎంఎస్, వంశీకృష్ణ జ్యోతి, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు జె. శ్రీధర్‌రావు, ఆచార్య ఎం పాండురంగారావు, పాలంపేట సర్పంచ్ సీహెచ్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి కె వెంకయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి రజని, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం శివాజీ, ఇర్రిగేషన్ ఈఈ నారాయణ, వెంకటాపూర్ తహసిల్దార్ గిరిబాబు, ఎంపిడిఓ రాజు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎస్‌పి భూముల్లో యథేచ్ఛగా చెట్ల నరికివేత

- నిద్రమత్తులో అటవీ అధికారులు



దిలావర్‌పూర్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):దిలావర్‌పూర్ మండలం బన్సపెల్లి గ్రామ శివారులోని ఎస్ఆర్ఎస్‌పీ బ్యాక్‌వాటర్ పరిధిలో ప్రభుత్వ భూముల్లో చెట్ల నరికివేత యథేచ్ఛగా కొనసాగుతున్నది. సుమారు పదేళ్ల క్రితం మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి భారీ వృక్షాలుగా మారగా, వాటిని తొలగిస్తున్న తీరు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెరిగిన వృక్షాలు పచ్చదనాన్ని పెంచడంతో పాటు భూసార పరిరక్షణకు, పక్షులు, ఇతర జీవజాలానికి ఆవాసంగా నిలుస్తున్నాయి. అలాంటి చెట్లను పెద్ద ఎత్తున తొలగిస్తుండటంతో పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు చెట్లను నరికివేయగా, మరికొన్ని చెట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

### గ్రామ అభివృద్ధి, పశుగ్రాసం కోసమేనంటున్న విడిసి సభ్యులు

చెట్ల నరికివేతపై గ్రామస్తులను సంప్రదించగా, విడిసి సభ్యులు మాత్రం భిన్నమైన వివరణ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి పనులకు అవసరమైన స్థలం లేకపోవడం, పశుగ్రాసానికి భూమి అందుబాటులో లేకపోవడంతో ఏపుగా పెరిగిన చెట్లను తొలగిస్తున్నామని తెలిపారు. అయితే ప్రభుత్వ భూముల్లో ఉన్న వృక్షాలను తొలగించేందుకు సంబంధిత శాఖల అనుమతులు తీసుకున్నారా? అనే అంశంపై స్పష్టత లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

### అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

ప్రభుత్వ భూముల్లో చెట్ల నరికివేత జరుగుతున్నప్పటికీ అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ, వృక్ష సంపదను కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. చెట్ల నరికివేతకు అధికారిక అనుమతులు ఉన్నాయా? సంబంధిత శాఖల నుంచి ముందస్తు అనుమతులు తీసుకున్నారా? అనుమతులు లేకుండానే వృక్షాలను తొలగిస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నరికిన చెట్లను ఎక్కడికి తరలిస్తున్నారు? వాటి కలపను ఏ విధంగా వినియోగిస్తున్నారు? అనే అంశాలపైనా అధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఒకవైపు ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తుంటే, మరోవైపు ఏళ్ల తరబడి పెరిగిన వృక్షాలను విచక్షణారహితంగా తొలగించడం పట్ల పర్యావరణ ప్రేమికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెట్ల కోత కొనసాగితే భవిష్యత్‌లో పచ్చదనం తగ్గడంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అటవీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి చెట్ల నరికివేతకు సంబంధించిన అనుమతులు, ఉద్దేశ్యం, నరికిన వృక్షాల వివరాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా చెట్లు నరికినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములను, అక్కడి వృక్ష సంపదను కాపాడేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
09 సెప్టెంబర్ 2026

# భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి : కలెక్టర్ అంకిత్

**మూడు రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి**
**రైతులు అవసరమైన పత్రాలు, భూమి హద్దులు చూపించి సహకరించాలి**



**కొత్తగూడెం క్రైమ్ ,సెప్టెంబర్08 (జనం సాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
పాల్వంచ మండలంలోని బోజ్యా తండా పరిధిలో చేపడుతున్న భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బోజ్యా తండా పరిధిలోని సర్వే నంబర్ 77లో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా రీ-సర్వేలో భాగంగా సర్వే అధికారులు రోవర్ పరికరాల సహాయంతో భూములను కొలుస్తున్న విధానాన్ని, క్షేత్రస్థాయిలో భూముల హద్దులను గుర్తిస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న సర్వే ద్వారా భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, స్థానాన్ని ఖచ్చితంగా గుర్తించి, సంబంధిత భూ రికార్డులతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.
బోజ్యా తండా పరిధిలో మొత్తం 458 ఎకరాల్లో భూముల రీ-సర్వే చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం సర్వే నంబర్ 77లో 88 ఎకరాల్లో రీ-సర్వే పనులు కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు చేపట్టిన సర్వే పురోగతి, మిగిలిన భూముల్లో చేపట్టాల్సిన పనులు, సర్వేకు అవసరమైన సిబ్బంది, పరికరాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.భూముల రీ-సర్వేలో భాగంగా ప్రతి భూ యజమానికి సంబంధించిన భూమి హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుబాటులో ఉన్న భూ రికార్డులతో సరిపోల్చాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.
గ్రామంలో భూరీ-సర్వే పనులను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే సమయంలో భూ యజమానుల నుంచి అవసరమైన వివరాలు, రికార్డులు, పత్రాలు సేకరించి, భూమి హద్దులను స్పష్టంగా గుర్తించాలని తెలిపారు. భూముల విషయంలో భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి రీ-సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల భూపత్రాలను పరిశీలించారు. తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర అందుబాటులో ఉన్న భూ రికార్డులను సర్వే అధికారులకు అందజేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో తమ భూముల వాస్తవ హద్దులను చూపించి సర్వే ప్రక్రియకు సహకరించాలని రైతులకు సూచించారు.
భూముల రీ-సర్వే పూర్తయిన అనంతరం భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలు మరింత స్పష్టంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.
కార్యక్రమంలో తహసీల్దార్ ధార ప్రసాద్, సర్వేయర్లు వెంకన్న, కళ్యాణ్, లైసెన్స్ సర్వేయర్లు మధు, వంశీ, కవిత, జీపీఓ రాధా, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

### కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం రూరల్,సెప్టెంబర్ 8(జనంసాక్షి):**
వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో సాగర్ కాల్వ నుంచి ఏదులాపురం చెరువుకు నీటిని తరలించే ఎన్ఎస్‌పీ లింక్ కెనాల్, తూము పునరుద్ధరణ పనులను ఆయన పరిశీలించారు. సాగర్ కాల్వ నుంచి ఏదులాపురం చెరువుకు నీటి సరఫరా జరిగే కాల్వ ప్రస్తుత పరిస్థితి, చెరువు వరకు ఉన్న దూరం, నీరు సాఫీగా ప్రవహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాల్వ, తూము పునరుద్ధరణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి చెరువుకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఎస్ఐఆర్‌పై ఆరా..**
ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండల పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై కూడా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లలో ఒక్కరూ మిస్ కాకుండా ప్రతి ఒక్కరూ హియరింగ్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు.

**తక్కువ ఎత్తు విగ్రహాల ఏర్పాటుకు సూచన.**
మున్నేరు, ఇతర చెరువుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున గణేశ్ విగ్రహాలను తక్కువ ఎత్తులోని మండపాలపై ఏర్పాటు చేసుకునేలా ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, తహసీల్దార్ వినయేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ విక్రమ్, మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆమడ దూరంలో అన్నపురెడ్డిపల్లి

- **కంకర వేశారు.. తారు మరిచారు!**
- **నత్తనడకన సెంటర్ లైటింగ్ పనులు..**

**ప్రజలకు తప్పని ఇబ్బందులు**



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 8, జనంసాక్షి**
అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్న ఆనందం స్థానికుల్లో ఎంతోకాలం నిలవడం లేదు. పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేయడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో చేపట్టిన రహదారి, సెంటర్ లైటింగ్ పనుల పరిస్థితి ఇందుకు నిదర్శనంగా మారింది. ప్రధాన రహదారిపై కంకర వేసి తారు వేయకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి అభివృద్ధిలో భాగంగా కంకర వేసినప్పటికీ తదుపరి దశ పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో రహదారిపై దుమ్ము, దూళి ఎగసిపడుతూ పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నత్తనడకన సెంటర్ లైటింగ్ పనులు**
మండల కేంద్రానికి అందం, భద్రత చేకూర్చే ఉద్దేశంతో చేపట్టిన సెంటర్ లైటింగ్ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. రాత్రివేళల్లో ప్రధాన రహదారిపై సరైన వెలుతురు లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**అధికారులు స్పందించాలి**
అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రం అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తి చేసి, సెంటర్ లైటింగ్ పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కోరుతున్నారు.



## గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి..

### జిల్లాఎస్పి రోహిత్ రాజ్.. ఐపీఎస్



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):**
గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణం లో నిర్వహించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సూచించారు. గణేష్ మండపాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎస్పీ తెలిపారు. డీజేలకు అనుమతి లేదని, పరిమిత శబ్దంతో స్పీకర్లను మాత్రమే వినియోగించేందుకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు.ప్రధాన రహదారులు, ట్రాఫిక్ రాకపోకలు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గణేష్ మండపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జన శోభాయాత్రలో డీజేలు, టపాసులు పూర్తిగా నిషేధమని తెలిపారు.
ఉత్సవాల సందర్భంగా పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి)**
బాల్య వివాహాలను అరికట్టేందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించిందని, బాల్య వివాహాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. బాల్య వివాహాల వల్ల బాలల భవిష్యత్తు, విద్య, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నందున, ఇటువంటి వివాహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించరాదని పోలీస్ కమిషనర్ తెలిపారు.బాల్య వివాహాలకు పాల్పడే వారు, ప్రోత్సహించే వారు, సహకరించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలపై సమాచారం అందిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కూసుమంచి బోటిమీడి తండా, తల్లాడ మండలం అన్నారుగూడెం,వైరా మండలం తాటిపూడి, సత్తుపల్లి బేతుపల్లి, కామేపల్లి మండలం బాసిత్ నగర్, బోనకల్ మండలం పెద్దబీరవల్లి, వైరా మండలం, గన్నవటం. ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం ఎనిమిది బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సకాలంలో జోక్యం చేసుకుని వివాహాలను నిలిపివేశారని తెలిపారు. అదేవిదంగా 12 కేసులు నమోదు అయినట్లు పేర్కొన్నారు. బాల్య వివాహాల నివారణకు తల్లిదండ్రులు, ప్రజలు, ఉపాధ్యాయులు మరియు సంబంధిత శాఖల అధికారులు పోలీస్ శాఖకు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

## 400 బుల్లెట్ సైలెన్సర్ల ధ్వంసం

### అడిషనల్ డీసీపీ రామానుజం

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 8 ( జనం సాక్షి )**
శబ్ద కాలుష్యాన్ని సృష్టిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న బుల్లెట్ ద్విచక్ర వాహనాల సైలెన్సర్లపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నట్లు అడిషనల్ డీసీపీ రామానుజం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బుల్లెట్ సైలెన్సర్లను పోలీస్ హెడ్ క్వాటర్స్ లో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలకు కంపెనీ నిర్దేశించిన ఒరిజినల్ సైలెన్సర్లనే వినియోగించాలని, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను అమర్చుకుని ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని సూచించారు.ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దంతో వాహనాలు నడపడం, నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను మార్చడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ప్రజల ప్రశాంతత, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శబ్ద కాలుష్య నియంత్రణకు పోలీసుల చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా తెలిపారు.గతంలో 1654 బుల్లెట్ సైలెన్సర్లను తొలగించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, ఇన్స్పెక్టర్ సత్యనారాయణ,అప్పలనాయుడు పాల్గొన్నారు.



## బూర్గంపహాడ్‌లో గంజాయి పట్టివేత

- **18.6 కిలోల గంజాయి స్వాధీనం..**
- **ఇద్దరు నిందితులు అరెస్ట్**



**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 08 (జనంసాక్షి)**
బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని బూర్గంపహాడ్ పోలీసులు పట్టుకున్నారు. వ్యవసాయ మార్కెట్ వద్ద సోమవారం (సెప్టెంబర్ 7) నిర్వహించిన వాహన తనిఖీల్లో టీవీఎస్ ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 18.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.9.33 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు బూర్గంపహాడ్ ఎస్ఐ ఈ. నాగబిక్షం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టగా, ఇద్దరు వ్యక్తులు రెండు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారు. తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. నిందితులు కర్ణాటకలోని తుమకూరు జిల్లా వాసులైన నవీన్‌కుమార్ (27), విజయ్‌కుమార్ (33)గా పోలీసులు గుర్తించారు. విచారణలో ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి కర్ణాటకకు తరలిస్తున్నట్లు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి 18.6 కిలోల గంజాయి, టీవీఎస్ (బైక్) ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఈ. నాగబిక్షం ఫిర్యాదు మేరకు ఎస్ఐ మేడా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులిద్దరినీ మంగళవారం న్యాయస్థానంలో హాజరుపరచగా, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

## త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

### కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు 08( జనంసాక్షి)**
సాగర్, గోదావరి జలాలను త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతతో కాపాడుకోవాలని, రైతులు నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పల్లెగూడెం ఎన్ఎస్పీ కాల్వ లింకు కెనాల్ పునరుద్ధరణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగర్ జలాల ప్రవాహాన్ని పరిశీలించి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువుకు నీటి సరఫరా జరిగే కాలువ, తూము మరమ్మత్తు పనుల పై మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత కాలువ పరిస్థితి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువు వరకు ఉన్న దూరం, నీటి సాఫీగా ప్రవహించేందుకు అనువైన పరిస్థితులు తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. సాధ్యమైనంత త్వరితగతిన కాలువ, తూము పునరుద్ధరణ పనులను పూర్తిచేయాలని, త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలం పరిధిలో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పై ఆరా తీశారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఏ ఒక్కరు మిస్ కాకుండా ప్రతి ఒక్కరిని హియరింగ్ కు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.
సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు సైతం చర్యలు చేపట్టాలన్నారు.అనంతరం రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద జలాల పరిస్థితిని పరిశీలించారు. అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో గోదావరి, సాగర్ నుంచి తరలిస్తున్న నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించాలని, త్రాగునీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రాధాన్యత క్రమంలో నీటిని వినియోగించాలని అన్నారు. వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.నీటి ప్రవాహాల్లో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా కాలువలు, రెగ్యులేటర్లు, అవుట్‌లెట్లను నిరంతరం తనిఖీ చేయాలని, నీటి లభ్యతను బట్టి చెరువులను నింపేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఇర్రిగేషన్ సీఈ వాసంతి, ఖమ్మం ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవో శ్రీనివాస్, వైరా ఈఈ బాబురావు, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, తహసీల్దార్లు వినయేందర్ రెడ్డి, అరుణ, ఇరిగేషన్ ఏఈ విక్రమ్ తో పాటు పలువురు మున్సిపల్, ఇరిగేషన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## సూర్యాపేటకు కొత్త మాస్టర్ ప్లాన్

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- **దోసపహాడ్ ప్రాజెక్టు పునరుద్ధరణకు కసరత్తు**
- **పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి పెద్దపీట**
- **60 ఫీట్ రోడ్డు నుంచి కలెక్టరేట్‌కు అనుసంధాన రహదారిపై కీలక నిర్ణయం**
- **మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి**




**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేట పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు.మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.భవిష్యత్‌లో నీటి సమస్య తలెత్తకుండా గతంలో వినియోగంలో ఉన్న దోసపహాడ్ ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.మిషన్ భగీరథ అధికారులతో ఇప్పటికే ఫీల్డ్ విజిట్ నిర్వహించి పట్టణంలో నీటి సరఫరాకు సంబంధించిన సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. వాటర్ ట్యాంకుల ద్వారా వివిధ వార్డులకు నీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు.ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే పాలకవర్గం ముందుకు వచ్చిందని, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే పాలకవర్గం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి మాట్లాడుతూ వర్షాలు లేకపోవడంతో బోర్లు ఎండిపోవడం వల్ల కూడా కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్య ఏర్పడిందన్నారు.ఈ విషయంపై మూసీ అధికారులతో మాట్లాడి సద్దుల చెరువును నింపినట్లు చెప్పారు.దీంతో చుట్టుపక్కల వార్డుల్లోని బోర్లకు కొంతమేర నీరు సమకూరుతున్నదని వివరించారు.మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎండీ షఫీ ఉల్లా మాట్లాడుతూ పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి మున్సిపల్ పాలకవర్గం కట్టుబడి ఉందన్నారు.కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణు మాట్లాడుతూ 60 ఫీట్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వెళ్లే మార్గానికి కనెక్టివిటీ కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు.బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సరఫరా సమస్యపై ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి పెట్టకపోతే, రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. తమ వార్డులకు నీటి సరఫరా కోసం ట్యాంకర్ పంపించాలని అధికారులకు,సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించకపోవడం సభ దృష్టికి తీసుకొచ్చారు.దీనిపై స్పందించిన కమిషనర్ హన్మంత రెడ్డి కౌన్సిలర్లు ఎవరైనా ఫోన్ చేస్తే అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా స్పందించాలని ఆదేశించారు.ప్రజాప్రతినిధులు తెలిపే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రజలు ఎన్నుకున్న కౌన్సిలర్లకే వార్డుల సమస్యల పరిష్కారంలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ తమ వార్డుల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.అనంతరం గత 4 సంవత్సరాల 9 నెలలుగా పీఎఫ్ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్న 120 మంది పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయాలని సమావేశంలో నిర్ణయించారు.పట్టణ కొత్త మాస్టర్ ప్లాన్‌కు జనరల్ బాడీ సమావేశంలో ఆమోదం తెలిపారు. 60 ఫీట్ రోడ్, కలెక్టరేట్ రోడ్డు అనుసంధానానికి సంబంధించిన ప్రతిపాదనలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కలిసి అందించాలని నిర్ణయించారు.అన్ని అంశాలను సభ్యులు ఆమోదించారు. పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు దోసపహాడ్ ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు, మిషన్ భగీరథ సరఫరాలో లోపాలను సరిదిద్ది ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందించేలా చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



# విపణి




## వైట్ కాలర్ జాబ్స్ జోరు..
### హైదరాబాద్‌లో పెరిగిన అవకాశాలు

**హైదరాబాద్(జనంసాక్షి):**దేశంలో వైట్ కాలర్ ఉద్యోగ నియామకాలు బలమైన వృద్ధిని నమోదు చేశాయి వార్షిక ప్రాతిపదికన ఆగస్టులో 14 శాతం నియామకాలు పెరిగాయని నౌకరీ.కామ్ నివేదిక వెల్లడించింది. గతేడాది ఇదే సమయంలో జాబ్‌స్పీక్ సూచీ 2,664గా ఉండగా.. ఆగస్టు నాటికి 3,028కి చేరింది. ముఖ్యంగా హైదరాబాద్‌లో నియామకాలు జోరు అందుకున్నాయని నివేదిక తెలిపింది.కొత్త నియామకాలు, తమ ప్లాట్‌ఫాంలో ఉద్యోగ సెర్చ్ ఆధారంగా నెలవారీ నివేదికను నౌకరీ.కామ్ రూపొందించింది. ఆటో రంగంలో రికార్డు స్థాయిలో 19 శాతం వరకు వైట్ కాలర్ ఉద్యోగ నియామకాలు చేపట్టారు. హెల్త్‌కేర్- 16 శాతం, రిటెయిల్- 15 శాతం, ఇన్సూరెన్స్-12 శాతం, ఐటీ విభాగాల్లో-11 శాతం చొప్పున నియామకాలు జరిగాయి. ఐటీ సెక్టార్ పుంజుకోవడం, నాన్-ఐటీ రంగాలు వేగంగా విస్తరించడమే ఇందుకు కారణమని నివేదిక పేర్కొంది. 8-12 ఏళ్ల అనుభవం ఉన్న వారికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వారికి 16 శాతం మేర అవకాశం కల్పించారు. ఆ తర్వాత ఫ్రెషర్లకు అవకాశం దక్కుతోంది. వీరిని 15 శాతం మేర నియమించుకున్నారు. నగరాల వారీగా చూస్తే.. హైదరాబాద్ 23 శాతం అధిక నియామకాలతో ముందు వరుసలో ఉంది. ఆ తర్వాత కోల్‌కతా, చెన్నై, బెంగళూరు వంటి నగరాలు ఉన్నాయి.

## శాంసంగ్ ఇండియాలో 100 మంది ఎగ్జిక్యూటివ్‌లపై వేటు..?




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**టెక్ దిగ్గజం శాంసంగ్ ఇండియా పలు విభాగాల్లో ఎగ్జిక్యూటివ్ స్థాయి ఉద్యోగులపై వేటు వేసింది. వీటిల్లో టెలివిజన్, హోమ్ అప్లయన్సెస్ వంటి విభాగాలున్నాయి. వ్యయ నియంత్రణలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. డిమాండ్ బలహీన పడటం, విస్తృత స్థాయిలో పునర్వ్యవస్థీకరణ వంటివి కూడా దీనికి కారణంగా నిలిచాయి. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.కంపెనీ ఇప్పటి వరకు 80-100 మంది ఉద్యోగులను తొలగించినట్లు తెలుస్తోంది. కంపెనీలో బ్యాచ్‌ల వారీగా లేఆఫ్‌లు వేసే అవకాశం ఉంది. బ్రాంచ్ మేనేజర్లు, టీమ్ లీడర్లు, ప్రధాన కార్యాలయంలోని డైరెక్టర్ స్థాయి వారిని కూడా తొలగించనున్నట్లు తెలుస్తోంది.

# మార్కెట్లపై ‘చమురు’ ఎఫెక్ట్..
### నష్టాల్లో ముగిసిన సూచీలు



**ముంబై(జనంసాక్షి):** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం భారీ నష్టాల్లో ముగిశాయి అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి పరిస్థితులు, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం, అమెరికా వడ్డీ రేట్లు పెంపు భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో రెండో సెషన్‌లోనూ సూచీలు నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 75,970.28 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,132.81) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో ఓ దశలో 75,553.35 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరికి 555.23 పాయింట్లు క్షీణించి 75,577.58 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144.05 పాయింట్లు కోల్పోయి 23,635.10 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.81గా ఉంది. సెన్సెక్స్ 30లో ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, కోటక్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు ప్రధానంగా నష్టపోగా.. బీఈఎల్, అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యునిలీవర్, ఇండిగో, హెచ్‌సీఎల్, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 98.39 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్స్ ధర 4,400.62 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# మొబైల్ ఛార్జర్లతో ఆందోళనలు ఉండవిక
### హైవేల్లో ఈవీతో హాయిగా..



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్‌లో విద్యుత్ వాహనాల(ఈవీ) మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. అందులో సందే హం లేదు. వాహనాల లభ్యత, ధరల విషయాన్ని పక్కనపెడితే విద్యుత్ వాహనాలను వాడే వినియోగదార్లకు ఉండే ఏకైక ఆందోళన సుదూర ప్రయాణాల విషయంలోనే. ముఖ్యంగా జాతీయ రహదార్లపై ఈవీతో పరుగులు తీయాలనుకునే కొనుగోలుదార్ల మదిలో ఎదురయ్యే తొలి సందేహం ఎక్కడ ఛార్జింగ్ అయిపోతుందో అక్కడ ఛార్జింగ్ స్టేషన్ ఉంటుందా ఉండదా అనే. అందుకు గట్టి పరిష్కారమే మొబైల్ ఈవీ ఛార్జర్లు. ఛార్జింగ్ మౌలిక వసతుల ఏర్పాటు విషయంలో భారత్ మంచి ప్రగతినే సాధిస్తోంది. ఈ ఏడాది జులై నాటికి దేశవ్యాప్తంగా 52,718 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లున్నాయి. అందులో 16,561 స్టేషన్లలో ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయమూ ఉంది. అక్టోబరు 2025 నాటి 25,000 ఛార్జింగ్ స్టేషన్లతో పోలిస్తే ఇవి ఎక్కువే. అయితే ఈ ఫిక్స్‌డ్ ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్యను పెంచుకుంటూ పోతే సమస్య పూర్తిగా తీరదు. హైవేల్లో ఛార్జింగ్ స్టేషన్లకు నిరంతర విద్యుత్ సరఫరా, సరిపోయే కనెక్టర్లు, సమర్థవంతమైన ఛార్జింగ్ సామర్థ్యం ఉండాలి. ఒకవేళ విద్యుత్ కారు నిలిచిపోయిన ప్రాంతానికి దగ్గరలో ఛార్జింగ్ స్టేషన్ లేకపోతే, పరిస్థితి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇక్కడే మొబైల్ ఈవీ ఛార్జింగ్ ఆలోచన, అవకాశం మొదలైంది. ఈవీ యజమాని నుంచి సమాచారం అందిన వెంటనే దగ్గర్లోని మొబైల్ ఛార్జింగ్ వాహనం అక్కడకు వెళ్లి కావాల్సినంత ఛార్జింగ్ ఇస్తుంది. ఎంత శాతం అనే దాని బట్టి ఛార్జీ వసూలు చేస్తారు. దగ్గర్లో ఛార్జింగ్ స్టేషన్‌కు వెళ్లడానికి సరిపోయేంత ఛార్జింగ్ పెట్టుకోవడమూ మన ఇష్టమే. కారును టోయింగ్ చేసుకుని వెళ్లడానికి బదులు ఇలా ఒక మొబైల్ యూనిట్ ద్వారా తాత్కాలికంగా ఛార్జింగ్ పొందొచ్చన్నమాట. వీటిని ఎమర్జెన్సీ రోడ్‌సైడ్ సర్వీస్ వ్యవస్థలుగా నిర్వహిస్తున్నారు. సాధారణ కార్లు బ్రేక్ డౌన్ అయితే ఎలాగైతే సహాయం లభిస్తుందో ఇదీ అంతే. పెట్రోలు పంపులు, హైవే సర్వీస్ సెంటర్లను మొబైల్ ఛార్జర్లు తమ స్థావరంగా వాడుకుంటాయి. రాబోయే కాలంలో పెట్రోలు బంకులే మల్టీ ఎనర్జీ మొబిలిటీ సెంటర్లుగా మారే అవకాశమూ లేకపోలేదు. అంటే సంప్రదాయ పెట్రోలు, డీజిల్‌తో పాటు ఈవీ ఫాస్ట్ ఛార్జింగ్, మొబైల్ ఛార్జింగ్ సహాయాన్నీ ఇవి అందించవచ్చు. మొబైల్ ఛార్జింగ్ యూనిట్లను నిర్వహించడానికి ఇథనాల్ ఆధారిత జనరేటర్లను వినియోగించుకోవచ్చు. ఇవి ఇథనాల్ నుంచి విద్యుదుత్పత్తిని చేసి డీసీ ఫాస్ట్ ఛార్జర్ ద్వారా ఈవీకి సరఫరా చేస్తాయి. దీని వల్ల గ్రిడ్ అనుసంధానం లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ వనరుగా ఉపయోగపడగలదు. మొబైల్ ఛార్జింగ్ ఆపరేటర్లు తమ వాహనం, ఛార్జింగ్ సామగ్రి, విద్యుత్, నిర్వహణ, మానవ వనరులు, ప్రయాణం వంటి వాటికి వ్యయాలను భరించాల్సి ఉంటుంది. అందువల్ల ఈ అత్యవసర సేవలకు ఎక్కువ ధరే చెల్లించాల్సి రావొచ్చు.

## బీఎఫ్ఎస్ఐ రంగం కోసం బ్లూ మెషీన్స్ ఏఐ మోడల్ ‘అరోరా’

దిల్లీ: బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగం కోసం ప్రత్యేకంగా రూపొందించిన బహుభాషా స్పీచ్-టూ-టెక్స్ట్ మోడల్ ‘అరోరా’ను అంకుర సంస్థ బ్లూ మెషీన్స్ ఏఐ సోమవారం విడుదల చేసింది. ఈ ఏడాది ప్రారంభంలో టెలివిజన్ వేదికగా అన్‌స్క్రిప్టెడ్‌గా గంటపాటు జరిగిన ప్రత్యక్ష ‘ఏఐ వర్సెస్ హ్యూమన్’ డిబేట్‌తో ఈ స్టార్టప్ విస్తృత గుర్తింపు పొందింది.



మన దేశంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సంభాషణలు ప్రత్యేకంగా ఉంటాయి. ఇక్కడ కస్టమర్లు మాట్లాడేటప్పుడు తరచూ ఒక భాష నుంచి మరో భాషలోకి మారడం, ప్రాంతీయ భాషలతో ఆంగ్ల ఆర్థిక పదాలను కలపడం, తక్కువ బ్యాండ్‌విడ్త్ లేదా నేపథ్య శబ్దాలు ఎక్కువగా ఉండే టెలిఫోన్ కనెక్షన్‌ల్లో మాట్లాడటం సాధారణమని బ్లూమెషీన్స్ తెలిపింది. అరోరా కేవలం సాధారణ ట్రాన్స్‌క్రిప్షన్‌కు మాత్రమే పరిమితం కాకుండా, ఆర్థిక ప్రక్రియలను నడిపించే సంఖ్యలు, లావాదేవీల వివరాలు, సంస్థల పేర్లను అత్యంత కచ్చితత్వంతో గుర్తించేలా లో-లేటెన్సీ, హై-లేటెన్సీ, హై-కంకరెన్సీ వాతావరణంలో పనిచేస్తుందని కంపెనీ సీటీఓ అభిషేక్ రంజన్ పేర్కొన్నారు. దేశీయ ఆర్థిక సంస్థలు తమ కస్టమర్లతో సహజంగా సంభాషించేందుకు అనువైన సాంకేతికతను అందించడంతో పాటు డేటా, మోడల్స్, కస్టమర్ డేటా భద్రతపై ఆయా సంస్థలకు పూర్తి నియంత్రణ కల్పించడమే అరోరా ముఖ్య ఉద్దేశమని బ్లూ మెషీన్స్ ఏఐ వ్యవస్థాపకుడు, సీఈఓ నిర్మిత్ పారిఖ్ స్పష్టం చేశారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,64,273 | ₹ 1,79,212 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,55,000

# బంగారానికి మళ్లీ రెక్కలు..
### రూ.1.60లక్షలకు చేరువలో పసిడి • ధర అదే బాటలో వెండికూడా..



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ అనిశ్చితులు, డాలర్ విలువ తగ్గడం, చమురు మంటలతో ఈ లోహాలకు డిమాండ్ ఏర్పడింది. దీనికి తోడు దేశీయంగా పెళ్లిళ్ల సీజన్ వేళ గిరాకీ పెరగడంతో వీటి ధరలు పెరిగాయి. హైదరాబాద్ విపణిలో ఉదయం 10 గంటల ప్రాంతంలో 24 క్యారెట్ల మేలిమి పసిడి 10 గ్రాముల ధర రూ.1,58,900 పలికింది. క్రితం ముగింపుతో పోలిస్తే పుత్తడి దాదాపు రూ.4 వేల మేర పెరగడం గమనార్హం. ఇక, కేజీ వెండి ధర రూ.2,43,200 పలికింది. ఒక్క రోజే దీని ధర రూ.6వేల పైనే పెరిగింది.అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4435.20 డాలర్లకు చేరింది. ఔన్సు వెండి ధర 67 డాలర్లు పలికింది. కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లోనూ ఈ లోహాల ధరలు పెరిగాయి. గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాముల ధర రూ.1.53లక్షలు, సిల్వర్ ఫ్యూచర్స్ కేజీ ధర రూ.2.41లక్షలుగా కొనసాగుతోంది.
తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌లో.. ఈ ఫీచర్లు ఉండవా?
అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలతో చమురు ధరలు వరుసగా మూడోరోజు పెరిగాయి. ఆసియా మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 97 డాలర్లు పలికింది. అటు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు వెల్లడికానున్న వేళ డాలర్ విలువ తగ్గింది. యూఎస్ డాలర్ సూచీ రెండు వారాల కనిష్ఠానికి పడిపోయింది. ఈ పరిణామాల వేళ బంగారంలో పెట్టుబడులు శ్రేయస్కరమని మదుపర్లు భావించడంతో ఈ లోహాలకు డిమాండ్ ఏర్పడింది. ఇదిలా ఉండగా.. ఈ వారంలో అమెరికా ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్, కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ గణాంకాలు వెల్లడి కానున్నాయి. ఫెడ్ వడ్డీరేట్లను నిర్ణయించడంలో ఇవి కీలకం కావడంతో మదుపర్లు వీటిపై దృష్టిసారించారు. దీంతో రాబోయే రోజుల్లో బంగారం, వెండి ధరలు మరింత ఊగిసలాటకు గురయ్యే అవకాశం ఉన్నట్లు బులియన్ వర్గాలు పేర్కొంటున్నాయి.

## మొజ్తబాకు విదేశాల్లో ఆస్తులున్నాయా?
### ఇరాన్ ఏమందంటే..!

**(జనంసాక్షి):**ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీకి విదేశాల్లో ఆసు_లు ఉన్నట్లుగా పలు అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కథనాలపై ఆ దేశం స్పందించింది. తమ సుప్రీం లీడర్‌పై వస్తున్న ఈ వార్తలను తోసిపుచ్చింది. ఈ మేరకు స్పందించిన భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం అవన్నీ తప్పుడు వార్తలేనని, ఆ ప్రచారాలకు ఎటువంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది.‘మా మాజీ సుప్రీం అయతుల్లా ఖమేనీ మాదిరిగానే ప్రస్తుత సుప్రీం మొజ్తబాకి కూడా ఇరాన్ వెలుపల గానీ, విదేశాల్లో గానీ ఎటువంటి ఆస్తులు లేవు. ఆయన నిరాడంబరమైన జీవితం గురించి ఇరాన్ ప్రజలకు బాగా తెలుసు. మొజ్తబాపై ఉన్న ప్రేమ, గౌరవంతోనే దేశ ప్రజలు ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. ఆయనపై తప్పుడు ప్రచారం చేయాలనే ఉద్దేశంతో కావాలనే కొందరు ఇలాంటి కథలు అల్లుతున్నారు. వీటిలో ఎంతమాత్రమూ నిజం లేదు’ అని ఇరాన్ రాయబార కార్యాలయం పేర్కొంది.లండన్‌లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయానికి ఎదురుగా మొజ్తబా ఖమేనీకి రెండు లగ్జరీ ఫ్లాట్లు ఉన్నాయంటూ ఇటీవల పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు రాశాయి. 2014, 2016లో వివిధ మధ్యవర్తుల ద్వారా వాటిని కొనుగోలు చేసినట్లుగా పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ ఆస్తులను ఆయన విక్రయానికి పెట్టినట్లుగా వచ్చిన వార్తా కథనాలను భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం కొట్టిపారేసింది.

## ఎయిరిండియాను మళ్లీ గొప్పగా తీర్చిదిద్దుతాం
### భావి సీఈఓ టెవోల్డే గెబ్రెమరియం




దిల్లీ: ఎయిరిండియా ఒక కీలక కొత్త దశలోకి ప్రవేశిస్తున్నందున ప్రయాణికుల విశ్వాసాన్ని తిరిగి పెంపొందించుకోవాలని, ఆర్థిక స్థితిని బలోపేతం చేసుకోవాలని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. ఎయిరిండియాకు ఛైర్మన్‌గా కూడా ఉన్న చంద్రశేఖరన్.. ఆ సంస్థ ఉద్యోగులతో టౌన్ హాల్‌లో జరిగిన సమావేశంలో పై వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో ఎయిరిండియాకు కొత్త ఎండీ, సీఈఓగా బాధ్యతలు స్వీకరించనున్న టెవోల్డే గెబ్రెమరియంను ఆయన పరిచయం చేశారు. టెవోల్డే మాట్లాడుతూ ఎయిరిండియాకు పూర్వ వైభవాన్ని తీసుకొని రావడానికి అందరం కలిసి కృషి చేయాలని ఉద్యోగులను కోరారు. ‘మేం ఎయిరిండియాను మళ్లీ గొప్పగా తీర్చిదిద్దుతాం’ అని ఆయన ప్రకటించారు. గతేడాది జరిగిన ఘోర ప్రమాదం తర్వాత పెరుగుతున్న నష్టాలు, కార్యకలాపాల అంతరాయం, నియంత్రణ సంస్థల పరిశీలన పెరగడంతో సతమతమవుతున్న ఎయిరిండియాకు ఈ నాయకత్వ మార్పు ఒక కీలక సమయంలో చోటుచేసుకోనుంది.ఇది నాకు మంచి అవకాశం..: విమానయాన రంగంలో నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న గెబ్రెమరియం, అందులో 11 ఏళ్లకు పైగా ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్‌లో పనిచేశారు. ఎయిరిండియాకు గొప్ప చరిత్ర, బలమైన బ్రాండు, అపార సామర్థ్యం ఉందని ఉద్యోగులను ఉద్దేశించి చేసిన తన తొలి ప్రసంగంలో తెలిపారు. సుమారు 20 ఏళ్ల కిందట ముంబయిలో పనిచేస్తున్నప్పుడు ఎయిరిండియాతో తనకున్న అనుభవాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో విమానయాన రంగంలో ఎయిరిండియా అగ్రస్థానంలో ఉందని అన్నారు. ఆ సంస్థను తిరిగి ఆ స్థానానికి తీసుకొని రావడానికి తోడ్పడే అవకాశం ఇప్పుడు తనకు లభించిందని చెప్పారు. భద్రత అనేది విమానయాన సంస్థకు అత్యంత ప్రాధాన్యాంశంగా ఉండాలని, తమ ఆందోళనలను వ్యక్తం చేసేందుకు ఉద్యోగులకు అవకాశం కల్పించాలని ఆయన అన్నారు.

## యువత కోసం ‘డేర్ టు గో గ్లామ్’..
### సరికొత్తగా మారుతీ బాలెనో

బెంగళూరు: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా తన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ అయినా బాలెనోలో సరికొత్త వెర్షన్‌ను పరిచయం చేసింది. యువత కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చిన ఈ కారును పండుగ ప్రత్యేక ఆఫర్ కింద రూ.6.09 లక్షల ప్రారంభ ధర (ఎక్స్‌షోరూమ్, బెంగళూరు)తో విడుదల చేసింది. రూ.11వేలతో దీన్ని బుక్ చేసుకోవచ్చని కంపెనీ వెల్లడించింది.కొత్త బాలెనోలో లెవెల్ 2 అడాస్ (అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్) భద్రతా ఫీచర్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, ఐడిల్ స్టార్ట్-స్టాప్ సాంకేతికత వంటివి ఉన్నాయి.ఇందులో అడ్వాన్స్‌డ్ జెడ్12ఇ పవర్‌ట్రెయిన్ ఇంజిన్ అమర్చారు. ఇది 61 కిలోవాట్ల పవర్‌ను, 112.4 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఏడు రంగుల్లో దీన్ని తీసుకొచ్చారు.క్యాబిన్ లోపల 22.86 సెంటీమీటర్ల స్మార్ట్‌ప్లే ప్రొ+ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇది హై-డెఫినిషన్ డిస్‌ప్లే. సులభమైన ఇంటర్‌ఫేస్‌తో వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటో వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి.ఇందులో సుజుకీ కనెక్ట్ టెలిమాటిక్స్ సిస్టమ్ ఉంది. వాహన భద్రత, ప్రయాణాలు, డ్రైవింగ్ విధానం, స్టేటస్ అలర్ట్స్‌తో పాటు సుజుకి కనెక్ట్ యాప్ ద్వారా రిమోట్ ఆపరేషన్ల వంటి 40కి పైగా ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి.ఈ సందర్భంగా మారుతీ సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ మాట్లాడుతూ.. “వినియోగదార్లలో ఎస్‌యూవీలపై ఆసక్తి కొనసాగుతున్నప్పటికీ, భారతీయ ప్రయాణికుల వాహన (పీవీ) విపణిలో ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ విభాగం వృద్ధి చెందుతోంది. ఈ కొత్త బాలెనో వెర్షన్‌ను ‘డేర్ టు గో గ్లామ్’ సిద్ధాంతంతో తీసుకొచ్చాం. పరిస్థితులను సవాల్ చేస్తూ తమ వ్యక్తిత్వాన్ని ధైర్యంగా చాటుకునే యువ కస్టమర్లను దృష్టిలో ఉంచుకుని దీన్ని సరికొత్తగా డిజైన్ చేశాం” అని వెల్లడించారు.

## థాయ్ పట్టాయాలో అమెరికా సైనికులు సాక్స్‌లు కొన్నారట..!


పశ్చిమాసియా జలాల నుంచి థాయ్‌లాండ్‌కు వచ్చిన అమెరికా విమాన వాహకనౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్.. అమెరికా దిశగా ప్రయాణం ప్రారంభించింది. ఇరాన్‌తో యుద్ధం కారణంగా 250 రోజులకుపైగా సముద్ర జలాల్లో విధులు నిర్వర్తించిన సైనికులు వస్తున్నప్పుడు థాయ్ నగరం పట్టాయాలో హడావుడి కనిపించింది. వారి రాకతో వ్యభిచార కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంటుందని అనుమానించిన స్థానిక పోలీసులు సెక్స్‌వర్కర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిన సంగతి తెలిసిందే. అయితే సైనికుల నాలుగురోజుల పర్యటన అందుకు భిన్నంగా సాగిందని మీడియా కథనాలు పేర్కొన్నాయి. సెప్టెంబర్ 2న యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, రెండు యుద్ధ నౌకలకు చెందిన నావికులు, పైలట్లు, మెరైనర్లు థాయ్‌లోని పట్టాయా నగరానికి చేరుకున్నారు.



## ఇంటి భోజనం ఖర్చులు పెరిగాయ్
### క్రిసిల్ నివేదిక

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశంలో ఇంటి భోజనం ఖర్చులు పెరిగినట్లు క్రిసిల్ సంస్థ విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. ఇంటెలిజెన్స్ ‘రోటీ రైస్ రేట్’ పేరిట విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం.. శాకాహార, మాంసాహార ఇంటి భోజనం ధరలు గతేడాదితో పోలిస్తే కాస్త పెరిగాయి. గతేడాదితో పోలిస్తే ఆగస్టులో శాకాహార భోజనం ధర ఒక శాతం పెరిగి రూ.29.50గా ఉండగా.. మాంసాహార థాలీ ధర ఏడాది వ్యవధిలోనే 5 శాతం పెరిగి రూ.57.50కి చేరింది. అయితే, ఇది జులైలోని రూ.58.30తో పోలిస్తే ఒక శాతం తగ్గింది. నాన్‌వెజ్ భోజనం ధరలు పెరగడానికి కోళ్ల ధర 10 శాతం ఎగబాకడమే ప్రధాన కారణమని నివేదిక పేర్కొంది. ఉల్లిపాయలు, వంటనూనె, బియ్యం, ఎల్పీజీ ధరలు పెరగడంతో థాలీ ఖర్చు పెరిగిందని విశ్లేషించింది. మరోవైపు, మార్కెట్లో సరఫరా తగ్గడం వల్ల ఉల్లిపాయల ధరలు గతేడాదితో పోలిస్తే ఏకంగా 43 శాతం పెరిగి కేజీ రూ.40కి చేరాయి. వంట నూనె ధర 11 శాతం, ఎల్పీజీ 10 శాతం మేర పెరిగాయి. బంగాళాదుంప ధర 12 శాతం, టమాటా 28 శాతం తగ్గడంతో భారం కొంత తగ్గిందని సదరు నివేదిక పేర్కొంది. రానున్న రెండు, మూడు నెలల్లో ఉల్లిపాయల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ పుషన్ శర్మ తెలిపారు.

## టాటా బోయింగ్ ఏరోస్పేస్ మరో ఘనత
### 400వ ‘భారత్‌లో తయారీ’ అపాచీ ఫ్యూజ్‌లేజ్ డెలివరీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అంతర్జాతీయ రక్షణ రంగంలో టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (టీబీఏఎల్) మరో ఘనత సాధించింది. హైదరాబాద్‌లోని తమ అత్యాధునిక తయారీ కేంద్రం నుంచి ఏహెచ్-64ఈ అపాచీ అటాక్ హెలికాప్టర్ కోసం 400వ ఫ్యూజ్‌లేజ్‌ను విజయవంతంగా ఉత్పత్తి చేసినట్లు కంపెనీ వెల్లడించింది. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, బోయింగ్ సంయుక్తంగా టీబీఏఎల్‌ను ఏర్పాటు చేశాయి. హైదరాబాద్‌లో 52,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ అత్యాధునిక ప్లాంట్‌లో 750 మందికి పైగా ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. అధునాతన రోబోటిక్స్, ఆటోమేషన్ సాంకేతికతలతో ఇక్కడ అపాచీ ఫ్యూజ్‌లేజ్ ఏరోస్ట్రక్చర్‌లను తయారు చేస్తున్నారు.ప్రపంచ స్థాయిలో గుర్తింపు: ఇక్కడ తయారైన ఫ్యూజ్‌లేజ్‌లను అంతర్జాతీయంగా సరఫరా చేస్తున్నారు. అమెరికా ఆర్మీ హెలికాప్టర్లతో పాటు, 2025లో భారత సైన్యానికి అందిన 6 అపాచీ హెలికాప్టర్లలోనూ హైదరాబాద్‌లో తయారైన ఫ్యూజ్‌లేజ్‌లనే అమర్చారు. కాగా, భారత వైమానిక దళం ఇప్పటికే 22 ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్లను విజయవంతంగా నడుపుతోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 19 దేశాలు దాదాపు 1,300 అపాచీ హెలికాప్టర్లను వినియోగిస్తున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
9 సెప్టెంబర్ 2026



# రెవెన్యూ శాఖ నిర్లక్ష్యమేనా?

## గడ్డపోతారంలో ప్రభుత్వ భూములపై మళ్లీ గుబులు!

- సర్వే నంబర్లు 68, 69, 70, చెట్ల పోతారం 79లో ఆక్రమణల ఆరోపణలు
- ఫిర్యాదు చేసి ఆరు నెలలు.. అయినా కదలని అధికార యంత్రాంగం!
- హద్దులు నిర్ణయించి ప్రభుత్వ భూములను కాపాడాలంటున్న గ్రామస్థులు

**జిన్నారం, సెప్టెంబర్ 8 (జనం సాక్షి):** ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ శాఖే నిద్రావస్థలో ఉందా? ఆక్రమణలపై ఫిర్యాదులు అందుతున్నా ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు గడ్డపోతారం గ్రామంలో తీవ్రంగా వినిపిస్తున్నాయి. జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామ శివారులోని సర్వే నంబర్లు 68, 69, 70 చెట్ల పోతారం 79 పరిధిలో ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయంటూ స్థానికులు మరోసారి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై గతంలోనే ఫిర్యాదులు చేసినప్పటికీ ఆరు నెలలు గడిచినా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. తాజాగా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో పాటు జిన్నారం తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు.

### కళ్ల ముందే ఆక్రమణలు జరుగుతున్నాయా?

ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా నమోదైన స్థలాలను కొందరు వ్యక్తులు తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. భూముల హద్దులను మార్చడం, ఆక్రమణలకు ప్రయత్నించడం వంటి చర్యలు జరుగుతున్నా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేయడం లేదని వారు పేర్కొన్నారు.

### అధికారులు కదలకపోవడానికి కారణమేంటి?

ప్రభుత్వ భూములపై నిజంగా ఆక్రమణలు ఉంటే వాటిని గుర్తించడంలో జాప్యం ఎందుకు? రికార్డులు, ఎఫ్ఎంబీ, గ్రామ మ్యాప్ ఉన్నప్పటికీ హద్దులు ఎందుకు నిర్ధారించడం లేదు? అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

### సర్వే చేస్తే అసలు విషయం తేలిపోతుంది

సర్వే నంబర్ల వారీగా ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి, ఎఫ్ఎంబీ, గ్రామ మ్యాప్, పహాణి తదితర అధికారిక రికార్డులతో సరిపోల్చాలని ఫిర్యాదుదారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములకు శాశ్వత హద్దులు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు.

### ఆక్రమణలు ఉంటే ఎవరి అండ

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు లేదా ఆక్రమణలు ఉన్నట్లు అధికారిక విచారణలో తేలితే వాటిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. అయితే, ఇంతకాలం అధికారులు ఎందుకు స్పందించలేదన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉందని వారు అంటున్నారు.

### ఇప్పుడు బంతి రెవెన్యూ కోర్టులోనే..

తాజా ఫిర్యాదుతో గడ్డపోతారం ప్రభుత్వ భూముల వ్యవహారం మరోసారి అధికారుల ముందుకు వచ్చింది. ఈసారి అయినా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి వాస్తవాలను బయటపెడతారా? లేక మరోసారి ఫిర్యాదు ఫైళ్లకే పరిమితం అవుతుందా? అన్నదే ప్రశ్న. ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం జరిగితే భవిష్యత్తులో ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూముల హద్దులను నిర్ధారించి, ఆక్రమణలు ఉన్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### అసైన్డ్ భూమి వ్యవహారం కూడా గతంలోనే..

గడ్డపోతారంలో భూముల వివాదాలు కొత్తేమీ కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో అసైన్డ్ భూమిని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయాలని తహసీల్దార్ ఆదేశాలు జారీ చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. తాజాగా ప్రభుత్వ భూములపై మరోసారి ఫిర్యాదు లు రావడంతో గత వ్యవహారాలు కూడా చర్చకు వస్తున్నాయి.


### చట్టపరమైన చర్యలు తీసుకుంటాం :



జిన్నారం తహసిల్దార్ ఆంటోనీ

సంబంధిత భూములను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లయితే చట్టపరమైన తీసుకుంటాం.. ఆయా సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే చర్యలు తప్పవు.


### శాఖపరమైన చర్యలు తప్పవు :



గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ తాన్యశ్రీ

గతంలో గ్రామపంచాయతీ గా ఉన్నప్పుడు నిర్మాణాలు చేయకుండా తీసుకున్న డోర్ నెంబర్లను పరిశీలన చేసి వాటిపైన శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. చెట్ల పోతారం 79 సర్వే నెంబర్ షెడ్లకు నిర్మాణాలకు సంబంధించిన భూ వివరాల కోసం జిన్నారం తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయిస్తాం.

# ప్రశ్నిస్తే దౌర్జన్యం.. పోరాడితే గృహనిర్బంధం



**బోడుప్పల్, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** అసెంబ్లీలో ప్రజా సమస్యలను లేవనెత్తుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసు బలాన్ని ప్రయోగించడం, బయట ప్రజా సమస్యలపై పోరాడేందుకు సిద్ధమవుతున్న నాయకులను ముందస్తుగా గృహనిర్బంధం చేయడం ఇదేనా ప్రజాపాలన అని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రతిపక్షాల ప్రశ్నించే గొంతుకలను అణచివేయడమే ప్రభుత్వ లక్ష్యంగా మారిందని విమర్శించారు. ప్రజలచే ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే పోలీసులను ప్రయోగించడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని ఆరోపించారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా ఖండించాల్సిన విషయమని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులను గృహనిర్బంధం చేసినంత మాత్రాన ప్రజా సమస్యలపై పోరాటం ఆగదని స్పష్టం చేశారు. పోలీసు బలంతో ప్రజా ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదన్నారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన ఆయన, ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రతిపక్షాలపై అణచివేతకు దిగడం సరికాదన్నారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజలే అంతిమ నిర్ణేతలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఏడవల్లి రఘువర్ధన్‌రెడ్డి, దొంతిరి హరిశంకర్‌రెడ్డి, కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి రఘుపతిరెడ్డి, నిర్మల, ప్రభు, జావీద్‌ఖాన్, ఆకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం

**రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా వ్యవహరించాలి : టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్..**

**కడ్తాల్, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ఒక వ్యక్తిని అవమానించడమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థ, శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసే చర్యగా ఆయన పేర్కొన్నారు. రాజకీయ పార్టీల మధ్య అభిప్రాయ భేదాలు సహజమేనని, ప్రభుత్వ విధానాలను విమర్శించే హక్కు ప్రజాప్రతినిధులకు ఉందన్నారు. అయితే రాజకీయ విభేదాలను వ్యక్తిగత దూషణలకు తీసుకెళ్లడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిని గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వాన్ని రద్దు చేయాలని, శాసనమండలి చైర్మన్ నియమావళి ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాసనసభ గౌరవం, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి..

**శంకర్ పల్లి, సెప్టెంబర్ 9 (జనం సాక్షి)** రోడ్డుపై ఆగి ఉన్న కారును వెనకనుంచి మోటారు బైక్ ఢీ కొట్టిన సంఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు.మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి ఈ సంఘటన శంకరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం భారత్ డైనమిక్స్ ఫ్యాక్టరీకి సమీపంలో చోటుచేసుకుంది.శంకర్ పల్లి ఇన్స్పెక్టర్ రుద్విర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారంగా శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని చిన్న శంకర్ పల్లి గ్రామానికి చెందిన బర్మల నిశాంత్ (19) అతని స్నేహితుడు గణేష్ నగర్ కు చెందిన కంటేస్ తో కలిసి బైకుపై బీడీఎల్ మీదుగా పటాన్ చెరువు వెళ్తున్నారు. బీడీఎల్ ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న కారును బైక్ ఢీ కొట్టింది. బర్మల నిశాంత్ కు తీవ్ర గాయాలు కావడంతో సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. బైక్ పై వెనుక కూర్చు న్న కంటేష్కు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

# తెలంగాణ విద్యుత్ అవసరాలకు సింగరేణి భరోసా

- ఆగస్టులో విద్యుత్ రంగానికి 40.51 లక్షల టన్నుల బొగ్గు
- తెలంగాణకే 36.26 లక్షల టన్నుల సరఫరా
- ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ ఉన్నా స్వరాష్ట్రానికే ప్రాధాన్యం
- నైనీ బొగ్గును కూడా తెలంగాణ అవసరాలకు తరలింపు

**గోదావరిఖని, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ విద్యుత్ అవసరాలకు సింగరేణి భరోసాగా నిలుస్తోంది. ఇతర రాష్ట్రాల విద్యుత్ సంస్థల నుంచి సింగరేణి బొగ్గుకు డిమాండ్ ఉన్నప్పటికీ స్వరాష్ట్ర అవసరాలకే సంస్థ తొలి ప్రాధాన్యం ఇస్తోంది. ఆగస్టులో దేశంలోని విద్యుత్ సంస్థలకు మొత్తం 40,51,312 టన్నుల బొగ్గును సరఫరా చేయగా, అందులో 36,25,937 టన్నులు తెలంగాణలోని విద్యుత్ కేంద్రాలకే రవాణా చేసింది. అంటే మొత్తం సరఫరాలో దాదాపు 90 శాతం తెలంగాణకే అందించింది. రోజుకు సగటున 1,30,687 టన్నుల బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయగా, తెలంగాణ ప్లాంట్లకు 1,16,966 టన్నులు అందించింది. తెలంగాణ జెన్‌కోకు 382 రైల్వే రేకుల ద్వారా 20,16,356 టన్నుల బొగ్గు సరఫరా



కాగా, ఇది రాష్ట్ర విద్యుత్ కేంద్రాలకు అందించిన బొగ్గులో సుమారు 50 శాతం. కొత్తగూడెం, యాదాద్రి, కాకతీయ, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాలతో పాటు రామగుండం ఎన్టీపీసీ, ఎన్టీపీసీ తెలంగాణ, జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్లకు కూడా బొగ్గు సరఫరా చేసింది. మరోవైపు పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాల విద్యుత్ సంస్థలు సింగరేణి నుంచి భారీగా బొగ్గు కోరుతున్నాయి.

అయినప్పటికీ రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇతర రాష్ట్రాల సరఫరాను తగ్గించి తెలంగాణకు ప్రాధాన్యం ఇస్తోంది. ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి ఉత్పత్తి అవుతున్న బొగ్గును కూడా సింగరేణి రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తరలిస్తోంది. బొగ్గు ఉత్పత్తి, రవాణాను పెంచేందుకు సింగరేణి యాజమాన్యం చర్యలు చేపట్టడంతో పాటు సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఐదుగురు ప్రత్యేక అధికారులను పర్యవేక్షణకు నియమించారు. తగినన్ని రైల్వే రేకులను సమకూర్చుకుని నాణ్యమైన బొగ్గును సకాలంలో విద్యుత్ కేంద్రాలకు చేరేలా చర్యలు చేపడుతున్నారు.

# రాజీవ్ యువ వికాస్ నిధులు వెంటనే విడుదల చేయాలి

- ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన



**హైదరాబాద్, సెప్టెంబర్ 08 (జనం సాక్షి):** రాజీవ్ యువ వికాస్ పథకానికి కేటాయించిన రూ.6 వేల కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మాదిగ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. నిధుల విడుదలలో జాప్యం చేయకుండా అర్హులైన నిరుద్యోగ యువతకు పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరారు ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్దగల ధర్నాచౌక్‌లో సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాజీవ్ యువ వికాస్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హాజరై ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ఉద్దేశించిన పథకానికి నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయరాదన్నారు. నిధులు అందుబాటులోకి వస్తే అర్హులైన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ.6 వేల కోట్ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నాలో ఎక్స్ కోఆపరేషన్ చైర్మన్, టీఆర్ఎస్ నాయకుడు దూదిమెట్ల బాలరాజు, మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డం యాదయ్య, కొంపల్లి నరేష్ మాదిగ, చుక్క శీను, కడియం రాంబాబు, చింతల రాములు, మహిళా అధ్యక్షురాలు కడతాల విజయలక్ష్మి, గొర్ల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# రూ.18 వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

**ఆశా వర్కర్ల అరెస్టులు.. ఇందిరాపార్క్ వద్ద స్వల్ప ఉద్రిక్తత**



**ముషీరాబాద్, సెప్టెంబర్ 9 (జనం సాక్షి):** ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ చౌరస్తాలో ఆశా వర్కర్లు చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారితీసింది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేస్తూ పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగి పలువురు ఆశా వర్కర్లను అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. నిరసన నేపథ్యంలో ఇందిరాపార్క్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకునే క్రమంలో కొంతసేపు అక్కడ స్వల్పపాటి ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ.. తమకు నెలకు రూ.18,000 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, విధుల్లో భాగంగా చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు. వేతనాలు, బకాయిల చెల్లింపుతో పాటు ఉద్యోగ భద్రత, పని భారం తగ్గింపు తదితర సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆశా వర్కర్లు హెచ్చరించారు.

# సిరిసిల్లలో బీఆర్ఎస్ నిరసన జ్వాల

- సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోల దహనయత్నం
- రెండు గంటలపాటు ఉద్రిక్తత



**సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా సిరిసిల్లలో మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపిస్తూ అంబేద్కర్ చౌక్‌లో నల్లజెండాలు, ఫ్లెక్సీలతో నిరసన తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్ శ్రేణులకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే అవకాశం ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ఇవ్వకుండా పోలీసులతో అడ్డుకున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవహరించారని విమర్శిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. సుమారు రెండు గంటలపాటు అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన కొనసాగింది. అనంతరం ఎన్నికల హామీల అమలుతో పాటు ప్రజా హక్కులను కాపాడాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.



# ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్'కు టీజీఈజేఏసీ పిలుపు**

**హయత్‌నగర్, సెప్టెంబర్ 8 (జనం సాక్షి) :** ఉద్యోగులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్రస్థాయి సమావేశం డిమాండ్ చేసింది. వనస్థలిపురంలోని సీనియర్ సిటిజన్ కమిటీ హాల్‌లో ఎం. మోహన్ నారాయణ, ఎస్. నరసరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే ప్రకటించడంతో పాటు ఐదు డీఏలను విడుదల చేయాలని సమావేశం కోరింది. జీతాల నుంచి 1.5 శాతం మినహాయిస్తున్నప్పటికీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందకపోవడం, ఆసుపత్రుల్లో సరైన వైద్య సేవలు అందకపోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, పెన్షన్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా టీజీఈ జేఏసీ పిలుపు మేరకు సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 'చలో హైదరాబాద్' గోడపత్రికను విడుదల చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జె. రవీందర్, యాదయ్య గౌడ్, విశ్వనాథ్, కూర్మారావు, అప్పారావు, కృష్ణమూర్తి, బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, బసవయ్య, సాంబశివ రావు, సుధాకర్, పీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- ఉత్సవ కమిటీలతో కమిషనర్ సమన్వయ సమావేశం
- భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యం
- చెరువుల వద్ద పారిశుద్ధ్య, మౌలిక సదుపాయాలు
- పర్యావరణహిత నిమజ్జనంపై ప్రత్యేక దృష్టి


**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** గణేష్ నిమజ్జనాన్ని సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంఎంసీ ప్రధాన కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో నిమజ్జన ఏర్పాట్లను సమీక్షించారు. నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు భద్రత, ట్రాఫిక్, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చెరువులు, కుంటల వద్ద క్లీనింగ్, డీసిల్టింగ్ పనులను వేగవంతం చేసి, అవసరమైన చోట నీటిని నింపాలని, రహదారులు, లైటింగ్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పూజా పూలు, సేంద్రియ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి సహజ ఎరువుల తయారీకి



వినియోగించాలని, నిమజ్జనం అనంతరం వ్యర్థాలను వెంటనే తొలగించాలని సూచించారు. ఉత్సవ కమిటీలు ప్రస్తావించిన సమస్యలను తక్షణమే పరిష్కరించి, చివరి నిమిషం వరకు పనులను పెండింగ్‌లో ఉంచవద్దని స్పష్టం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్, చీఫ్ ఇంజినీర్ బి.ఎల్. శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి

- సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి
- పెండింగ్ బకాయిలు, పీఆర్సీ సమస్యలు పరిష్కరించాలి
- ఎంప్లాయిూస్ హెల్త్ స్కీమ్ లోపాలు సరిదిద్దాలి



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని టీఎన్జీవోల కమ్యూనిటీ భవన్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఎంప్లాయిూస్ హెల్త్ స్కీమ్ అమలులో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆశించిన పురోగతి కనిపించడం లేదని, ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కారం కాక అసంతృప్తి పెరుగుతోందని తెలిపారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, ప్రజలకు సంక్షేమ పథకాలను చేరవేస్తూ పాలనను ముందుకు నడిపేది ఉద్యోగులేనని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా, న్యాయబద్ధంగా తమకు రావాల్సిన హక్కులనే కోరుతున్నామని స్పష్టం చేశారు. 2004 సెప్టెంబర్ 1 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి అమలవుతున్న సీపీఎస్‌ను రద్దు చేసి, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ ఉద్యోగి హక్కు అని, ఉద్యోగుల భవిష్యత్తును మార్కెట్ హెచ్చుతగ్గులకు గురిచేయకుండా భద్రత కల్పించాలని కోరారు. ఎంప్లాయిూస్ హెల్త్ స్కీమ్‌లో లోపాలు సరిదిద్దడంతో పాటు పెండింగ్ బకాయిలు, పీఆర్సీ తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబర్ 10న నిర్వహించే 'చలో హైదరాబాద్'కు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ నాయకులు, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఉద్యోగాల పేరుతో రూ.44 లక్షల మోసం

- ప్రధాన నిందితుడి అరెస్ట్.. 21 మంది బాధితులు
- ప్రొఫెసర్‌గా నకిలీ గుర్తింపు.. ఉద్యోగాల పేరుతో వసూళ్లు
- నకిలీ నియామక పత్రాలు, ప్రశ్నపత్రాలు స్వాధీనం
- పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు



**కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** శాతవాహన విశ్వవిద్యాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులను మోసగించి సుమారు రూ.44 లక్షలు వసూలు చేసిన కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ విద్యానగర్‌కు చెందిన పురుషోత్తమ మమతకు డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన దుడపాక తిరుపతి అలియాస్ తిరుపతిరావు (51) రూ.1.50 లక్షలు తీసుకుని, ఆమె కుమార్తెకు రికార్డు అసిస్టెంట్‌గా నియామక ఉత్తర్వుల పేరుతో నకిలీ పత్రం అందజేశాడు. పత్రం నకిలీదని తేలడంతో బాధితురాలి బంధువులు నిలదీయగా, వారికి కూడా ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి మరో రూ.8.50 లక్షలు వసూలు చేశాడు. ఈ వ్యవహారంపై బాధితురాలు ఈ నెల 7న పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాలతో కరీంనగర్-2 టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. సుజన్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఆర్. ప్రకాష్ సిబ్బందితో కలిసి మంగళవారం శాతవాహన విశ్వవిద్యాలయం సమీపంలో తిరుపతిరావును అదుపులోకి తీసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇప్పపల్లికి చెందిన అతడు 2025 అక్టోబర్ నుంచి 2026 జనవరి వరకు విద్యానగర్‌లో అద్దెకు ఉంటూ తాను శాతవాహన విశ్వవిద్యాలయం బోటనీ ప్రొఫెసర్‌నని నమ్మించాడు. డేటా ఎంట్రీ ఆపరేటర్, టికెట్ బుకింగ్ క్లర్క్, జూనియర్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ సుమారు 21 మంది నుంచి రూ.44 లక్షలు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. నమ్మకం కలిగించేందుకు నకిలీ పరీక్షలు నిర్వహించి, ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, సర్వీస్ రిజిస్టర్లు, నియామక ఉత్తర్వులను తయారు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతడి వద్ద నుంచి నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మరో నలుగురు నిందితులు సహకరించినట్లు గుర్తించగా, వారు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. అరెస్టయిన నిందితుడిని కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఉద్యోగాల పేరుతో దళారులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని, నియామక ప్రకటనలను సంబంధిత సంస్థల అధికారిక నోటిఫికేషన్లు, వెబ్‌సైట్లలో మాత్రమే పరిశీలించాలని పోలీసులు సూచించారు.

# బూతులతో కాలయాపన సిగ్గుచేటు

- అసెంబ్లీ ఘటనలపై సీపీఐ(ఎం) ఆగ్రహం
- అధికార, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై చర్చించాలి
- ఘటనలపై సమగ్ర విచారణ జరపాలి
- బాధ్యులు బహిరంగ క్షమాపణ చెప్పాలి

**ముషీరాబాద్, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** ప్రజా సమస్యలపై చర్చించాల్సిన శాసనసభలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం వ్యక్తిగత దూషణలకు దిగుతూ విలువైన సమయాన్ని వృథా చేయడం సిగ్గుచేటని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ గేటు వద్ద నిరసన సందర్భంగా బీఆర్ఎస్ మాజీ మంత్రులు, మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు హేయంగా ఉందని పేర్కొన్నారు. వారిని నెట్టివేయడం, చీరలు లాగడం, మెడ పట్టి నెట్టడం, జుట్టు పట్టి లాగడం వంటి ఘటనలను ఖండించారు. అదే సమయంలో ఘటనను ఖండించే క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కూడా సంస్కారహీనంగా ఉన్నాయని విమర్శించారు.

ఈ ఘటనలకు బాధ్యులైన అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ప్రజలకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉద్యోగాలు, రేషన్, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి, కనీస వేతనాలు తదితర అనేక సమస్యలు ప్రజలను వేధిస్తున్నా వాటిపై శాసనసభలో అర్థవంతమైన చర్చ జరగడం లేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళల సమస్యల పరిష్కారానికి తగిన నిధులు కేటాయించాలని కోరారు. వ్యక్తిగత విమర్శలు, దూషణలకు స్వస్తి పలికి ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించాలని అధికార, ప్రతిపక్ష పార్టీలకు సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ప్రజలు ఇరు పార్టీలకు తగిన గుణపాఠం చెప్పే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

# తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై వ్యాఖ్యలను ఖండించిన మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్
- కేసీఆర్ దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలి
- రాజీనామా చేసే వరకు పోరాటం ఆగదు
- కాంగ్రెస్ నేతల ఆగ్రహం.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. కరీంనగర్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుడైన స్పీకర్‌పై అభ్యంతరకర పదజాలంతో దూషించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని, కేసీఆర్ దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజల తీర్పును జీర్ణించుకోలేక ప్రభుత్వంపై విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ముందు జరిగిన పరిణామాలు రాజకీయ డ్రామాగా మారాయని విమర్శించారు. దళితుల పట్ల బీఆర్ఎస్ వైఖరి ఇప్పటికీ మారలేదని అన్నారు. తాతా మధు రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ స్పీకర్‌పై అనుచితంగా వ్యవహరించిన తాతా మధుపై చర్యలు తీసుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్పొరేటర్ వరాల నరసింగం, మైనారిటీ సెల్ అధ్యక్షుడు అహ్మద్ అలీ, కాంగ్రెస్ నాయకులు జీడి రమేష్, చింతల కిషన్, మాదాసు శ్రీనివాస్, బొమ్మరాతి సాయికృష్ణ, కూడలి శ్రీధర్, తిరుపతి, ముద్దసాని క్రాంతి, పెంట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు

**ఈనెల 19 లోగా దరఖాస్తు చేసుకోవాలి :మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్**



**మంథని, సెప్టెంబర్ 08, (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం" ద్వారా అర్హులైన వెనుకబడిన తరగతులకు (బీసీ) చెందిన మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీతో అందించేందుకు చర్యలు చేపట్టిందని మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఐఏఎస్ సెప్టెంబర్ 2, 2026న ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఈ పథకం ద్వారా పేద, నిరుద్యోగ, అర్హత కలిగిన బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడంతో పాటు వారి ఆర్థిక స్వావలంబనను పెంపొందించడం, ఆదాయ అవకాశాలను విస్తరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళలు తేది : 15.09.2026 రోజుల లోపు వెబ్ దరఖాస్తు చేసుకొని మున్సిపల్ కార్యాలయం నందు దరఖాస్తులు అందజేయాలని కోరారు. దరఖాస్తుదారులు బీసీ వర్గానికి చెందినవారై, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక కుటుంబ ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదు. కుటుంబానికి ఒక్క కుట్టు మిషన్ యూనిట్ మాత్రమే మంజూరు చేస్తారు, తెల్ల రేషన్ కార్డు/ఆహార భద్రత కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రం, టైలరింగ్ నైపుణ్య ధ్రువీకరణ వంటి పత్రాలను పరిశీలించనున్నారు.




# తొలిసారిగా భారత్‌లో అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సదస్సు

**ఆతిథ్యం ఇవ్వనున్న హైదరాబాద్**

**అమీర్‌పేట్:** భారత్ తొలిసారిగా అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుంది. IREC 2026 ఏడో ఎడిషన్ సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు 35కు పైగా దేశాల నుంచి 1,500 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. రియల్ ఎస్టేట్ డెవలపర్లు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు, టెక్నాలజీ సంస్థల ప్రతినిధులు పాల్గొని పరిశ్రమ భవిష్యత్తుపై చర్చించనున్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), ప్రాప్‌టెక్, సుస్థిర అభివృద్ధి, అంతర్జాతీయ పెట్టుబడులు, భవిష్యత్ నగరాల నిర్మాణం తదితర కీలక అంశాలపై సదస్సులో చర్చలు జరగనున్నాయి. భారతీయ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను అంతర్జాతీయ మార్కెట్లు, పెట్టుబడిదారులతో అనుసంధానించడమే IREC 2026 ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. సదస్సులో భాగంగా ప్రాప్‌టెక్ ఇన్నోవేషన్ షోకేస్, లగ్జరీ ప్రాపర్టీ ఎక్స్‌పోలను కూడా నిర్వహించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌ను రియల్ ఎస్టేట్, పెట్టుబడులకు కీలక వేదికగా నిలిపేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# మున్సిపల్ అవినీతిపై ఆరు నెలల విచారణ ఎందుకు?

- కింది స్థాయి సిబ్బందిపైనే చర్యలతో అనుమానాలు
- రూ.32 లక్షల రికవరీకే పరిమితం చేయడంపై బీజేపీ నేతల ప్రశ్న
- బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- స్పందించకపోతే మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక



**జమ్మికుంట, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** జమ్మికుంట మున్సిపాలిటీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్, ఏసీబీ అధికారులు ఆరు నెలలుగా విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కనుమల్ల విజయ, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కోట్ల రూపాయల అవినీతిపై విచారణ జరిపి కేవలం రూ.32 లక్షల రికవరీకి పరిమితం చేయడం 'కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు' ఉందని విమర్శించారు. కౌన్సిల్ తీర్మానం లేకుండా నిధులు దుర్వినియోగమైతే సంబంధిత కమిషనర్, మున్సిపల్ చైర్మన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మున్సిపల్ నిధులకు కమిషనర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా వ్యవహరిస్తారని, తీర్మానం లేని బిల్లులు, అక్రమ చెల్లింపులపై పర్యవేక్షణ ఆయన బాధ్యత అని అన్నారు. అప్పటి కమిషనర్, చైర్మన్‌కు తెలియకుండా కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం కావడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వారిపై చర్యలు తీసుకోకుండా కింది స్థాయి సిబ్బందిపైనే చర్యలు తీసుకోవడంపై ఏసీబీ, విజిలెన్స్ అధికారుల తీరును అనుమానిస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి ప్రణవ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడిన వారందరిపై ప్రభుత్వం, కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా, ముట్టడి చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు ఆకుల రాజేందర్, బచ్చు శివకుమార్, కైలాసకోటి గణేష్, రాచపల్లి ప్రశాంత్, ఆడువాల శ్రీధర్, కేస స్వరూప, గర్రెపల్లి నిరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితికి ప్రత్యేక బస్సులు

**రద్దీ మార్గాలను ముందుగానే గుర్తించాలి : కరీంనగర్ జోన్ ఈడీ**

- బస్సుల కండిషన్ పరిశీలించి సిద్ధంగా ఉంచాలి
- ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- సమయపాలన, మెరుగైన సేవలపై దృష్టి



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** వినాయక చవితి సందర్భంగా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని టీజీఎస్ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ పగిడిమర్రి సోలమన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బస్టేషన్‌లోని ఈడీ కార్యాలయంలో ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ రీజియన్ల ఆర్ఎంలు, పర్సనల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. నాలుగు రీజియన్ల ఆర్థిక స్థితిగతులు, సంస్థ పనితీరు, ప్రయాణికుల రవాణా అవసరాలు, సమస్యలపై సమీక్షించారు. పండుగ సందర్భంగా రద్దీ ఎక్కువగా ఉండే మార్గాలను ముందుగానే గుర్తించి అదనపు, ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచాలని సూచించారు. బస్సులు సమయానికి నడిచేలా చర్యలు తీసుకోవడంతో పాటు వాటి కండిషన్‌ను ముందుగానే పరిశీలించాలని ఆదేశించారు. డ్రైవర్లు, కండక్టర్లు అప్రమత్తంగా ఉండేలా చూడాలని, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రద్దీ సమయాల్లో బస్టాండ్లలో ప్రయాణికులకు సమాచారం అందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్ఎంలు డి. విజయభాను, బి. రాజు, ఏ. శ్రీరామ్, ఎస్. భవానీ ప్రసాద్, పర్సనల్ ఆఫీసర్లు ఎం. సంపత్‌కుమార్, ఆర్‌జి. జిబ్లా, బి. వీరన్న, బి. శ్యామలాదేవి, ఈడీ కార్యదర్శి వి. శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

# గూడెంలో అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ముస్తాబాద్, సెప్టెంబర్ 08 జనం సాక్షి :** ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామంలో చేసిన పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గూడెంలో ఆరు బ్లాక్ లలో మొత్తం 48 ఇండ్లు జీ ప్లస్ విధానంలో ఇందిరమ్మ ఇండ్లు ఉండగా, జిల్లా కలెక్టర్ పరిశీలించి.. మొత్తం ఎన్ని కుటుంబాలు నివాసం ఉన్నాయి?సౌకర్యాలపై ఆరా తీశారు. డీఎంఎఫ్టీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎంపీ ల్యాడ్స్ తో బోర్ వేయగా, జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డి ఈ సాజిద్, తాసిల్దార్ ఎండి ఫారుక్, ఎంపీడీవో లచ్చులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ తాటిపల్లి శంకర్, అంజన్ రావు, గ్రామపంచాయతీ పాలకవర్గం పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డిప్యూటీ ఈఈ

- క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికేట్ కోసం రూ.10 వేలు డిమాండ్
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ సిటీ రేంజ్-1 అధికారులు



**ముషీరాబాద్, సెప్టెంబర్ 8 (జనం సాక్షి):** కాంట్రాక్టర్‌కు క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికేట్ జారీ చేసేందుకు రూ.10 వేల లంచం తీసుకుంటూ ముషీరాబాద్ డివిజన్ క్వాలిటీ కంట్రోల్ సెల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సాయిరామ్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. తెలంగాణ ఏసీబీ మంగళవారం విడుదల చేసిన ప్రెస్‌నోట్ ప్రకారం.. ఫిర్యాదుదారు చేపట్టిన రెండో కాంట్రాక్ట్ పనికి క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికేట్ జారీ చేసేందుకు సాయిరామ్ రూ.10 వేలు డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించగా, అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించారు. మంగళవారం లంచం తీసుకుం టుండగా సాయిరామ్‌ను సిటీ రేంజ్-1 అధికారులు పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. అక్రమ లబ్ధి కోసం విధులను దుర్వినియోగం చేసి లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ పేర్కొంది. నిందితుడిని నాంపల్లిలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ఐ అదనపు ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపింది. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. 9440446106 వాట్సాప్ నంబర్, తెలంగాణ ఏసీబీ సోషల్ మీడియా ఖాతాలు, కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# ఉరివేసుకుని యువకుడి మృతి

**మల్లాపూర్, సెప్టెంబర్ 8 (జనం సాక్షి):** మండల కేంద్రంలోని దుబ్బగట్టు శివారులో ఓ యువకుడు ఉరివేసుకుని మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మల్లాపూర్‌కు చెందిన బైరవేణి శ్రీనివాస్ (40)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో సుమారు పది రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి శ్రీనివాస్ ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం తన కుమారుడు విఘ్నేష్‌కు తాను చనిపోతున్నట్లు సందేశం పంపిన అనంతరం దుబ్బగట్టు శివారులోని టేకు చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మద్యానికి అలవాటుపడి, కుటుంబ సమస్యలతో మనోవేదనకు గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు మృతుడి సోదరుడు భైరవేణి కిషోర్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు మల్లాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ఇంటింటికి 6 మొక్కలు పంపిణి చేసిన చైర్మన్ శీరిష కృష్ణారెడ్డి**

**శామీర్ పేట్, సెప్టెంబర్ 8(జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణతో పాటు అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వన మహోత్సవం--2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళ వారం రోజు అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 17, 18, 19, 20వ వార్డుల్లో ఇంటింటికీ 6 మొక్కల చొప్పున పంపిణీ చేశారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని నిరంతరం సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అధికారులు, నాయకులు ప్రజలకు సూచించారు. ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి, వాటికి క్రమం తప్పకుండా నీరు అందిస్తూ సంరక్షించాలని అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ రాంప్రసాద్, 20వ వార్డు కౌన్సిలర్ మౌనిక దినేష్ , ఇతర కౌన్సిలర్లు, మున్సిపల్ ఏఈఈ సనా షాహీన్, మున్సిపల్ శాఖలోని అన్ని విభాగాల అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటిలో 6 మొక్కలు నాటి వాటిని బాధ్యతగా సంరక్షించడం ద్వారా పచ్చని అలియాబాద్ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో రెండు క్లిష్ట శస్త్రచికిత్సలు విజయవంతం

*ఫ్రాక్చర్‌కు క్లిష్టమైన ఎల్బో సర్జరీ.. మహిళకు విజయవంతంగా తుంటి కీలు మార్పిడి*

- వైద్యులు, సిబ్బందిని అభినందించిన సూపరింటెండెంట్
- అధునాతన శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని వెల్లడి



**పెద్దపల్లి, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో రెండు క్లిష్టమైన ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలను వైద్య బృందం విజయవంతంగా నిర్వహించింది. తురకల మద్దికుంటకు చెందిన 38 ఏళ్ల వ్యక్తి బైక్ నుంచి ప్రమాదవశాత్తు పడటంతో మోచేతికి తీవ్ర గాయమైంది. పరీక్షల్లో ఫ్రాక్చర్‌తో పాటు ఎల్బో సబ్‌లక్సేషన్ ఉన్నట్లు గుర్తించి మంగళవారం క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించారు. అలాగే కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన 42 ఏళ్ల మహిళ మూడు నెలలుగా తీవ్రమైన తుంటి నొప్పితో బాధపడుతోంది. వైద్య పరీక్షల్లో ఏవీఎన్ కారణంగా కుడి తుంటి కీళ్లలో ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో ఆమెకు టోటల్ హిప్ ఆర్థ్రోప్లాస్టీ (తుంటి కీలు మార్పిడి) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కుమార్ గౌడ్, డాక్టర్ మేఘన, డాక్టర్ వినయ్‌కుమార్, అనస్థీషియా వైద్యులు డాక్టర్ రామం, డాక్టర్ స్వాతి, నర్సింగ్, ఓటీ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్ అభినందించారు. జిల్లా ఆసుపత్రిలో లాప్రోస్కోపిక్, యూరాలజీ, లేజర్, ఫిస్టులా, ఆర్థ్రోస్కోపీ తదితర అధునాతన శస్త్రచికిత్సలు అందుబాటు లో ఉన్నాయని, ప్రజలు సేవలను వినియోగించుకోవాలని కోరారు

# పుష్కరాలు, ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- అక్టోబర్ 1 నుంచి ధాన్యం కొనుగోళ్లు
- పుష్కర పనులు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- భక్తులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి

**పెద్దపల్లి, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** ఖరీఫ్ 2026 ధాన్యం కొనుగోళ్లు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా అధికారులు ఆదేశించారు. అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించి అక్టోబర్ 1 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు సజావుగా పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులకు అవసరమైన హమాలీలను ముందుగానే ఏర్పాటు చేయడంతో పాటు రవాణా వాహనాలకు జీపీఎస్ ట్రాకర్లు తప్పనిసరిగా అమర్చాలని, అధిక లోడును అనుమతించవద్దని ఆదేశించారు. తూకం, తేమ శాతం కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, గోదాములు, రవాణా, మిల్లుల మ్యాపింగ్ తదితర ఏర్పాట్లను పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి అప్‌లోడ్ చేసే ఫొటోలు, వివరాలను ఏఐ సాంకేతికతతో పరిశీలించనున్నందున తాజా సమాచారాన్నే నమోదు చేయాలని సూచించారు. మరోవైపు గోదావరి పుష్కరాల పనులను సంబంధిత శాఖలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. రోడ్ల అభివృద్ధికి ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో సుమారు రూ.25 కోట్లు, మంథని ఆలయాల సమగ్ర అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించి సుమారు నాలుగు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. ఘాట్లు, రోడ్లు, ఆలయాలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, పార్కింగ్, కేశఖండనం, అన్నదానం వంటి సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన భూసేకరణను స్థానిక రైతులతో సమన్వయంతో వేగవంతం చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలకు కలెక్టర్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. గర్భిణీల నమోదు, టీకాలు, కుటుంబ సంక్షేమం, ప్రజారోగ్య కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, డేటా ఖచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డిజిటల్ సాంకేతికతతో ఆరోగ్య కార్యక్రమాల అమలు, పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

# అసలైన ఉద్యమం రైస్ మిల్లర్లతోనే ప్రారంభమైంది : సయ్యద్ రఫీ

**రైస్ మిల్లర్ల సమస్యలపై ఉద్యమబాట**



**ముషీరాబాద్, సెప్టెంబర్ 08 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల సమస్యలపై జరిగే అసలైన ఉద్యమం మొదలవుతుందని ప్రొఫెసర్ జయశంకర్ సార్ చెప్పిన మాటలు ఇప్పుడు నిజమవుతున్నాయని, రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చేపట్టిన పోరాటమే అందుకు నిదర్శనమని తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక కార్యకర్త సయ్యద్ రఫీ అన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద గల ధర్నా చౌక్ లో రైస్ మిల్లర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సయ్యద్ రఫీ మాట్లాడుతూ, పదిమందికి ఉపాధి కల్పించే స్థాయిలో పరిశ్రమలను నడుపుతున్న రైస్ మిల్లర్లు సైతం సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమన్నారు. రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాకపోతే నిస్సహాయ స్థితిలో ఉన్న మిల్లర్లు మరింత తీవ్రంగా ఆందోళన చేపట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. అధికారుల వేధింపులను ఎదుర్కొనేందుకు రైస్ మిల్లర్లు ఐక్యంగా, సంకల్పంతో ముందుకు సాగాలని రఫీ సూచించారు. వారి పోరాటానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. రైస్ మిల్లింగ్ రంగాన్ని పరిరక్షించడం ద్వారా రైతుల ప్రయోజనాలతో పాటు రాష్ట్ర వ్యవసాయ వ్యవస్థను కాపాడినట్లవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉట్కూరు వీరేశం, ట్రెజరర్ విశ్వనాథం వెంకటరమణతో పాటు వివిధ జిల్లాలకు చెందిన రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

Happy Anniversary
జనంసాక్షి 16వ వార్షికోత్సవం
ప్రత్యేక అనుబంధం
12
జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
09 సెప్టెంబర్ 2026
16th Anniversary Celebrations

## తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో
# దోషికి ఉరిశిక్ష

- తీర్పు వెలువరించిన పోక్సో కోర్టు సంచలన



**తిరునల్వేలి, సెప్టెంబర్8 (జనంసాక్షి) :** మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఒక దోషికి మరణశిక్ష విధిస్తూ, మరో ఇద్దరికి కఠిన కారాగార శిక్షలను ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, 2022లో తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికకు ఓ ప్రార్థనా స్థలంలో విలాతికుళానికి చెందిన పెయింటర్ మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. ఫోన్ నంబర్లు మార్చుకున్నాక వారిద్దరూ సుమారు రెండు వారాల పాటు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన మునీశ్వరన్, సదరు బాలికను తన ద్విచక్ర వాహనంపై మీనాక్షిపురంలోని తన సోదరి నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం మునీశ్వరన్ తన స్నేహితులైన చిన్నకుట్టి (28), మురుగేశన్ (23)లను అక్కడికి పిలిపించాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, వారు కూడా బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ దారుణం గురించి బాధితురాలు తన తల్లిదండ్రులకు తెలపడంతో, వారు పాళయంకోట్టై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేశ్ కుమార్ మంగళవారం తుది తీర్పు వెలువరించారు. నిందితుడు చిన్నకుట్టికి మరణశిక్ష విధించగా, మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.

# సభాపతిపై దాడి ప్రజాస్వామ్యానికే మచ్చ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- బీఆర్ఎస్ అహంకార, భూస్వామ్య భావజాలానికి ఇది నిదర్శనం
- బీఆర్ఎస్ భావజాలం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం
- సభాపతి స్థానాన్ని, ప్రజాస్వామ్య గౌరవాన్ని కాపాడుకోవాలి
- దామోదర రాజనర్సింహ ప్రతిపాదించిన తీర్మానానికి సంపూర్ణ మద్దతు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** శాసనసభాపతి స్థానంలో ఉన్న గౌరవ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పై ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యులు చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తించిన తీరు యావత్ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని, ఇది కేవలం ఒక వ్యక్తికి జరిగిన అవమానం కాదని, మొత్తం చట్టసభకు జరిగిన ఘోర అవమానమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో మంత్రి దామోదర రాజనర్సింహ ప్రతిపాదించిన తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తూ డిప్యూటీ సీఎం మాట్లాడారు. సభాపతి స్థానంలో కూర్చున్న వ్యక్తి కేవలం ఒక వ్యక్తి కాదని, ఆయన సభ గౌరవానికి, స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. సభాపతిని అవమానించడం అంటే మొత్తం సభను అవమానించడమేనని స్పష్టం చేశారు. ఇది సభా ధిక్కారానికి సమానమైన వ్యవహారమని అన్నారు. సభాపతిగా గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అన్ని పార్టీల సభ్యులు ఎన్నుకున్నారని, ఆయనను ఆ స్థానంలో కూర్చోబెట్టి సభను నడిపించే బాధ్యత అప్పగించారని గుర్తుచేశారు. ఆయన దళిత వర్గం నుంచి ఎదిగి వచ్చిన వ్యక్తి కావడం అదనపు గౌరవానికి కారణమని, అయితే ఆయనను 'దళిత స్పీకర్'గా మాత్రమే చూడటం సరికాదని.. ఆయన మొత్తం శాసనసభకు స్పీకర్ అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఇంకా తమ పాత భూస్వామ్య, ఫ్యూడల్ మనస్తత్వాన్ని మర్చిపోలేదనడానికి ఈ సంఘటనే సజీవ నిదర్శనమని అన్నారు. దళిత వర్గం నుంచి వచ్చి సభాపతి స్థానంలో కూర్చున్న ప్రసాద్ కుమార్ ను గౌరవించకపోవడం బిఆర్ఎస్ పార్టీ నైజానికి అద్దం పడుతోందన్నారు. "అధికారం కోల్పోయామనే ఉక్రోషంతో, తిరిగి రాష్ట్రాన్ని తమ గుప్పెట్లోకి తీసుకోవాలనే దుర్బుద్ధితో బిఆర్ఎస్ నాయకత్వం ఈ కుట్రలకు పాల్పడుతోంది" అని మండిపడ్డారు. సభలో జరిగిన రచ్చ ఆషామాషీగా జరిగింది కాదని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందనే అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు రోజు ఫామ్ హౌస్ లో బిఆర్ఎస్ ఎల్పీ మీటింగ్ జరిగిందని, ఆ 'ఫామ్ హౌస్ కాన్స్పిరసీ'లోనే ప్రజాస్వామ్యంపై దాడి చేసేందుకు పథకం రచన చేశారని ఆరోపించారు. కాన్స్పిరేటర్లు నడిపించిన రోల్ ప్లేయర్లుగా కొందరు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభలో ప్రవర్తించారని, ప్రధాన సూత్రధారులు బిఆర్ఎస్ అత్యున్నత నాయకత్వమేనని స్పష్టం చేశారు. సభలో టీషర్టులు, నల్లచొక్కాలు ధరించి వాటిపై నినాదాలు రాసుకుని రావడాన్ని కూడా భట్టి తప్పుబట్టారు. సభలో బ్యాడ్జీలు, ప్రదర్శనాత్మక గుర్తులు ధరించరాదనే నిబంధనలు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూపొందించిన రూల్‌బుక్‌లోనే ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. తమ ప్రభుత్వమే రూపొందించిన నిబంధనలను అమలు చేస్తున్న సభాపతిపై బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేయడం విడ్డూరమని అన్నారు. నిబంధనలు అమలు చేసినందుకే సభాపతిని పరుష పదజాలంతో దూషించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సభాపతి తల్లిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై భట్టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం దళిత వర్గాలకు సంబంధించిన అంశం కాదని, తెలంగాణ సమాజం సంస్కారం, సంస్కృతి, మహిళల పట్ల గౌరవానికి సంబంధించిన సమస్య అని అన్నారు.

## అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటించాలి

- ఫైర్ సర్వీసెస్ డీజీ విక్రమ్ సింగ్ మాన్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు, బోధనా సిబ్బంది ప్రాణ రక్షణే ధ్యేయంగా అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ స్పష్టం చేశారు. ఫైర్ ఎన్ ఓసీలు సులువుగా ఇప్పిస్తామంటూ మభ్యపెట్టే దళారులు, అనధికార వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని, తప్పుడు మార్గాల్లో నకిలీ ధ్రువపత్రాలు సమర్పిస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు ఎదుర్కోక తప్పదని ఆయన విద్యా సంస్థల యాజమాన్యాలను హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఫైర్ సర్వీసెస్ డైరెక్టరేట్‌లో విద్యా సంస్థలు, ఇతర భాగస్వామ్య వర్గాలతో ఫైర్ ఎన్‌ఓసీల జారీ, అనుసరించాల్సిన విధానాలపై ఆయన ప్రత్యేక అవగాహన, చర్చా సమావేశం నిర్వహించారు. పాఠశాలల నిర్వహణకు స్వేచ్ఛ ఉన్నప్పటికీ, ప్రభుత్వ భద్రతా నిబంధనలు, మార్గదర్శకాలను మాత్రం తప్పనిసరిగా పాటించాల్సిందేనని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డీజీ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ విద్యా భవనాలకు వర్తించే అగ్నిమాపక భద్రతా నిబంధనలు, ఫైర్ ఎన్‌ఓసీ ప్రక్రియలో పాటించాల్సిన అత్యవసర నిబంధనలను వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు ఎప్పటికప్పుడు సక్రమంగా పనిచేసేలా నిర్వహణ చూసుకోవాలని సూచించారు. భవన పరిస్థితులను బట్టి విద్యా సంస్థల యాజమాన్యాలు సెల్ఫ్ డిక్లరేషన్ సమర్పించవచ్చని లేదా రెగ్యులర్ ఫైర్ ఎన్‌ఓసీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన స్పష్టత ఇచ్చారు. ఇదే సమావేశంలో పలు విద్యా సంస్థల ప్రతినిధులు లేవనెత్తిన ఇబ్బందులపై సుదీర్ఘంగా చర్చించారు.

ముఖ్యంగా చాలా కాలం క్రితమే నిర్మించిన పాత భవనాల్లో సెట్‌బ్యాక్స్, అత్యవసర సమయంలో బయటకు వెళ్లే మార్గాలు ఏర్పాటు చేయడంలో ఉన్న ఇబ్బందులు, వాణిజ్య సముదాయాలతో కూడిన కాంప్లెక్స్‌లలో నిర్వహిస్తున్న విద్యా సంస్థలకు ఎదురవుతున్న సమస్యలను ప్రతినిధులు డీజీ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన, ఇప్పటికే కొనసాగుతున్న భవనాల విషయంలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులను ఒకే విధంగా పరిశీలించేలా, తనిఖీ అధికారులందరికీ ఉపయోగపడేలా త్వరలోనే ఒక స్పష్టమైన యూనిఫామ్ చెక్‌లిస్ట్ ను ఫైర్ శాఖ తరఫున అధికారికంగా జారీ చేస్తామని ప్రకటించారు. ఫైర్ ఎన్‌ఓసీల మంజూరులో పారదర్శకతను పెంచేందుకు ఒక పటిష్టమైన వ్యవస్థను రూపొందిస్తున్నామని డీజీ తెలిపారు. ఫోర్జరీ ఎన్‌ఓసీలు, అనధికార పత్రాల సమర్పణను పూర్తిగా అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో వివిధ పాఠశాలలు, ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల సంఘాలకు చెందిన సుమారు 30 మంది ప్రతినిధులు,పలు జిల్లాల ఫైర్ అధికారులు, అసిస్టెంట్ జిల్లా ఫైర్ అధికారులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సులో అకస్మాత్తుగా మంటలు

- విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం



**హైదరాబాద్, సెప్టెంబర్8 (జనంసాక్షి) :** తెల్లాపూర్‌లోని మంథన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సులోకి విద్యార్థులు ఎక్కుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో తీవ్ర కలకలం రేగింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే పిల్లలను బస్సుకు దూరంగా తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. ఒకటో తరగతి విద్యార్థులు బస్సు ఎక్కుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు సమాచారం. క్షణాల్లోనే మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుంది. పరిస్థితిని గమనించిన సిబ్బంది వెంటనే స్పందించి విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తప్పించుకున్నారు. అయితే మంటలు తీవ్రంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా కాలిపోయి బూడిదైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ బస్సుల నిర్వహణ, ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలపై పాఠశాల యాజమాన్యం మరింత శ్రద్ధ పెట్టాలని కోరుతున్నారు. బస్సు సరైన కండిషన్‌లో లేకపోవడం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గతంలోనూ ఇదే పాఠశాలకు చెందిన మరో బస్సు మంటల్లో దగ్ధమైన ఘటన జరిగిందని గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలోని అన్ని బస్సుల ఫిట్‌నెస్, నిర్వహణపై అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. మంటలు చెలరేగిన సమయంలో బస్సులో విద్యార్థులు ఉండి ఉంటే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదృష్టవశాత్తూ పిల్లలను వెంటనే బస్సు నుంచి దూరంగా తరలించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. స్కూల్ బస్సుల్లో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు అవసరమైన భద్రతా పరికరాలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, అత్యవసర ద్వారాలు తదితర ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అనే అంశంపైనా ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనకు అసలు కారణం ఏమిటి? బస్సు ఫిట్‌నెస్ సక్రమంగా ఉందా? గతంలోనూ ఇలాంటి ఘటన జరిగిందన్న తల్లిదండ్రుల ఆరోపణల్లో వాస్తవం ఎంత? అనే అంశాలపై సంబంధిత అధికారులు, పాఠశాల యాజమాన్యం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్, నిర్వహణపై అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# చావు రాజకీయాలు చేయిస్తారా?

- కేసీఆర్‌ను అంతమొందించేందుకు కుట్ర
- కేసీఆర్ నివాసం ముట్టడి రేవంత్ ఆలోచనే
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి





**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను భౌతికంగా అంతమొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని... స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చావును కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియా ముఖంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నిప్పులు చెరిగారు. కేసీఆర్ నివాసమైన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌పై దాడులు చేస్తామని, 'చావు డప్పు' కొడతామని ఎమ్మెల్యే శంకర్ బహిరంగంగా వ్యాఖ్యానించడం రాజ్యాంగ ఉల్లంఘన అని మండిపడ్డారు. "వెయ్యి డప్పులతో కేసీఆర్ ఇల్లు ముట్టడిస్తామన్నది శంకర్ వ్యక్తిగత మాట కాదు. అది వెనుకుండి నడిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనే" అని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల వేళ సభ్యులను సభకు రానివ్వకుండా కేసీఆర్ ఫాంహౌస్ కు కాంగ్రెస్ శ్రేణులను పంపి దాడులు చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ చావు గురించి మాట్లాడినందుకు గాను రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను నేరుగా రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ ఈ రకమైన దిగజారుడు వ్యాఖ్యలు చేస్తోందని ఎద్దేవా చేశారు. హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తూ, మాజీ ముఖ్యమంత్రి ప్రాణాలకు హాని తలపెట్టేలా తీవ్ర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వేముల వీరేశంలపై రాష్ట్ర డీజీపీ తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# 13 డిమాండ్లు.. 2 రోజుల గడువు..

- ప్రభుత్వం వెంటనే స్పందించాలి!
- తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రైస్ మిల్లర్ల 13 న్యాయమైన, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను తెలంగాణ ప్రభుత్వం రానున్న రెండు రోజుల్లో పరిష్కరించడంలో విఫలమైతే, సెప్టెంబర్ 11 నుంచి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైస్ మిల్లులు నిరవధిక బంద్ పాటిస్తాయని తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వెల్లడించింది. తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్లను ఎన్నో సంవత్సరాలుగా వేధిస్తున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు మహా ధర్నా నిర్వహించింది. రైతుల నుంచి ధాన్యం సేకరణ, బియ్యం ఉత్పత్తి, ఆహార ధాన్యాల సరఫరా వ్యవస్థలో రైస్ మిల్లులు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రైతులు, కార్మికులు, రాష్ట్ర ఆహార భద్రతతో రైస్ మిల్లింగ్ రంగం నేరుగా ముడిపడి ఉంది. అయితే, దీర్ఘకాలిక పరిపాలనా జాప్యాలు, పెరుగుతున్న ఆర్థిక భారాలు, ఆకస్మిక తనిఖీలు, దాడులు, సీఎంఆర్‌కు సంబంధించిన పరిష్కారం కాని సమస్యల కారణంగా రైస్ మిల్లింగ్ రంగం తీవ్ర ఒత్తిడికి గురవుతోంది. అందువల్ల ప్రభుత్వం తక్షణమే రైస్ మిల్లర్లతో అర్థవంతమైన చర్చలు ప్రారంభించి, ఈ రంగానికి న్యాయబద్ధమైన, శాస్త్రీయ, పారదర్శకమైన, సుస్థిరమైన విధానాన్ని రూపొందించాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహిస్తున్న ఆకస్మిక దాడులను వెంటనే నిలిపివేయాలి. రైస్ మిల్లర్లతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలి. కస్టమ్ మిల్లింగ్ రైస్ ఒప్పందాన్ని ఇరుపక్షాలకు న్యాయబద్ధంగా, ఆమోదయోగ్యంగా ఉండే విధంగా రూపొందించాలని, ప్రతి రకం ధాన్యానికి శాస్త్రీయంగా టెస్ట్ మిల్లింగ్ నిర్వహించి, ఖరీఫ్ మరియు రబీ సీజన్లకు వేర్వేరుగా ఔట్‌టర్న్ రేషియోను నిర్ణయించాలని, సంబంధిత ధాన్యం రకం, నాణ్యతను పరిగణనలోకి తీసుకోవాలని, ప్రస్తుత నిర్వహణ ఖర్చులు, పెరుగుతున్న విద్యుత్, కార్మిక, నిర్వహణ వ్యయాలను పరిగణనలోకి తీసుకుని క్వింటాల్ ధాన్యానికి మిల్లింగ్ ఛార్జీని రూ.150గా నిర్ణయించాలని, పాత గన్నీ బ్యాగ్ ధరను ఒక్కో బ్యాగ్‌కు రూ.11గా నిర్ణయించాలని, 2014 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న సివిల్ సప్లైస్ మిల్లింగ్ ఛార్జీలు, రవాణా ఛార్జీలు, డ్రైయేజ్ ఛార్జీలు, కస్టోడియన్ ఛార్జీలను వెంటనే చెల్లించాలని, మిల్లర్లపై విధించిన 25 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీని పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేసింది. 2022-23 రబీ టెండర్ ధాన్యం ధరను న్యాయబద్ధంగా, సహేతుకంగా నిర్ణయించాలి. రైస్ మిల్లులను వ్యవసాయ అనుబంధ పరిశ్రమలుగా గుర్తించి, 200 హ్రా వరకు విద్యుత్ సరఫరాను లో టెన్షన్ కేటగిరీ కింద అందించాలి. ప్రభుత్వం నిర్ణయించిన ఎఫ్ఏక్యూ (ఫేయిర్ అవరేజ్ క్వాలిటీ) నాణ్యత ప్రమాణాలకు అనుగుణమైన ధాన్యాన్ని మిల్లులకు సరఫరా చేయాలని, ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు అనుగుణంగా లేని ధాన్యం సరఫరా చేసిన సందర్భంలో, సరఫరా చేసిన ధాన్యం వాస్తవ నాణ్యతను బట్టి బియ్యం రికవరీ/ఔట్‌టర్న్ రేషియోను నిర్ణయించాలని, ప్రభుత్వ విధానాలు, విధానపరమైన జాప్యాలు లేదా వ్యవస్థలోని సమస్యల కారణంగా నాన్ విల్‌ఫుల్ డిఫాల్టర్స్‌గా మారిన రైస్ మిల్లర్లకు, వారి ఖాతాలను పూర్తిగా తేల్చి, బకాయిలను నాలుగు విడతల్లో చెల్లించే అవకాశం కల్పించాలని, ఖరీఫ్ ధాన్యాన్ని పూర్తిగా రా రైస్‌గా, రబీ ధాన్యాన్ని పూర్తిగా బాయిల్డ్ రైస్‌గా మాత్రమే స్వీకరించాలని, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) విధించిన కఠినమైన నిబంధనలను, రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న వాస్తవిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని సహేతుకంగా సడలించాలని, ఈ డిమాండ్లు కేవలం రైస్ మిల్లింగ్ పరిశ్రమకు సంబంధించిన సమస్యలు మాత్రమే కావని, ఇవి వేలాది మంది కార్మికుల ఉపాధి, రైతుల ప్రయోజనాలు, రాష్ట్ర ఆహార ధాన్యాల నిర్వహణ వ్యవస్థ, ఆహార భద్రతతో నేరుగా ముడిపడి ఉన్న అంశాలున్నాయని తెలిపింది. అందువల్ల ప్రభుత్వం ఈ సమస్యలను సానుకూల దృక్పథంతో పరిగణించి, రైస్ మిల్లర్లతో తక్షణమే అర్థవంతమైన చర్చలు జరిపి, దీర్ఘకాలిక సమస్యలకు శాస్త్రీయమైన, న్యాయబద్ధమైన మరియు పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలని అసోసియేషన్ కోరింది. ప్రభుత్వం తక్షణమే రైస్ మిల్లర్లతో అర్థవంతమైన చర్చలు ప్రారంభించి, పై డిమాండ్లను అంగీకరించి పరిష్కరించేందుకు సానుకూల చర్యలు తీసుకోని పక్షంలో, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రైస్ మిల్లులను సెప్టెంబర్ 11, 2026 నుంచి బంద్‌కు పిలవడం మినహా తమకు మరో మార్గం ఉండదని రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్పష్టం చేస్తోంది.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370